UNIVERSAL LIBRARY
OU_206142
UNIVERSAL LIBRARY

# పీ ఠి క.

వివేకౌదార్యప్రాభవసౌశీల్యాదిగుణంబుల కాలవాలము లై తామరతంపరగ నిరంతరాభివృద్ధిం గాంచుచుండు నమాత్యవంశములలో వాడ్రేవు (వాడరేవు) వారివంశ మొక్కటిగ్గాను యలరారుచున్నది. ఈవంశమున నమితకీర్తిశాలు లగు ప్రభువులు, శ్రీమంతులు, మంత్రిలు, రాజకీయోద్యోగులు మొదలగుమహాపురుషు లనేకులు గలరు. వారిలో నేతద్గ్రంథమునకు నాయకుఁడైన వేంకటరాయఁడుగారి జ్యేష్ఠపుత్త్రుఁడును, నేతత్కావ్యప్రకాశకుఁడును, కీర్తిశేషుఁడును నగు వేంకటాచలపతిగా రొకరు. ఈయనకు 'చలమయ్య' అను నామాంతరము గలదు. ('చలమయ్య' యనియే సంతకము చేయుచుండువారు.) ఈయనజన్మస్థానము గోదావరీమండములోని మచంద్రపురము తాలూకా దుప్పలపూఁడిగ్రామము. ఈన బాల్యమున సామాన్యపాఠశాలలోనే విద్యాభివృద్ధి నొందుకొని ప్రాయము వచ్చినపిమ్మట తత్సమీపమున నున్నసలపూఁడి' యను గ్రామమునకుఁ గరణమై రాజకార్యక్షాణాదివ్యాపారములయందు మిక్కిలి నేర్పరి యను ప్రఖ్యాతిఁ బొందుచుండెను. కొంతకాల మైనతరువాత నీయనగావగారును, అక్కాలమున సుప్రసిద్ధలౌకికజ్ఞానసంపన్నుఁ

చును, పిఠాపురసంస్థానముఖ్యమంత్రియు నగు కూచిమంచి గోపాలకృష్ణమంత్రిగారి ప్రేరణమువలన నీయనకు 'కోలంక వీరవరము' ఎస్టేట్ల జమీందారుగారియొద్ద మంత్రిపదవి లభించెను. ఈప్రజ్ఞాశాలి తనయున్నతపదమును గడుంగడు సమర్థతతోఁ బరిపాలించెను. అనేకులు మహారాజు లీతనిసామర్థ్యమును మెచ్చుకొనుచుండిరి. సమున్నతసుందరాకారుం డగు నీ శేముషీమంతుని రాజకార్యనిర్వహణప్రావీణ్యమును గాంచినవారు, 'ఆకారమునకుఁ దుల్యమైనప్రజ్ఞ' అని భావించుచుండిరి. ఈతనిప్రభువర్యుఁ డీతని కీపదవి నొసగినప్పుడే పీఠికాపురమున నివాసయోగ్యమగు స్థలమునుగూడ దయచేసెను. నాఁటినుండియు నీతనివంశమువారు పీఠికాపురముననే నివసించుచున్నారు.

కొంతకాల మిట్లు జరిగినతరువాత చలమయ్యగారికి పీఠికాపురసంస్థానప్రధానమంత్రిత్వము సంప్రాప్తించెను. గొప్పపదవి నీతఁడు మిక్కిలినేర్పుతో సమర్థించెను. అప్పటను విశాఖపట్టణమండలములోని సాలూరుసంస్థానమునకు గూడ మంత్రియై గొంతకాల ముండి శరీరమున కనారోగ్యము గలుగఁగా మరల స్వస్థాన మగు పీఠికాపురమును జేరి క్రీ. శ. 1893 వ సంవత్సరమున ననఁగాఁ దననలువదియేడ యేఁట మహాలోకమునకుఁ గీర్తిశరీరముతోఁ బాటు భౌతికశరీరమును విడిచి

యామహాత్ముఁడు పరలోకమున కేఁగెను. ఈయన పరాభవ సంవత్సరము (1846) న జనియించెను.

చలమయ్యగారు నిరతాన్నప్రదాత. ఈయన తానెంత యున్నతపదమునం దున్నను పండితజనవిధేయుఁడై భాషాభిమానియై సంగీతసాహిత్యప్రియుఁడై యుండెను. ఈచలమయ్యగారిపుత్త్రులలో జ్యేష్ఠులగు వేంకటరావుగారును, ద్వితీయపుత్త్రులగు వేంకటరత్నముగారును శ్రీమంతులై యమితప్రాభవసంపన్నులై సత్సంతానము గలిగి పీఠికాపురమున వర్ధిల్లుచున్నారు. కృతినాయకుఁడు మొదలుగ నిప్పటివఱకు నవతరించుచున్నవీరివంశావళి యీపొత్తమున వేఱొకచో నచ్చొత్తింపఁబడియున్నది.

## నాచికేతూపాఖ్యానము.

ఉపనిషత్ప్రోక్తమై, సన్మార్గప్రబోధకమై పితృభక్తిప్రకాశకమై, విచిత్రకథావిలసితమై, హృదయరంజకమై యొప్పుచుండు నాచికేతుమహాముని దివ్యచరిత్రమును కృతినాయకుని జనకుఁడగు వాడ్రేవు చలమయామాత్యుని యనుమతి ననుసరించి మిక్కిలి మల్లికార్జునకవి యాంధ్రపద్యకావ్యముగా రచియించెను. ఇక్కథ నాంధ్రకవు లిద్దఱుముగ్గురు తెలుఁగునకుఁ దెచ్చియుండిరి. శ్రీనాథమహాకవి బావమఱఁది యగు దగ్గుపల్లి దుగ్గనకవి వారిలో నొక్కఁడు. చందలూరి చిక్కయ్యకవి మఱియొక్కఁడు. వీరుగాక యాధునికకవి వేఱొకఁడు గలఁడు.

మల్లికార్జునకవి ప్రౌఢుఁడైనవిద్వత్కవి. ఈతనికవిత్వము పర్వతశృంగనిస్సరన్నిర్ఝరప్రవాహముం బోలి ధారాశుద్ధి గలిగి మనోహరమై విలసిల్లుచుండును. ఈతఁ డింకను గొన్ని గ్రంథములను రచియించి వన్నె కెక్కెను. పండితతిలక మగు ముక్కలి దుర్గయ్యశాస్త్రులవారితనిపుత్త్రుఁడే. గోదావరీమండలములోని పెద్దాడ గ్రామము వీరి నివాసస్థలము. ఈతఁడును, అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి, వెలివెల సోమకవి, మూడభూషి నరసింహాచార్యకవి మొదలగువారును సమకాలికులు.

ఈగ్రంథములోని ఛందోవ్యాకరణాది ప్రయోగము లచ్చటచ్చట నాదికవులమతమునకుఁ గొంచెము భిన్నములుగా నున్నను, తరువాతికవుల ప్రయోగముల నవి యనుసరించియే యున్నవి. అయినను,

"అస విని కాలుఁ డిట్లను సురర్షివరా !" (౧౬౦ పు. కడపటి రెండవపంక్తి.)

"అరయుఁగ సకలదేవర్షిభూసు..." (౧౬౨ పు. మొదటి రెండవపంక్తి.)

అను నూతనప్రయోగ మీగ్రంథమునఁ గానవచ్చుచున్నది. లక్షణగ్రంథములయందు దీని కాధారము గానరాలేదు. కాని, ఋకారగుణమైన 'అర్' అనుదానిలోని 'అకారమును' కిక్కవి విశ్రమము ననుసంధించి తనప్రయోగస్వాతంత్ర్యమును జూపె నని తోఁచుచున్నది.

సనాతనధర్మప్రతిపాదకమును, ఉపనిషత్ప్రోక్తమును, నీతిప్రబోధకమును నగు నిక్కావ్యకథ విశ్వసనీయమే కాని యిందున్న దివ్యమహిమల స్వభావాస్వభావములనుగూర్చిన విషయములుమాత్రము చ ర్చ నీ య ము లు గా వు. విధి సంఘటనముమాత్ర మవిలంఘనీయ మని యిందున్న యితివృత్తము దెలుపుచున్నది. మఱియు నాచికేతుమహర్షి పితాజ్ఞా పరిపాలనము శ్రీరామచంద్రుని చారిత్రమును మఱపించుచున్నది. రాజకుమారి యగు చంద్రమతి పాతివ్రత్యమహిమ మసదృశము.

ఈగ్రంథమునం గల నరకలోకవర్ణనము దుష్టాత్ముల హృదయములకు భయంకరమై కలుషమార్గములనుండి వారలను మరలింప సమర్థమై యొప్పారుచున్నది.

ఈనాచికేతూపాఖ్యానమును ప్రప్రథమమున నేతత్కృతినాయకుని జ్యేష్ఠపుత్త్రులైన వాడరేవు చలమయ్యగారు (క్రీ. శ. 1876) ముద్రింపించి తమపితృభక్తి నెఱపి లోకోపకారముంగావించియున్నారు. భాషాభిమానులును, చలమయ్యగారి ద్వితీయపుత్త్రులును, ఔదార్యాదిసద్గుణవిభాసితులును, శ్రీమంతులును నగు వేంకటరత్నము పంతులుగారు రెండవకూర్పును ముద్రింపించి తమపితృభక్తిని వెల్లడించి నిజవంశము నకు వన్నెను గూర్చిరి. పరమేశ్వరుఁడు వీరికి నితోధికైశ్వర్యాద్యభివృద్ధియు, చిరాయువును గూర్చి రక్షించుఁగాక !

ఈగ్రంథము పూర్వముద్రణమునఁ గానవచ్చిన (లేఖక ముద్రణప్రమాదజనితము లైన) ఛందోవ్యాకరణాదిదోషములను యథామతిని సవరించి మామిత్రు లగు వేంకటరత్నము పంతులుగారియెడల నాకుం గల యాదరము నీరీతిని వెల్లడించి నాఁడను. ఇందు నాయజ్ఞానమునఁ గలిగిన దోషము లింక నెవ్వైన నున్నచో విజ్ఞులు క్షమింతు రని వేఁడుచున్నాను.

పిఠాపురము.
25-9-1926.

ఇట్లు విబుధవిధేయుఁడు,
న డ కు దు టి వీ ర రా జు.

ఈగ్రంథమునం గల “ అంతర్ముఖపత్త్రము ” (Inner Title page) వెనుకటిదాని ననుసరించియే వ్రాయఁబడినది.

ప్ర కా శ కుఁ డు.

# కృతిపతి తరువాతి వంశవృక్షము

- వేంకటరాయఁడుగారు (కృతిపతి.)
  - (వేంకటాచలపతి) చలమయ్యగారు
    - వేంకటరావుగారు
      - చిన్న వేంకటరత్నము
        - వేంకట రావు
        - భానుమూర్తి
        - జోగారావు
      - జోగారావు
        - కుమార్తెకలదు
    - వేంకటరత్నముగారు
      - చలమయ్య
        - చిన్న వేంకట రత్నము
      - *వేంకటరత్నము (నారాయణమూర్తి గారి దత్తుఁడు)
      - రమేశ చంద్రుఁడు
      - గోపాల కృష్ణమ్మ
  - నారాయణమూర్తిగారు
    - *వేంకటరత్నేశ్వరరావు (దత్తుఁడు)
  - భుజంగరావుగారు

మౌద్గల్యగోత్రము.

శ్రీవేంకటరమణసహాయః.

శుభమస్తు.

అవిఘ్నమస్తు.

# నాచికేతోపాఖ్యానము.

## ప్రథమాశ్వాసము.

### అవతారిక.

శ్రీరామారమణాది సర్వసుమన♦శ్శీర్షోల్లసత్స్వర్ణకో
టీరస్థాపిత పద్మరాగమణివా♦టీకాంతినీరాజిత
శ్రీరాజీవపదద్వయుం డగకుమా♦రీభర్త రక్షించు ల
క్ష్మీరమ్యాత్మనివాసశేవుకులజున్♦శ్రీవేంకటామాత్యునిన్.

ఉ. శంకరుఁడొక్కనాఁడు నిజ♦సౌధములోన నితంబవస్త్రమున్
గొంకకలాగ సిగ్గుతమి♦గూడ్కొనఁగొంగొకచేతఁబూని యే
వంకకుఁ బోయినం గనెడు♦పంచముఖుం గని లజ్జఁజెందు న
ప్పంకజగంధి పార్వతి కృ♦పానిధి వేంకటరావుఁ బ్రోవుతన్.

ఉ. శ్రీవనజాయతాక్షి కడుఁ♦జెల్వగు నీయమృతంపుబావియా
మోవియొసంగి యార్పు తను♦భూపరితాపమటంచు వేఁడుల

క్ష్మావరుఁ డీవుతన్ గుణవి♦శిష్టతనూజధనంబు భూరివా
ద్రేవుకులాబ్ధిపాండురమ♦రీచికి వేంకటరాయమంత్రికిన్.

గీ. పద్మవైరిసహోదరి ♦ పద్మపాణి
పద్మమున వసియించిన ♦ పద్మగంధి
పద్మ వేంకటరాయని ♦ సద్మమునను
నిలిచి కరుణార్ద్రదృష్టి మ♦న్నించుఁగాత.

చ. సనకసనందనాదిముని♦సంఘము గొల్వఁగ వారిజాసనం బ్రెం
బునఁగొలువుండి నిండుముద♦ముంగడుఁజెందుచులోకసృష్టిఁ
బెనయ రచించుజాణ దివి♦జేశుఁడు వేంకటరాయమంత్రిచం
ద్రునకు నిరామయంబగున♦నూనచిరాయువొసంగుఁగావుతన్.

సీ. జంభారిమదకుంభి♦కుంభసన్నిభకుచ
కుంభ యేయుత్ఫుల్ల♦కువలయాక్షి
సర్వసుపర్వసు♦పర్వచంద్రాననా
సేవ్య యేవికచరా♦జీవగంధి
రమ్యబింబాధర♦రక్తిమవిజితప్ర
వాళ యేరాజమ♦రాళయాన
శారదనీరద♦హారనీహారగౌ
రాకార యేపూర్ణి♦మాబ్జవదన
యమ్మహావాణి చారునీ♦లాంబుదాభ
వేణి కళ్యాణి సైకత♦శ్రోణి మంజు

వాణి వేంకటరాయజి♦హ్వాగ్రసీమ
నింపు దళుకొత్తఁగా వసి♦యించుఁగాత.

ఉ. పంకజసంభవాదిసుర♦వర్గము లెవ్వనిఁ బూజఁజేసి ని
శ్శంకమనస్కులై సఫల♦సర్వమనోరథసిద్ధు లైరొ యా
శంకరసూతి విఘ్నఘన♦సామజకేసరి సత్కృపాబ్ధియై
వేంకటరాయసత్కృతికి♦విఘ్నములందొలఁగించుఁగావుతన్

సీ. ఎవ్వనిసత్కృతి ♦ యించుక పఠియించు
వారల కిహాపర♦ఫలము లొసఁగు
నెవ్వనికృతిఁ బఠి♦యించువారలకు ధ
ర్మాధర్మవిజ్ఞాన ♦ మవనిఁ గలుగు
నెవనికావ్యత్రియం ♦ బెలమిఁ బఠింప శ
బ్దాపశబ్దజ్ఞాన ♦ మతిశయిల్లు
నెవ్వనికృతిఁ బఠి♦యింపంగ మృదుశబ్ద
సరసకవిత్వంబు ♦ సంఘటించు

నట్టిశ్రీశారదానుగ్ర♦హానులబ్ధ
సరసకవితాధురీధురం♦ధరులఁ బూర్వ
కవులఁ బ్రాచేతసవ్యాస♦కాళిదాస
భోజులఁ దలంతు మానసాం♦భోజమందు.

గీ. ఘనులు మెచ్చఁగ లోకోప♦కారలీల
భారతపురాణము దిగ్లింగ♦భాషచే ర

చించిసత్కవిమహాకవి ♦ శ్రేష్ఠు సన్న
పార్యుఁ దిక్కనయజ్వ నే ♦ సభినుతింతు.

ఉ. ప్రాకటలీలచే సుకవి♦రాజులవాక్కుల వేడ్కసేతు రే
కాక ధరిత్రి నెవ్వరును ♦ గాకవివాక్యము లిచ్ఛగింతు రే
కాకవిరావము ల్వినుట♦కై మతి గల్గునె సన్మరందధా
రాకరధోరణీశుకవి♦రాజిరవంబులు విన్నవారికిన్.

వ. ఇవ్విధంబున నిష్టదేవతాప్రార్థనంబును, సుకవిజనసమస్కారంబునుం, గుకవిజనతిరస్కారంబునుం గావించి నే నొక్క ప్రబంధంబు నిర్మింపం దలంచి యున్నసమయంబున.

సీ. ఎవనివిగ్రహకాంతి ♦ యినశశిపావక
తేజంబులకు బహు♦దీప్తి నొసఁగు
నెవ్వనివరరూప ♦ మిందిరాసుందరీ
తనయలావణ్యంబుఁ ♦ దరలఁజేయు
నెవ్వనిసత్కీర్తి ♦ యిందేభదరచంద్ర
చంద్రికాసాంద్రమై ♦ జగతిఁ బరగు
నెవ్వనియౌదార్య ♦ మిలను రాధాసుత
కల్పభూజఖ్యాతి♦గరిమ నణఁచు
నతఁడు రాజాధిరాజసం♦స్తుతమహాప్ర
తాపదీపితుఁ డరిజన♦తాపకారి
యధికతరవాడరేవువం♦శాబ్జహేళి
మహితగుణపాళి చెల్మయా♦మాత్యమౌళి.

వ. మఱియు నిరుపమగుణగణాక్రాంతదశదిశాంగనాపయోధర ఫాలప్రదేశ విరాజమానహార సిందూరాయమాణపుండరీక భవాండజరాజ హరిహయకృపీటజపాంసుపాండురారుణకీర్తి ప్రతాపవంతుండును, పాదయుగానమ్రసకలసామంతుండు ను, సామదానభేదాది నానోపాయకృతకర్షకనిక్షేప కరగ్ర హణపూరితభూవర్గాస్థాపిత ద్రవ్యసముచ్చయ ప్రేషణకుతూ హలాయమాన మానవనాథకృతబహుమానసకలవ్యావహా రికసార్వభౌముండును, దీనజనపరిసారితాక్షీణదాక్షిణ్యకటా క్షుండును, దానధారావర్ధితవిబుధకవివ్రాతచాతకధారాధ రుండును, వార్ధిగంభీరుండును, శ్రీమద్వంశదేశిక ప్రబోధా నందతీర్థగురుస్వామి భజనానులబ్ధశాశ్వతైశ్వర్యధౌరేయుం డును, ధర్మగుణపాండవేయుండును, వితరణరాధేయుండును, శ్రీవాడ రేవుకుల కలశాంభోరాశి రాకాచంద్రుండును నగు చెలమయామాత్య సురేంద్రుండు విబుధకవిగురుపరివేష్టిత యై సుధర్మ ననుకరించుసుధర్మసభయం దత్యంతవిభవసాం ద్రుండై.

సీ. తర్కాదిసకలశా♦స్త్రప్రవీణులయిన
యుత్తమవిద్వాంసు ♦ లొక్కవంక
గద్యపద్యాత్మక♦కావ్యప్రబంధంబు
లొనరించు కవిరాజు ♦ లొక్కవంక

సకలపురాణేతి♦హాసంబులను జెప్ప
నోపుపౌరాణికు ♦ లొక్కవంక
మెఱుఁగుఁదీగెలభంగి ♦ మెఱయుమేనులు గల
చక్కనిసామాన్య ♦ లొక్కవంక
తెక్కయిడరానిగాయకు ♦ లొక్కవంకఁ
బెక్కులగు వందిమాగధు ♦ లొక్కవంకఁ
గొలుచుచుండంగఁ గుశలిమై ♦ కొలువుఁదీర్చె
విబుధపరివృతుఁ డగుదేవ♦విభుఁడువోలె.

గీ. కొలువు దీరిచి సత్కవి♦కులవరేణ్యు
శారదానుగ్రహకటాక్ష ♦ సారలబ్ధ
సరసకవితాధురీధురం♦ధరుని రామ
పాదసరసీరుహాధ్యాన♦పరుని సన్ను.

క. పిలిపించి యిట్టు లనియెను
సలలిత మగుశబ్దనిచయ♦చాతురి గలవా
క్కుల నిరుపమానమై యిం
పలరును నీకవిత మల్లి♦కార్జునసుకవీ!

గీ. ధరణి నారామ భూసుర♦స్థాపనాది
పట్ల మొక్కసుకృతికిని ♦ సాటిరాదు
వానికిని విశ్వవిఖ్యాతి ♦ వచ్చుఁగానఁ
గృతియె ముఖ్యంబు సప్తసం♦తతులలోన.

క. కావున నీ వాకసత్కృతి
మావేంకటరావుపేర ♦ మధురవచశ్శ్రీ
భావానుమోదమతినై
కావింపు మటంచుఁ దెల్పె ♦ ఘనులు నుతింపన్.

క. అని తెల్పి వీటికాధన
కనకాంబరభూషణాది♦కము గానుకగా
ననువుగ నొసఁగినఁ గైకొని
ఘనహర్షాంభోధివీచి♦కామగ్నుఁడనై.

క. కృతిపతివంశజులను స
న్నతి వర్ణించెదను మౌని ♦ మౌద్గల్యుఁ డనన్
జితపంచేద్రియుఁ డతినియ
మితఫలమూలాశనుండు ♦ మేదిని నొప్పున్.

క. ఆమునివంశంబున శో
భామహనీయప్రతాప♦భానుఁడు విలస
త్సోమాంఘ్రిభక్తియుక్తుఁడు
సోమాఖ్యుఁడు సోమమంత్రి ♦ శోభిల్లెఁ గడున్.

సీ. ఎవ్వనియౌదార్య♦వృత్తి సంతతమును
విబుధసంఘంబుల ♦ వేడ్కఁ బెనుచు
నెవ్వనిసత్కళ ♦ లివ్వసుధాస్థలి
నిర్మలస్ఫూర్తులై ♦ నివ్వటిల్లు

నెవ్వనితాజత్వ ◆ మెల్లలోకములకుఁ
జల్లనై తమమెల్ల ◆ సంహరించు
నేనయశీలున ◆ దీనజనస్మృతత్వంబు
గువలయప్రియలీలఁ ◆ గొమరుమిగులు
నెవ్వఁడు బుధవత్సలతఁ దాల్చి ◆ యేపుమీఱు
నతఁడు దనసోమనామధే ◆ యంబు సార్థ
కంబయి తనర్ప విశ్వవి ◆ ఖ్యాతిఁ గాంచె
మహితగుణహారి సోమయా ◆ మాత్యశౌరి.

ఉ. సోముఁడు భూరికీర్తిజిత ◆ సోముఁడు భాస్వదగణ్యసద్గుణ
స్తోముఁడు నిత్యకర్మపరి ◆ తోషితసోముఁడు భాస్కరోజ్జ్వల
ద్ధాముఁడు పుణ్యకర్మఫల ◆ ధాముఁడు పంకజలోచనామణీ
కాముఁడు వాడరేవుకుల ◆ కాండభవాహిమధాముఁడౌనన్నఁగన్.

గీ. మున్ను సోముండు దాఁ బుర ◆ ములను గాల్చి
యధికదక్షాధ్వరధ్వంసి ◆ యయ్యె నహహ
యనుచుఁ బురముల నేలి ద ◆ క్షాధ్వరములఁ
బ్రేమఁ గావించె వాఁడేప్రవు ◆ సోమమంత్రి.

గీ. సోమమంత్రికి నిరువురు ◆ సుతులు గల్గి
రిందుమౌళికి గణపతి ◆ స్కందు లట్లు
వార లుదుమోదకప్రియా ◆ వార్యశౌర్యు
లగుచుఁ బ్రబలిరి లింగరా ◆ జాహ్వయముల.

## ప్రథమాశ్వాసము.

గీ. వార లిరువురలో నుష్ణ♦భానుతేజుఁ
దమితధైర్యరమాముహి♦మాద్రిరాజు
భోగసురరాజు విద్యల♦భోజరాజు
సాంగరతిరాజు భువిఁ బెద♦లింగరాజు.

గీ. నలినకైరవసఖ నయ♦నత్వమునను
రాజశేఖరవిబుధవ♦రత్వమునను
లింగనామంబు సార్థమై ♦ చెంగలింప
రాజిలె ధరిత్రిఁ బెదలింగ♦రాజమంత్రి.

క. ఆతని కనుసంభవుఁడై
భూతలవిఖ్యాతదాన♦మున ఖేచరరా
ధాతనయకల్పభూజ
ఖ్యాతిని జినలింగరాజు ♦ గాంచె ధరిత్రిన్.

క. పెదలింగరాజసచివున
కుదయించిరి సుతులు నల్వు ♦ రుద్యల్లీలా
స్పదు లుదయభానుతేజులు
సదయులు మృగరాజతుల్య♦శౌర్యావార్యుల్.

క. కొండనమంత్రి జగన్నా
థుఁడును మార్కొండరాజు ♦ భూతసమస్తా
ఘుం డగుపర్వతచయను ల
ఖండగుణులు మంత్రిమణులు ♦ కరుణాభరణుల్.

ఉ. కొండసమంత్రికీర్తిరుచి ♦ కుండలిరాజ విరాజితేంద్రవే
దండతుషారహారవర ♦ దండసుపుస్తకవల్లకీకిరా
బ్జాండజకాండకాండశర ♦ దంబుదపాండురమై పయోజజా
తాండము నిండియుండెను మ ♦ హాకవిసత్తమవర్ణనీయమై.

సీ. దశరథరాముఁడై ♦ ధాత్రీస్థలిని బుణ్య
జనవధ గావించి ♦ ఘనత మెఱసె
భార్గవరాముఁడై ♦ పరమసాధ్వీమణి
జననిని గూల్చె ను ♦ త్సాహలీల
శ్రీకృష్ణమూర్తియై ♦ ప్రాకటంబుగ బంధు
జనముఁ జంపించె న ♦ ర్జునునిచేత
బౌద్ధరూపంబున ♦ భవ్యుడై త్ర్యంగనా
విపులపాతివ్రత్య ♦ మపహరించె
భువి జగన్నాథుఁ డని రోసి ♦ పుణ్యజనులఁ
బ్రోచుఁ దల్లిని గను భక్తిఁ ♦ జూచు బంధు
జనములను గాచుఁ గనుఁ బరాం ♦ గనలఁ జూచు
మాతలనుగా జగన్నాథ ♦ మంత్రిరాజు.

శా. చండాదిత్యసమానతేజుఁడు మహా ♦ సౌందర్యపుష్పాస్త్రుఁడు
ద్దండారాతిబలాంబుదానిలుఁడు ని ♦ స్తంద్రుండు రౌప్యాదిరా
డ్డిండీరాండజపుండరీకశశభృ ♦ ద్దీప్యన్మహాకీర్తి మా [గన్.
ర్గాండామాత్యుఁడు దానధిక్కృతసుర ♦ క్షోణీరుహాళిం దెన్నఁ

సీ. సురలోకపురనివా♦సులకుఁ దృష్టి నొసంగు
కల్పభూజఖ్యాతి♦గరిమ యెంత
సురలకుఁ గళ లిచ్చి ♦ మరలఁ దాఁ గైకొన్న
* నలినశాత్రవువదా♦న్యత యదెంత
వేఁడుచో నాదిత్య♦విభున కంగం బిడు
తపనాత్మభవునియా♦దార్య మెంత
శరణుఁ జెందినపక్షి♦వరునకై నిజమాంస
మిచ్చినశిబియావి ♦ యెంతయనుచు

దివి భువిని గల్గువారికిఁ ♦ దృష్టి నొసఁగు
నిడినవస్తువుఁ గొనుట లే ♦ దెపుడు వేఁడ
కున్న నర్థుల కిడు శర ♦ ణొందకున్న
జనులఁ బాలించుఁ బర్వత♦చయము లహహ.

సీ. పూజ్యభతుండని ♦ భోజ్యధారాహోమ
మొకచోట భూసుర♦నికరవేద
ఘోష మొక్కొకచోట ♦ గురుశాకసూపాజ్య
పాయసదధ్యపూ♦పాదిపూర్ణ
శాల్యన్నభోజక♦సాహస్రభూసుర
గోవిందకీర్తనా♦రావ మొక్క-

---

* నలినశాత్రవువితీర్ణిమ మదెంత — అని పూర్వముద్రణము.

చోట మహారాజ♦కోటి దత్తోపాయ
* వద్రవ్యమణిభూష♦ణములరాసు
లొక్కచోటఁ దలిర్పంగ ♦ లెక్కలేని
ధనవిభూషణగోభూమి♦దానములను
విప్రుల కొసంగి విబుధులు ♦ వేడ్క నొందఁ
జలిపెఁ జయనంబుఁ బర్వత♦చయను లహహ.

గీ. వనజబాంధవతేజులౌ♦వారిలోన
మహితగుణుఁ డైనమార్కండ♦మంత్రిమణికి
సుతులు నల్వురు గలిగిరి ♦ హితులు రూప
యుతులు కులగోత్రధృతులు పూ♦జితసుమతులు.

గీ. అమర సింగజగ్గ♦యాఖ్యు లయ్యపరాజు
భావభవనిభుండు ♦ భద్రిరాజు
చయను లనెడుపేర ♦ సడిమలకీర్తులై
వసుధ మంత్రిచక్ర♦వర్తులైరి.

సీ. వరవైభవంబున ♦ వాసవుతో సాటి
ధర్మగుణంబున ♦ ధర్మసాటి
దాతృత్వమునను రా♦ధాసూనుతో సాటి
భూరివిద్యాప్రౌఢి ♦ భోజుసాటి
బాహుబలంబున ♦ బాహులేయునిసాటి
మంత్రిత్వమున సుర♦మంత్రిసాటి

* సద్రవ్యమణిభూషణములు—అని పూర్వముద్రితము.

మైశ్వర్యమునఁ గార ♦ వేశ్వరులతో సాటి
ధైర్యలక్ష్మిని ధరా ♦ ధరముసాటి
జెప్ప నగు నని విబుధులు ♦ మెప్పుసేయ
నెప్పుడును సత్యవచనంబు ♦ దప్పనీక
గొప్పగొనములఁ బ్రోవయి ♦ యొప్పె జగతి
జలజబాంధవతేజుఁ డా ♦ జగ్గరాజు.

సీ. రా జని బుధులు వ ♦ ర్ణనసేయఁ దగువాఁడు
వరరూపమున భోగ ♦ వైభవమున
హరి యని కవివరు ♦ లనఁగఁ జాలినవాఁడు
శౌర్యంబుచే సుతే ♦ జంబువలన
మంత్రివరుం డని ♦ మాగధనుతి నొప్పు
వాఁడు వాక్యంబున ♦ వైదికమున
ధరణీధరుం డని ♦ దొరలెన్నఁ దనరువాఁ
డమితవాగ్ఝరిని ధై ♦ ర్యరమచేత
ఘనుఁ డటంచును రాజులు ♦ గణనసేయ
నలరువాఁ డీవిచే వ్యవ ♦ హారమునను
రాజశేఖరకోటీర ♦ రత్నభూష
రమ్యసద్గుణుఁ డయ్యప ♦ రాజమంత్రి.

క. అయ్యపరాజున కగు నీ
డయ్యపరాజులను రిపుల ♦ నణఁచిన పార్థుం

డయ్యపరాజయమునఁ గన
మయ్యపరాజయము దిక్కు♦లం దాతనికెన్.

గీ. రాజ్యలక్ష్మివినిర్జిత♦రాజరాజు
దివ్యవైభవనిర్జిత♦దేవరాజు
అధికధైర్యరమామహి♦మాద్రిరాజు
భద్రిరాజున కైన రామ♦భద్రిరాజు.

సీ. రాజశేఖర పాండు♦రాజశేఖరసూను
సమనిర్జితైశ్వర్యవీ♦ర్యములవాఁడు
హంసరాజవిరాజ♦హంసరాజ ద్దేహ
కాంతికీర్తిస్తోమ♦కములవాఁడు
కమలబాంధవసూను♦కమలబాంధవసూను
మహనీయదానధ♦ర్మములవాఁడు
భోజరాజ వికచాం♦భోజరాజస్ఫుర
త్సకలకళాకులా♦స్యములవాఁడు

నవని మారాకృతికెని మా♦రాకృతి గల
వాఁడు వరబుధకవిరాజ♦వందిమాగ
ధస్తుతాగణ్యసుగుణవి♦తానరాజ
మానుఁ డాభద్రిరాజస♦న్మంత్రిఘనుఁడు.

సీ. వసుధాస్థలిని మఘు♦వంతుఁడై విలసిల్లి
ఘనధనంజయుఁ డని ♦ గణన కెక్కె

ధర్మరాజఖ్యాతి ♦ ధర్మంబు చేఁబూని
పుణ్యజనుం డని ♦ పొలుపు మీఱి
రత్నాకరాగార ♦ రాజమానుం డయి
సారంగవాహుఁడై ♦ జగతిఁ బరగి
ధననాయకత్వంబు ♦ ఘనతరుండై తాల్చి
రాజశేఖరలీలఁ ♦ దేజరిల్లి
విబుధజనములఁ బాలించె ♦ వెలసెఁ గాంతి
దురితకారుల దండించె ♦ నరుల నణఁచె
భువనపతి యయ్యె ఘనరజం ♦ బును హరించెఁ
నేలె రాజుల శివుఁ డయ్యె ♦ నిలను జయని.

ఉ. భాసురవైదికోక్తవిధి ♦ పద్ధతి కెక్కువ గాఁగ సర్వదా
త్రీసురకోటికిన్ వివిధ ♦ రీతుల దక్షిణ లిచ్చి హెచ్చి దే
వాసురదుర్గమాధ్వరమ ♦ హాఫల మందెను మేదినీసురా
శ్రీసరుఁడైన యా చయని ♦ కేవలదేవసమానుఁడెన్నఁగన్.

గీ. వరగుణాకరు లైనట్టి ♦ వారిలోన
జలజసఖతేజుఁడై యొప్పు ♦ చయనులకును
విహితవినయులు గురుశాస్త్ర ♦ విదితనయులు
తనయు లుదయంబు నొందిరి ♦ ఘనులు మువురు.

గీ. భూరిగుణరత్నసదిరాజు ♦ మూర్తిరాజు
చండరవితేజుఁ డైనమా ♦ కొండరాజు

రాజసచివుండు సూరపరా జనంగ
వెలసి రాదిత్యచంద్రవంశ్యులవిధమున.

సీ. సహజకళంకియౌ జలరుహారాతిని
నంబుదనిభవేణి నజునిరాణి
లలితనీలాంబరు బలరామమూర్తిని
నీలగళుండైన శూలపాణి
షట్పదయుతసిత సరసీరుహంబును
హరినీలనాయక హారచయము
శ్రీహరిభాసుర క్షీరవారాశిని
ఘనతరేందీవరా కాశగంగ
నెంచి పాండురశోభచే నెచటఁ దనకు
సాటిలే దనుమాటలు సాటి చెప్ప
మించి భువనత్రయం బాక్రమించె ననఁగ
రాజిలె జగంబులను మూర్తిరాజుకీర్తి.

గీ. సత్యభామామనోహరి సదయహృదయుఁ
డరిదరకరుండు నధికబలానుజుండు
భోగవంతుఁడు ఘనమందరాగధరుఁడు
మూర్తిరాజన కైన కృష్ణమూర్తి గాఁడె.

క. ఆమూర్తిరాజుననుజుం
డౌమాకొండాఖ్యసచివుఁ దనుపమకీర్తి

స్తోమజితసోమసోముఁడు.
రామాజనకాముఁడై ధరాస్థలి వెలసెన్.

సీ. తనభవ్యసత్కీర్తి • తనప్రతాపస్ఫూర్తి
ద్విజరాజతేజంబు • ధిక్కరింపఁ
దనదులావణ్యంబు • దనదుకారుణ్యంబు
సరసిజాంబకునితోఁ • బాటి దెల్పఁ
దనదుశుచిత్వంబు • దనదోర్బలత్వంబు
ఘనధనంజయునితో • గణన కెక్కఁ
దనమహాస్థైర్యంబు • దనమహైశ్వర్యంబు
సమరేశసామ్యంబు • ననుకరింప
నలరు నిరుపమసర్వంస•హాధినాథ
సకలసద్గుణగణమంత్రి•సార్వభౌమ
రమ్యకాంచనకోటీర•రత్నభూత
మహితగుణహారి మాదొండ•మంత్రిశౌరి.

క. ఆరాజమంత్రి కనుజుం
డై రాజిలె ధరణి సూర•యాఖ్యుఁ డనంగా
కారుఁడు సుగుణాధారుఁడు
ధీరామరభూరుహంబు•ధీరుం డెన్నన్.

సీ. రవి మిత్త్రుఁ డయ్యు ధ•రాస్థలి నేవేళఁ
…లసి …తాఁ బగ …ల్లి • … …చేయు

పద్మానుకూలుఁడై ♦ పరిబలియుఁ గువలయా
　　ప్రియకరలీలచే ♦ వెలయుచుండు
నధికతరియామూర్తి♦యై రాజిలుచు నని
　　శాంతస్థతమమ్ముల ♦ నణఁచెఁ డయ్యె
ఘనపదగామియై ♦ తనరుచుండి ఘనావ
　　రోధంబుఁ గనుఁ బాయఁ♦ద్రోయఁ డయ్యె
నహహా యని మిత్రితలఁ గూర్చు ♦ నాప్తులకును
కువలయానందకారియౌ ♦ ఘోరతమము
నణఁచును ఘనావరోధంబు ♦ నణఁగఁ జేయు
రమ్యగుణహారి సూరవ♦రాజశౌరి.

క. ఆసూరమంత్రిమణికిని
భాసురసుగుణాకరుండు ♦ పరిపాలితధా
త్రీసురుఁ డంతర్వేదియ
నా సూనుఁడు గలిగె హరికి ♦ నలినాస్త్రివలెన్.

సీ. ఈశ్వరుండు దన క♦ప్రైశ్వర్యములు గల్గ
　　నెట్టివేళల భిక్ష ♦ మెత్తుకొనిమె
మాధవుండును హయ♦మదగజంబులు గల్గ
　　మక్కువచే నొక్క♦పక్కి నెక్కె
అమరరాజ్యాధిప♦త్యముఁ బూని పురుహూతుఁ
　　డర్థియై రాధేయు ♦ నడుగఁబోయెఁ

గాంచనగర్భుండు • గనకాద్రి యుండంగఁ
జెలఁగి తామరగద్దెఁ • జేసికొనియె
నహహా వారేమి ఘనభోగు • లనుచు నన్న
దాన మొనరించు హయములఁ • బూని తిరుగు
వేడఁ డన్యులఁ గాంచన•విస్తరోప
విష్టుఁ డగుచుండు నంతర•వేదిమంత్రి.

క. అంతర్వేదినృసింహున
కంతర్వేదినరసింహుఁ • డనఁదగునీ డా
శాంతాంతరంగుఁడై ని
శ్చింతతఁ బుణ్యజనపీడ • చేయక యున్నన్.

క. ఆతని కిర్వురు గల్గిరి
చేతోజసమానులు సురు•చిప్రతిభానుల్
జాతకరుణాదీనులు
ఖ్యాతలపతికృతవిశేష•మానులు సూనుల్.

గీ. సత్యవాక్యుండు వేంకటా•మాత్యుఁ డచ్చ
యప్రధానుండు నన నొప్పి • రవనియందు
వారిలో నగ్రజుఁడు గుణ•వారిరాశి
రాజమాన్యుండు వేంకట•రాజమంత్రి.

సీ. ఏమహామహుమహా•ధామంబు ధామంబు
వలె లోకచయము శో•భిలఁగఁజేసె

నేరాజమంత్రియ♦శోరుచి రుచిరీతి
నఖిలదిగంగనా♦హార మయ్యె
నేవిభూత్తము సద్గు♦ణావళి వళిభంగి
ఘనపద్యపదవర్ణ♦కలిత మయ్యె
నేనాథుదానంబు ♦ దానంబుకై వడి
సరసాళి కానంద♦జనక మయ్యె
నతఁడు రాజాధిరాజసం♦స్తుతధరాను
రావనాదికసద్గుణ♦హారి నిఖిల
బంధుపోషణకారి కృ♦పామురారి
జనవరవిహారి వేంకట♦సచివశౌరి.

ఉ. భూరిగుణాఢ్యకాకరల♦పూఁడికులోద్భవరామచంద్రధా
త్రీరమణప్రసాదమున ♦ ధీయుతు లౌ నసఁ గోటతాలుకా
కూరిమి మీఱఁగా బుధుల♦కోరుకు లెల్ల ఫలింప బల్మజుం
దారి యొనర్చె నాథునుఁడు♦దారత మంత్రికులావతంసమై.

గీ. ఆమహామహుసోదరుం ♦ డై తనర్చె
వివిధశాత్రవకైరవ♦కువలయారి
వాడరేవుకులాంభోధి♦వనజవైరి
మహితగుణహారి యచ్చయా♦మాత్యశౌరి.

ఉ. సత్యవచోవిశారదుఁడు ♦ సారసబంధుసమానతేజుఁ డౌ
న్నత్యవిరాజమానసుగు♦ణప్రచయుండు మహాకవీంద్రసం

స్తుత్యుండు నిత్యదానపరి♦తోషితభూసురవర్యుఁ డచ్చయా
మాత్యుండు ధాత్రిలో సకల♦మంత్రిశిరోమణిగాక యల్పుఁడే.

వ. ఇట్టిమహాగుణవిశిష్టు లగు వేంకటాచ్చయామాత్యులలో
మున్నుగా నచ్చయామాత్యు సంతతిక్రమం బభివర్ణించెద.

గీ. సత్యసంధున కచ్చయా♦మాత్యమణికిఁ
బుత్త్రు లిర్వురు గలిగిరి ♦ మిత్త్రులు జిత
శత్రు లుత్తమసుగుణప♦విత్రులు నుతి
పాత్రులు సరోరుహోపమ♦నేత్రు లగుచు.

గీ. జిష్ణుసమతేజుఁ డైనట్టి♦కృష్ణమూర్తి
సోమయామాత్యుఁ డనుభవ్య♦నామములను
బ్రబలి రం దగ్రజుండు వి♦రాజ రాజ
జిష్ణుకరివర సమకీర్తి♦కృష్ణమూర్తి.

శా. జిష్ణుప్రాభవు డర్థికల్పతరు వ♦క్షీణప్రతాపప్రభా
శోష్ణాంశుండు సురూపనిర్జితరమా♦యోషిత్తనూజుండు వ
ర్ధిష్ణుప్రోజ్జ్వలదుత్కృపాదిగుణధా♦రేయుండు ధాత్రీవ శ్రీ
కృష్ణామాత్యుఁడు దేజరిల్లె వరల♦క్ష్మీస్థానుఁడై ధాత్రిలోన్.

క. ఆతనికి సోదరుండై
భూతలమున సకలసుకవి♦బుధవినుతగుణ
వ్రాతుఁ డయి దానకర్ణ [illegible]
ఖ్యాతిని బొగ [illegible]త్యుం డమన్.

సీ. భవ్య మైనట్టిసం•పత్తిచే రారాజు
రాజు శ్రీకరమహా•ప్రాభవమున
సమధికవరతప•శ్శక్తి నుమాపతి
యుమాపతి కారుణ్య•మహిమచేత
దివ్యతేజఃపుంజ•దీప్తిచే ననలుండు
నలుఁడు సుందరరూప•కలనవలన
భూరిగాంభీర్యంబు•చే రమాజనకుండు
జనకుఁడు దివ్యవి•జ్ఞానమునను

ధర్మగుణమున రెండవ•ధర్మరాజు
ధర్మరాజు మహాపాప•దండనమున
నౌ ననుచు సత్కవీశ్వరు•లభినుతింప
శోభిలె ధరిత్రి వాజశ్రవు•సోమమంత్రి.

ఉ. సూరసమానతేజుఁ డగు•సోమనమంత్రికి నేవు రర్థికిన్
సారసజంబులట్లు గుణ•శాలికుమారులు గల్గి రందఱుఁ
మారులు దివ్యదేహసుకు•మారులు శాత్రవకోటి కెల్ల బ
ల్మారకు లుజ్జ్వలంబుగఁ గు•మారకు లొక్కనికంటె నొ [క్కఁడుర్వి.

సీ. ఆశాంగనాకుచ•హారాయమాణస
త్కీర్తియై యొప్పల•క్ష్మీపతియును
ఘనదయాదాక్షిణ్య•వినయాదిసుగుణాని
దానమై వెలయెల్లు•దమ్మయార్యు

ధైర్యగాంభీర్యశౌ♦చార్యమహావీర్య
శాలి వేంకనయుఁ గృ♦ష్ణప్రధానుఁ
డసదృశకాంతిచే ♦ నంగనానూతన
కాముఁడై రాజిలు♦కామరాజు
గుణులు ఘనమంత్రికులశిరో♦మణులు దాన
జితసురమణులు రూపమో♦హితసురమణు
లధికవాఁడ్రు కులజల♦జాభ్రమణులు
వెలయుదురు ధాత్రిపైఁ బాండ♦వేయు లట్ల
గీ. వారిలోనను రాజిలు♦వాఁడు గాన
ఘనుఁ డటంచును నుతి కెక్కెఁ ♦ గామరాజు
ఘనతరధరాధిపస్థాన♦మున వసించి
విబుధకవిచాతకంబులు ♦ వేడ్కనొంద.
గీ. ఆజ్ఞ కీర్తి ధరాదేవ♦తావనంబు
రమ్యదానంబు మిత్రసం♦త్రాణనంబు
భోగ మనుషడ్గుణంబులఁ ♦ బూన్కిఁజైన
మంత్రిచంద్రుండు భువిఁ గామ♦మంత్రిమౌళి.
గీ. ఘనతరం బయి రాజిలు♦కామరాజు
నామధేయంబు పూని య♦నాథయువతు
లను నిరంతర మేఁచెద ♦ రనుచు నెంచుఁ
గామ రాజుల వాఁడ్రు♦కామరాజు.

శా. కామామాత్యున కుద్భవించె విలస♦త్కంజాతనేత్రారమా
రామాసూనుఁడు గాంతిభానుఁడు మహా♦ప్రాజ్ఞుండు వీరేశలిం
గామాత్యుం డనుపేర రాజిలుచుతుం♦డా సేతుశీతాచల
క్ష్మామధ్యస్థధరాధినాయకమహా♦మంత్రీశ్వరోత్తంసమై.

సీ. పరిహాసమున నైనఁ♦బలుకరానిది లేదు
కలనైనఁ బరవధూ♦కాంక్ష లేదు
సంతతం బర్థి కొ♦సంగ కుండుట లేదు
ధర్మంబు లేనిప♦ద్ధతియు లేదు
క్షణమైన సద్గోష్ఠి♦ చాలించుటయు లేదు
బుధరక్షణము మాన్పు♦ బుద్ధి లేదు
రక్షించు మనిన ను♦పేక్ష సేయుట లేదు
న్యాయంబు దప్పిన♦నడక లేదు
సత్యవాక్యంబె కాని య♦సత్యవాక్య
మెయ్యెడను లేదు ధాత్రిపై ♦ నితనిఁ బోలు
ఘనుఁడు గలఁడే యటంచు స♦త్కవులనుతి చె
లంగ రాజిల్లె వీరేశ♦లింగమంత్రి.

సీ. చక్రీశసమధిక♦చక్రీశసమకృపా
ఘనతపశ్శక్తివా♦క్స్ఫురులవాఁడు
హరిరాజభాకర♦హరిరాజనిభభూరి
శౌర్యప్రతాపయ♦శములవాఁడు

సురరాజరాజభా♦సురరాజరాజవై
భవముఖదివ్యసం♦పదలవాఁడు
జలజాంబకకుమార♦జలజాంబకకుమార
కాయుష్యరూపవీ♦ర్యములవాఁడు
స్నానసంధ్యాద్యనుష్ఠాన♦సకలవిప్ర
దేవతారాధనాదిక♦దివ్యకర్మ
నిచయపరతంత్రచిత్తుండు ♦ నిరుపమాన
లీల వెలుఁగొందె వీరేశ♦లింగమంత్రి.

గీ. ఆమహాత్మసూనుఁ ♦ డై మహి విలసిల్లె
నూరిసుకవిమిత్ర♦శుభకరుండు
శత్రునాశకరుఁడు ♦ సంతతపూజిత
శంకరుండు భీమ♦శంకరుండు.

వ. ఇవ్విధంబున నచ్చయామాత్యసంతతిక్రమం బభివర్ణించి తదగ్రజుం డైన వేంకటమంత్రి సంతతిక్రమం బభివర్ణించెద.

క. దక్షుఁడు వేంకటసచివా
ధ్యక్షుసుతులు జోగిరాట్ప్ర♦ధానుఁడు భగవ
ద్దీక్షితులును సీతేశుం
డక్షీణయశఃప్రతాపు ♦ లై ప్రబలి రిలన్.

సీ. హంసనంఘుంబుల ♦ నాక్రమింపఁగఁజాలెఁ
హంపసంఘుంబుల ♦ నాక్రమించెఁ

పుండరీకజకాంతి • గం డణంపఁగఁ జాలెఁ
పుండరీకజకాంతి • గం డణంచె
ద్విజరాజతేజంబు • ధిక్కరింపఁగఁ జాలె
ద్విజరాజతేజంబు • ధిక్కరించె
మేరుధరచ్ఛాయ • మిఱ్ఱింగివైవఁగఁ జాలె
మేరుధరచ్ఛాయ • మిఱ్ఱింగివైచె
సహహా యీతనిపాంసుర • యశము దుస్స
హారుణమహఃప్రతాపంబు • ననుచు సుకవి
జనము లభినుతిసేయంగఁ • దనరె వినుత
భోగసురరాజు వాద్రేవు • జోగిరాజు.

క. ఆతనియనుజుఁడు సుగుణ
వ్రాతుండై ధాత్రిని భగ • వద్దీక్షితవి
ఖ్యాతి వహియించెఁ దేజో
పేతుండై క్రతువు సల్పె • దివిజులు మెచ్చన్.

సీ. సురలు సమస్తభూ • సురులు హర్షింప నా
ధానంబుఁ జేసె నే • ధర్మశాలి
దుప్పలపూఁడిలో • దొర లెన్న నీశ్వర
స్థాపనఁ జేసె నే • సదమలాత్ముఁ
డవనీసురుల కగ • ణ్యములైన బహుమాన్య
మాన్యంబు లిచ్చె నే • ధన్యతముఁడు

పసలపూఁడికిని దు♦ప్పలపూఁడికిని మిశా
శి దెచ్చి హెచ్చె నే♦శ్రీకరుండు

మోదకరము లైన ♦ వేదవేదాంగశా
స్త్రాదివిద్య లెవ్వఁ ♦ డభ్యసించి
ప్రబలె నమ్మహాను♦భావుం డగుభగవ
ద్దీక్షితుండు కర్మ♦దీక్షితుండు.

క. ఆభగవద్దీక్షితునకు
శోభిలు ననుజన్ముఁ డగుచు ♦ సూర్యభినుతసూ
ర్యాభానిభాంగశోభుం
డై భువి నీతేశమంత్రి ♦ యభినుతిఁ గాంచెన్.

సీ. వరధర్మమార్గాను♦వర్తియై శివధర్మ
విధ్వంసనంబు గా♦వింపఁడేని
వీరాగ్రగణ్యుఁడై ♦ ధారుణిపైఁ బుణ్య
జనతరుణీహింస ♦ సల్పఁడేని
భూసురరక్షకుం♦డై సంయమీశ్వరు
భార్గవు నని భంగ♦పఱుపఁడేని
న్యాయానుసారియై ♦ హరిసూను నన్యాయ
సమరంబు గావించి ♦ చంపఁడేని
యీ డనుచుఁ జెల్ప వచ్చు నీ♦తేశుఁ డధిక
ధర్మమార్గానుసారి కాం♦తానురాగ

ధారి మునిజనపాలన♦కారి న్యాయ
సరణిసువిహారి సీతేశ♦శౌరి కెపుడు.

గీ. మహితగుణుఁ డైన సీతేశ♦మంత్రిమౌళి
యమితగుణవతి రమ్యాంగి♦యైన సర్వ
లక్ష్మి యనుకన్యకామణి ♦ రాఘవుండు
జనకరాజతనూజమా♦డ్కిని వరించె.

గీ. భూరిగుణరత్ననిధు లగు♦వీరిలోన
జోగిరాజున కిరువురు ♦ సుతులు విమల
మతు లుదయ మంది వేంకట♦మంత్రి కామ
మంత్రి యనుపేర్లఁ బ్రబలిరి ♦ మాన్యు లగుచు.

ఉ. వేంకటనాయకుండు పృథి♦వీస్థలిపై మనుజాళియొద్ద బ
ల్బొంకములర్ గ్రహించిధన♦శూన్యతచేఁగడుగుందువారలన్
గొంకకమ్రొక్కుముద్దుసమ♦కూర్పకయుండిన బాధచేయు ని
శ్శంకనటంచునెంచుమను♦జావళివేంకటమంత్రిప్రోచుచున్.

క. వేంకటమంత్రిమణికి ని
శ్శంకగుణులు జోగిరామ♦చంద్రయసన్నా
మాంకులు రూపవిజితమీ
నాంకులు సుతు లిర్వు రుదయ ♦ మందిరి హితులై.

ఉ. రాజులుకాంతియందు వల♦రాజులురూపమునందు వాహినీ
రాజులు శౌర్యలీల మృగ♦రాజులు విక్రమశక్తియందు రా

రాజులులక్ష్మియందు సుర♦రాజులుభోగమునందు భాస్వదు
త్తేజులు జోగిచంద్రియసు♦ధీమణు లెన్నిక కెక్కి రిమ్మహిన్.

శా. రామానూతనకాముఁ డాశ్రితదయా♦రాజీవనేత్రుండు సు
త్రామప్రాభవభాసమానుఁడు మహా♦రాజాధిరాట్సార్వభౌ
మామాత్యప్రకరార్చితుండు గుణర♦త్నాంభోధి వాఁడేవుశ్రీ
కామామాత్యుఁడు దేజరిల్లెఁ గవిరా♦ట్కల్పావనీజాతమై.

క. ఆమంత్రిశిరోమణి కా
మామాత్యున కిర్వు రుత్త♦మాత్మజులు మహా
ధాములు విక్రమభీములు
రామాజనకాము లై వె♦లసి రిద్ధాత్రిన్.

గీ. దీక్షితుండు మహాధ్వర♦దీక్షితుండు
వీరయామాత్యుఁ డనుపేర ♦ వెలసి రందు
వీరసచివుండు దరశర ♦ శారదాభ్ర
శారదామలకీర్తియై ♦ జగతిఁ బరగె.

సీ. సతతంబు తపియింపఁ♦జాలని రుచిగల
తరణి యేపాటిప్ర♦తాపశాలి
యసురులబాధల♦ననిశంబు నందెడు
పాకాసురారి యే♦పాటిభోగి
వలసినవేళల ♦ వర్షింపకుండెడు
పర్జన్యుఁ డవని నే♦పాటిదాత

వృద్ధిక్షయముల వే♦వేళ రాజిలు నుత్ప
లప్రియుం డేమిక♦ళాప్రపూర్ణుఁ
డనుచు నిరతంబు రాజిలు♦నన్యబాధ
లెవ్వియును లేక యలరారు ♦ నెప్డు దద్ది
గోరిన నొసంగు నర్థుల♦కును బ్రపూర్ణ
తరకళల నొప్పు వీరప్ర♦ధానుఁ డవని.

క. ఆవీరమంత్రిసుతులు మ
హావీరాగ్రణులు కవికు♦లాబ్జాభ్రమణుల్
పావనగుణపరతంత్రులు
నై వెలసిరి కామకృష్ణ♦యాఖ్యలధాత్రిన్.

వ. ఇవ్విధంబున జోగిరాజుసంతతిక్రమం బభివర్ణించి సీతేశ
మంత్రిసంతతిక్రమం బభివర్ణించెద.

క. సీతేశమంత్రిచంద్రుం
డాతతమతి సర్వలక్ష్మి♦యందు వరగుణో
పేతుల వేంకటకృష్ణ
ఖ్యాతుల విలసిల్లుసుతులఁ♦గాంచె నిరువురన్.

ఉ. వేంకటమంత్రి సర్వపృథి♦వీవర మాంత్రికచక్రవర్తి కూ
లంకషహారహారదక♦ళానిధిదుగ్ధపయోధివీచికా
శంకరనిష్కళంకరుచి ♦ శారదనీరదశారదాసితా
బ్జాంకితకీర్తి ఖండితజ♦నార్తియుఁ గాక మనుష్యమాత్రుఁడే.

ఉ. వేంకటమంత్రిపుత్త్రకుఁడు ♦ వీరుఁడుమానవతీవినూత్నమీ
నాంకుఁడుసుందరాననమృ ♦ గాంకుఁడుభూవరమంత్రిసార్వభౌ
మాంకుఁడు శంకరాంఘ్రియుగ ♦ ళాంబుజసక్తలసన్మనస్కుఁడై
వేంకటరాయుపేరఁబృథి ♦ వీస్థలి నెన్నిక కెక్కె నేడ్తెఱన్.

క. ఆ వేంకటసచివానుజుఁ
డై వెలసెను గృష్ణమంత్రి ♦ యనుపమనిజకా
ర్యావళిసమాగతాఖిల
భూవల్లభమౌళిమంత్రి ♦ పుంగవయుతుఁడై.

సీ. క్షత్త్రికులంబున ♦ జనియించి పిమ్మట
నందునింటనువృద్ధిఁ ♦ బొందఁడేని
కడుబాల్యముననుండి ♦ కనుఁగొన్నపడఁతుల
పిండుతోఁ గ్రీడింప ♦ కుండెనేని
పాండవేయులను జే ♦ పట్టి కౌరవుల స
న్యాయరణంబున ♦ నణఁపఁడేని
మిత్త్రుఁడై యుండి య ♦ మిత్త్రునివలెఁ బార్థు
భుజవీర్యమును గొని ♦ పోవఁడేని
యీ డనుచుఁ దెల్పవచ్చు శ్రీ ♦ కృష్ణమూర్తి
స్వకులవర్తిపరాంగనా ♦ నికరవిముఖ
మూర్తి శాత్రవకులసమ ♦ వర్తి ఖండి
తార్తమనుజార్తి యగు కృష్ణ ♦ మూర్తి కెపుడు.

క. ఆకృష్ణమంత్రి సుగుణా
కాకర యై యొప్పుబాప♦మాంబుజవదనన్
జేకొనియె శివుఁడు గౌరిని
కాకుత్స్థుఁడు జనకరాజ♦కన్యకభంగిన్.

సీ. రమ యేమి సాధ్వి భూ♦రమణగృహంబుల
కేవేళ వచ్చుచు ♦ నేఁగుచుండు
భూమి యేమి మహాస♦తీమణి బహురూప
భాసుర యై బహు♦భార్య యయ్యె
వాణి యేగుణవతి ♦ బహువర్ణరూపయై
పదుగురినోళ్లలోఁ ♦ బడి మెలంగె
సతి యేపతివ్రత ♦ పతిమాట వినక ద
క్షాధ్వరంబున కేఁగి ♦ హానిఁ జెందె

ననుచు శ్రీదేవి భూదేవి ♦ నజునిదేవి
హరునిదేవిని నిరసించి ♦ వరపతివ్ర
తాశిరోమణియై యొప్పె ♦ ధాత్రిపైని
భవ్యసద్గుణనికురుంబ♦బాపమాంబ.

క. ఆసాధ్వియందు గాంచెను
భాసురుఁ డగుకృష్ణమంత్రి ♦ పరిపాలితధా
త్రీసురుల సుతుల ముప్వుర
వాసవసమవిపుల లై ♦భవాన్వితఘనులన్.

క. పెదసీత' న్నన సుగుణా
స్పదుఁ డగుచినసీత ననఁగ • సదమలసుగుణా
భ్యుదయుఁడు చెల్మయ యనఁగా
నుదయార్కద్యుతులు వెలయ • నొప్పిరిధాత్రిన్.

క. వారలలో నగ్రజుఁడై
హారపయోవారిరాశి • హారదరశరసీ
హారాచలశుభ్రయశ
స్స్ఫారుండై పెద్దసీత • సచివుం డొప్పెన్.

శా. ధూతాశేషవిపత్తులోకుఁడు మహా • దుర్వారగర్వాంబుము
గ్వాతూలుండు మహాకవీంద్రవిబుధా • బ్జశ్రేణితీవ్రాంశుఁడా
శీతాద్రీశ్వరసేతుమధ్యవిలస • చ్ఛ్రీరాజమంత్రీంద్రుఁడై
సీతామాత్యుఁడు దేజరిల్లె వరల • క్ష్మీస్థానుఁడై ధాత్రిలోన్.

క. పెదసీతనమంత్రీంద్రున
కుదయించిరి తనయు లిర్వు • రుద్యల్లీలా
స్పదు లుదయభానుతేజులు
సదయులు మృగరాజతుల్య • శౌర్యావార్యుల్.

గీ. సకలగుణనిధి వేంకట • స్వామి కృష్ణ
మంత్రి యనుపేరఁ బ్రబలిరి • మాన్యు లగుచు
వారిలో నగ్రజుఁడు గుణ • వారిరాశి
జనవినుతకీర్తి వేంకట • స్వామి దనరు.

ఉ. శంకరదివ్యపాదజల♦జాతలసన్మధుపాయమానచి
త్తాంకుఁడు సుందరాననమ్మ♦గాంకుఁడు సారసలోచనాలిమీ
నాంకుఁడు వాడరేవు సుకు♦లాంబునిధిశ్వరపూర్ణిమాకుళం
గాంకుఁడు రాజమాన్యబిరు♦దాంకుఁడు వేంకటసామిరాజిలున్.

క. ఆతనికి సోదరుండై
చేతోజసమానమూర్తి♦శృంగారుఁడు వి
ఖ్యాతగుణోదారుం డై
భూతలమునఁ గృష్ణమంత్రి♦పుంగవుఁ డొప్పెన్.

సీ. తనవిశాంతము విశాం♦తముభంగి సద్విజ
నిచయవార్తులచే ♦ నివ్వటిల్ల
తనభవ్యగుణములు ♦ గుణములపగిది మా
ర్తికవిభాకరములై ♦ తేజరిల్ల
తనమహాధామంబు ♦ ధామంబుచాడ్పున
రవికాంతరుచి భాసు♦రంబుగాఁగఁ
దనమహాకీర్తిను♦ధారాశి వారాశి
కైవడి భూస్థలి ♦ నావహింప

నలతునిరుపమసర్వంస♦హాధినాథ
సచివకులమౌళి సంతత♦సకలవిప్ర
దేవతారాధనాదిక♦ర్మావళిపర
తంత్రచిత్తుండు కృష్ణప్ర♦ధానుఁ డవని.

సీ. ఆకృష్ణసచివున ♦ కాత్మజులై మువ్వు
రుదయంబు నొందిరి ♦ సదయు లగుచు
ఘనదయాదాక్షిణ్య ♦ వినయాదిసద్గుణ
సహితుఁడై వేంకట ♦ సామినామ
ధేయుండు స్వర్ణగా ♦ త్రిని మనోహరవినూ
తనకాముఁడై నసీ ♦ తన్న మంత్రి
పితృమాతృబాంధవ ♦ ప్రియకరుం డర్చిత
విశ్వేశుఁ డై నవి ♦ శ్వేశ్వరుండు
ఘనులు సద్గుణగణరత్న ♦ ఖనులు మాన
ధనులు ఘనతరబాంధవా ♦ వనులుఁ బాలి
తావనీసురజనులు వా ♦ ర్దేవువంశ
పంకజాభ్రమణులు నయి ♦ ప్రబలి రవని.

వ. ఇవ్విధంబునఁ బెదసీతన్నసంతతిక్రమం బభివర్ణించి తదను
జుఁ డైన చినసీతన్నసంతతిక్రమం బభివర్ణించెద.

క. శరణాగతరక్షకుఁడై
యరుణసమానాంగదీప్తి ♦ యై సుగుణగణా
భరణుండై పూజితశివ
చరణుం డై చిన్నసీత ♦ సచివుం డొప్పెన్.

సీ. ఆమంత్రికులసార్వ ♦ భౌమున కతిసూక్ష్మ
మతు లుదయించిరి ♦ సుతులు మువురు

సుగుణసమాజుండు ♦ నగరాజధీరుండు
జలజాప్త తేజుండు ♦ చంద్రరాజు
వార్ధిగంభీరుండు ♦ వరరూపమారుండు
పటుభోగసురరాజు ♦ పద్మరాజు
దానరాధేయుండు ♦ దాక్షిణ్యహృదయుండు
జిష్ణువిక్రమశాలి ♦ కృష్ణమూర్తి
భూరిగుణరత్ననిధు లగు ♦ వీరిలోనఁ
బద్మరా జాస్యనిర్జిత ♦ పద్మరాజు
చంద్రరా జనుసూనుని ♦ సౌందర్యకాంతి
భానునిం గనె మదనస ♦ మానుఁ గొమరు.

వ. ఇవ్విధంబునఁ జినసీతన్నసంతతిక్రమం బభివర్ణించి చెల్లయామాత్యుసంతతిక్రమం బభివర్ణించెద.

సీ. ఎవ్వరిమందిరం ♦ బిందిర వసియింప
సుందరవికచార ♦ విందమయ్యె
ఎవనిమానసము న ♦ గేంద్రపుత్త్రీభర్త
నివసింపఁ గేళికా ♦ నిలయ మయ్యె
ఎవనిసభాస్థలి ♦ యెల్లవారికి హర్ష
జనకమై నూతన ♦ స్వర్గ మయ్యె
ఎవని తేజోరుచి ♦ నవహేళియుదయాద్రి
పాశ్చాత్యశిలలకుఁ ♦ బ్రభ ఘటించె

నతఁడు చతురబ్ధివేష్టిత♦క్షితివరాధి
నాథసన్మంత్రిసత్తము♦నవ్యహారి
రత్నభూతమహాగుణ♦రాజహారి
జనవరవిహారి చల్మయ♦సచివశౌరి.

సీ. సురరాజులీలచే♦శోభిల్లె నతఁడు భా
సురరాజలీలచేఁ ♦ బరగె నితఁడు
సుధను బాలనచేసి ♦ సొబగొందె నాతండు
వసుధను బాలించి ♦ ప్రబలె నితఁడు
విబుధరక్షకుఁడయి ♦ విలసిల్లె నాతండు
బుధరక్షకుండయి ♦ పొల్చెనీతఁ
డలరె సుధర్మస♦భాధ్యుఁడై యాతండు
ధర్మసభాధ్యుఁడై ♦ తనరె నితఁడు
గానఁ బాకాసురారికి ♦ ఘనతరునకు
నెన్నఁగా నేకవర్ణంబె ♦ హెచ్చుతగ్గు
గాని భూసురరా జని ♦ కవులు వొగడ
మహిని విలసిల్లెఁ జెల్మయా♦మాత్యశౌరి.

గీ. ఆమహామహుఁ డధికగు♦ణాఢ్య యైన
యచ్చమాంబుజనేత్రను ♦ హరుఁడు గౌరి
నబ్జనాభుండు లక్ష్మిని ♦ నబ్జభవుఁడు
వాక్సతిని వరియించుకై ♦వడి వరించె.

సీ. తాత యేమిపతివ్ర♦తామణి వాలికి
భానుసూనునకును ♦ భార్య యయ్యె
గౌతమీసతి యేమి ♦ ఘనగుణవతి సుర
నాథుతోఁ గ్రీడించె ♦ నయము లేక
సురగురుసతి యేమి ♦ సుగుణవతి సరోరు
హారితో రతికేళి ♦ ననుభవించె
నేమి సాధ్వీరత్న ♦ మిలను మందోదరి
యింద్రజుతోడ భో♦గేచ్ఛఁ జెందె
ననుచుఁ దార నహల్యను ♦ నమరగురుని
సతిని మందోదరిని నెంచి ♦ సకలగుణప
తివ్రతాసార్వభౌమియై ♦ తేజరిల్లె
నాననవిజితశశిబింబ ♦ యచ్చమాంబ.

గీ. ఆమహాసాధ్వి యధికగు♦ణాఢ్య యైన
యచ్చమాంబుజనేత్రయం ♦ దధికగుణులఁ
గృష్ణతుల్యుల వేంకట♦కృష్ణ సుబ్బ
యాత్మజులఁ గాంచెఁ జెల్మయా♦ఖ్యప్రధాని.

క. అం దగ్రజుండు ధరణీ
బృందారకపాలకుండు ♦ వేంకటరాయం
డిందీవరాయతాక్షీ
సందోహనవారవింద♦శరుఁడై యొప్పెఁ.

చ. సరసిజలోచనాకుసుమ♦సాయకు వేంకటరాయకీర్తియుఁ
హరిశరజన్మహంసభవ♦హారివిలాపము తద్వితీర్ణియున్
హరిగిశరజన్మహంసభవ♦హారివిలాసము తత్ప్రతాపముఁ
హరిశరజన్మహంసభవ♦హారివిలాసము చిత్రమిద్ధరన్.

సీ. రాజుతో గిరిశాధి♦రాజుతో నిగ్గర
రాజుతో వాహినీ♦రాజుతోడ
ఈశుతో ధాత్రీధ♦రేశుతోఁ గమలపా
ణీశుతో నుదయది♦నేశుతోడ
మారుతో శంభుకు♦మారుతో సూర్యకు
మారుతోఁ బన్నగ♦వీరుతోడ
భోజుతో మృగకుల♦రాజుతో వరధర్మ
రాజుతో ఘనరాజ♦రాజుతోడఁ
బోల్పఁదగు కీర్తి శాసన♦భోగ సుగుణ
యోగధైర్య కృపా కాంత్య♦నూనరూప
విక్రమ వితీర్ణ మతి కళా♦వీర్య ధర్మ
సంపదల మీఱు వేంకట ♦ సచివశౌరి.

ఆమహామహుఁడధికగు♦ణాఢ్యుడైన
కామమాంబుజనేత్రను ♦ గమలనేత్రుఁ
డబ్ధికన్యను శంకరుం♦డద్రికన్య
వాసవుండు శచీదేవి♦వలె వరించె.

సీ. పుణ్యజనారియై ♦ పొలుపొందె దైత్యారి
పుణ్యజనాళిని ♦ బ్రోచె లక్ష్మి
కామారియై యొప్పెఁ ♦ గాలకంఠుఁడు సర్వ
కామదాఖ్యాతినిఁ ♦ గాంచె గౌరి
వనజాసనుం డేక♦వర్ణంబుచే నొప్పె
బహువర్ణరూపయై♦ప్రబలె వాణి
శివధర్మఖండనఁ ♦ జేసెఁ గాకుత్స్థుండు
శివధర్మసహితయై ♦ చెలఁగె సీత
వీర లందఱు బతిధర్మ ♦ వృత్తి విడిచి
యన్యధర్మంబులను బూని ♦ రనుచు నెపుడు
ధవుఁ డొనర్చినకార్యంబె ♦ తా నొనర్చుఁ
గమలసుందరముఖబింబ ♦ కామమాంబ.

గీ. ఇట్టిసాధ్వీమతల్లిఁ జే♦పట్టి సకల
సంపదలఁ జెందె వేంకట♦సచివశౌరి
వారిదాంపత్య మవని నె♦వ్వారికైనఁ
గలదె నగపుత్త్రికాశంక♦రులకుఁ గాక.

శా. ఆసాధ్వీమణియందు గాంచె సుకుమా ♦ కారుభాస్వత్సుధీ
శ్రీసంపన్నుని వేంకటాచలపతిన్ ♦ శ్రీశాలి నారాయణా
ఖ్యాసంయుక్తభుజంగరాయసచివుం ♦ గారుణ్యవారాశి ల
క్ష్మీసంపన్నుఁడు వేంకటాఖ్యసచివ♦శ్రేష్ఠుండు ధాత్రీస్థలిన్.

ఉ. ఆయనతమ్ము లిర్వురు మ♦హాగుణవార్ధులు పోషితార్థులు
ర్వీయువతీమనోజు లర♦విందసఖాయతతేజు లూర్జితో
పాయులు సర్వకార్యనిర♦పాయు లజేయులు భూమిదానరా
ధేయులు బాంధవావళివి♦ధేయులు కృష్ణయసుబ్బయార్యు
లున్.

గీ. మహితగుణుఁడై నవేంకటా♦మాత్యమౌళి
సుతులు ముగ్గురిలో నగ్ర♦జుండు భువిని
వేంకటాచలపతికృప ♦ వివిధమై భ
వములచే వేంకటాచల♦పతి దనర్చె.

సీ. కువలయాక్షీదృక్చ♦కోరంబులకుఁ దన
వదనంబు చంద్రబిం♦బంబు గాఁగ
గవినిస్స్వతామహో♦గ్రవసంబునకుఁ దన
దానంబు భూరిదా♦వానలముగ
దుర్మంత్రిఫణివిత♦తులకు నాత్మీయమం
త్రిబలంబు కేకాస్య♦నంబుగాఁగ
శంకరపదసరో♦జములకు నిజమాన
సంబు రమ్యసరోవ♦రంబు గాఁగ
నఖిలవిద్వత్కవీంద్ర జి♦హ్వావిశాల
రంగముల నిజకీర్తి న♦ర్తకియుఁ గాఁగ
నలరువాఁడే ప్రవేంకటా♦చలపతిప్ర
భానుఁడు వదానజితభాను♦సూనుఁ డగుచు.

6

సీ. దివ్యభాస్వత్తుల♦దీపకుం డయ్యును
బుణ్యజనాళిని ♦ బ్రోదిసేయు
విబుధరక్షణలీల ♦ వెలయువాఁ డయ్యును
ఘనశివధర్మపా♦లన మొనర్చు
భూజనాదృతి మీఱఁ ♦ బొల్చువాఁడయ్యు వి
శ్వామిత్రవైరిమై ♦ యతిశయిల్లు
రామాభిరాముఁడై ♦ రాజిలువాఁ డయ్యు
రాజతనూజమి♦త్రత నొనర్చు
నహాహా యిదియేమి యబ్బుర ♦ మనుచు సుకవు
లభినుతులు సేయ నుజ్జ్వల♦విభవసాంద్రుఁ
డగుచు రాజిలు భువి వేంక♦టాచలపతి
సచివకులమౌళి సజ్జన♦జలజహేళి.

గీ. ఆసచివమౌళి సుగుణగ♦ణాబ్జహేళి
కూచిమంచికులాంబుధి ♦ కువలయారి
జిష్ణువిభవుండు గోపాల♦కృష్ణమంత్రి
తనయ సాధ్విని గామేశ్వ♦రిని వరించె.

చ. జలధితనూజ మాధవుఁడు ♦ శంకరుఁ డద్రికులేంద్రకన్యఁ బ
ల్కులచెలిఁ బద్మజుండును బు♦లోమజ వాసవుఁ డెన్న రానివే
డ్కల విహరించులీల నల♦కాముసరోరుహనేత్రి వేంకటా
చలపతియుం బరస్పరము♦సంతస మొప్పవసింతు రెంతయున్.

శా. ఆరామామణియందు గాంచె సుకుమా♦రాకారు నీరున్
నుహూ

దారున్ వేంకటరావుసంతతమహో♦ద్యత్స్వప్రభావున్ మహో
శ్రీరాజద్గుణవేంకటాచలపతి♦శ్రేష్ఠుం డుదారుండు దా
మార్యున్ నిర్జరనాయకుండతులధీ♦మంతుంజయంతుంబలెన్

సీ. ఎంతపర్యంతం బ♦నంత రాజిలుచుండు
నెంతకాలము నభం♦బెసఁగుచుండు
నెంతకాలమ్ము ది♦నేశుండు విలసిల్లు
నెంతకాలము నిశా♦కాంతుఁ డలరు
నెంతకాలం బొప్పు ♦ నిలను వారాసులు
నెంతకాలం బద్రి ♦ లేపుమీఱు
నెంతకాలము విశ్వ♦సృష్టినిర్మితచతు
ర్దశభువనంబులు ♦ తనరుచుండు
నంతపర్యంత మతివై భ♦వాస్పదంబు
నై రమాపరిపూర్ణమై ♦ యవని దివిజ
రక్షకంబయి వేంకట♦రాయవంశ
మమితనిత్యోత్సవంబుల ♦ నలరుఁగాత....

—*షష్ఠ్యంతములు.*—

శ్రీమత్కవివిద్వజ్జన
భోజునికి మహావితీర్ణ♦భూసురమణికిన్

సామంతరాజమంత్రిశి
ఖామణికి విరాజమాన♦కాంతితరణికిఁ.

క. శరణునకు భూరికరుణా
భరణున కనిశార్చితాద్రి♦పతిజాద్రిధను
శ్శరణునకు బాంధవావన
కరణునకు విరాజమాన♦ఘనశరణునకున్.

క. శాంతునకు విమలపుణ్య
స్వాంతున కంభోజ వృష్ణి♦చయ నూత్నరతీ
కాంతునకు గుణాక్రాంతా
శాంతునకును ధైర్యశైల♦జనకాంతునకుఁ.

క. శారదనీరదనారద
హారదరతుషారహీర ♦ హారనారదపా
టీరరుచి స్వచ్ఛయశో
ధౌరేయున కఖిలసుకవి♦తతిగేయునకుఁ.

క. పంకేరుహాపాణీశో
భాంకితకాయునకు శాత్రవాజేయునకుఁ
శంకరభక్తిహృదయునకు
వేంకటరాయునకు వినుత♦వివిధార్యునకుఁ.......

# కథా ప్రారంభము.

వ. అభ్యుదయపరంపరాభివృద్ధిగా నాయొనర్పం బూనిన నాచి
కేతూపాఖ్యానం బనుమహాప్రబంధంబునకుఁ గథాక్రమం
బెట్టి దనిన.

ఉ. శ్రీవసుధాధినాథవర • శేఖరలసన్మకుటాగ్రభాగర
త్నావళిరాజితాంఘ్రియుగుఁ • డై జనమేజయనామధేయధా
త్రీవరవల్లభుండు నిజ • దీప్తి దిగంతముల న్వెలుంగఁగా
దైవతరాజుకై వడి సు • ధర్మసభం గొలువుండె నిండుగన్.

క. ఆవేళ నేఁగుదెంచె మ
హావేలాతీతరుచియు • తాంగుఁడు వ్యాసాం
తేవాసి మౌనిపతివ్రతుఁ
డై వైశంపాయనుం డ • హఃపతివోలెన్.

ఉ. వచ్చినమౌనిఁ గాంచి నృప • వల్లభుఁడర్ఘ్యముపాద్యమాసనం
బిచ్చి కరంబుమ్రొక్కులిడి • యిట్లనుమౌనికులావతంసమా
మచ్చిక మీఱ వచ్చితిరి • మాభవనంబునకుం దలంపఁగాఁ
బిచ్చుకగుంటమీఁదికిఁ బ • వితసురాపగ వచ్చుకై వడిన్.

ఉ. ఓకమలాప్తతేజ! విబుధో • త్పలసంచయపూర్ణరాజల
క్ష్మీకరమై పవిత్రమయి • చిత్రతరంబయి భూర్యగణ్యపు
ణ్యాకరమై మహోన్నమయి • హర్షదమై భువనప్రసిద్ధమై
యేకథయొప్పునట్టికథ • యేర్పడమాకెఱుఁగంగఁజెప్పవే.

క. అన విని వైశంపాయన
ముని పారాశర్యుఁ దలఁచి ♦ ముదమున ననియెన్
జనవరనాయక! యొకకథ
వినిపించెద వీను లలర ♦ విశదోక్తులతోన్.

క. ఏకథ విని మనుజుఁ డఘా
నీకంబులవలనఁ దొలఁగి ♦ నిర్మలమతి యౌ
నాకథ నెఱిఁగించెద నీ
వాకర్ణింపుము మనఃప్రి♦యమ్మున నధిపా.

క. భాసురము సకలసుకృతని
వాసము పౌరాణికము శు♦భప్రద మఘసం
త్రాసకరం బగు నీయితి
హాసము వినుపింతు మాన♦వాధిప! వినుమా.

గీ. రాజసత్తమ! ధర్మప♦రాయణుండు
సకలవేదాంతశాస్త్రవి♦శారదుండు
బ్రహ్మమానసపుత్త్రుండు ♦ పరమమౌని
తిలక ముద్దాలకాఖ్యుండు ♦ గలఁడు ధరణి.

చ. జననుతమై తదాశ్రమము ♦ చందనసాలరసాలతిందుకా
ర్జునఘనసార నింబనికు♦రుంబకదంబతమాలమాలతీ
పనసపలాశవంజులల♦వంగ కురంటకనారికేళభూ
జనికరభాసురంబయి ర♦సాస్థలి నెన్నిక కెక్కె భూవరా.

సీ. మందారచంపక♦మల్లీలవంగపు
న్నాగ జాజీప్రసూ♦నావృతంబు
సంచరత్పికశుక♦చక్రవాకమయూర
హంసకారండవా♦ద్యండజంబు
నీరపర్ణానిలా♦హారతపశ్శుద్ధ
సిద్ధసంయమిసంఘ ♦ సేవితంబు
సారసలిలఫుల్ల♦సారసలలితకా
సారసంచయచర♦త్సారసంబు
గరుడగంధర్వకిన్నర♦కామినీని
షేవితలతానికుంజంబు♦శ్రీకరావ
నీరుహోపహృతశ్రాంత♦నిఖిలపాంథ
కశ్రమంబగు నుద్దాల♦కాశ్రమంబు.

క. ఏతాదృగాశ్రమంబున
ఖ్యాతిగ నుద్దాలకుండు ♦ ఘననిష్ఠుండై
వాతాంబుపర్ణభక్షకుఁ
డై తప మొనరించుచుండు ♦ ననిశము నెమ్మిన్.

ఉ. అంతట నమ్మునీంద్రుఁడుని♦జాశ్రమభూమికివచ్చుచున్నసు
స్వాంతునిఁ బిప్పలాదముని ♦ వారిజబాంధవతుల్యతేజు న
ల్లంతనె చూచియెంతయుర♦యంబునఁదోడ్కొనివచ్చిభక్తిచే
సంతస మొప్ప నాసన మొ♦సంగి సపర్యరచించియిట్లనున్.

క. స్వాగతమే మునివర! భవ
దాగమనం బేమిటికి మ♦హాధ్వశ్రమమే
లాగునఁ జన వచ్చితి భవ
రాగాదివిహీన పిప్ప♦లాదమహాత్మా.

క. కావున నరుదెంచినపని
యే వినఁగోరెద మునీంద్ర ♦ యెఱిఁగింపు మనం
గా విని యతఁ డిట్లనియెఁ ద
పోవిఘ్నం బొనర్పఁ దలఁచి ♦ భూవరనాథా.

గీ. అనఘ ని న్గన వచ్చితి ♦ నన్యకార్య
మేమియును లేదు గావున ♦ భీమరోమ
హర్షణంబు మహాతపం ♦ బాచరించి
తివి కళత్రగ్రహణబుద్ధిఁ ♦ దివిరి విడిచి.

చ. మునివర నీవు దక్క ముని♦ముఖ్యులు పుత్త్రకళత్రవంతులై
ఘనతరవంశసంగ్రహణ♦కాంక్ష వసించిరి పుణ్యవంశనా
శన మొనరించుకంటె నఘ♦సంచయమెద్దియు లేదు వంశర
క్షణమె పవిత్రధర్మ మటు♦గావునదారఁ బరిగ్రహింపుమా.

క. ఇలలో సురమునిపితరులు
కలకాలము నిర్మలోద♦కాంజలికాంక్షఁ
గలిగి వసింతురు గావున
గులము నిలుపవలయు మనుజ♦కోటికి మౌనీ.

గీ. ఎవ్వనికిఁ బుత్త్రసంపద ♦ నివ్వటిల్లు
నాతఁ డిహపరలోకసౌ♦ఖ్యంబుఁ జెందుఁ
బుత్త్రహీనుఁడు సుగతిని ♦ బొందఁ డనఁగ
నతని కిట్లను నుద్దాల♦కాఖ్యమౌని.

గీ. మానికులచంద్ర! ధాత్రి నే♦మానవుండు
సరవి విధిపూర్వకంబుగ ♦ సన్న్యసించి
మరల గార్హస్థ్యధర్మక♦ర్మముల నడుచు
నాతఁ డతిఘోరనరకంబు♦లందుఁ జనును.

క. వాసిగ నేఁ డుపవాసము
జేసెద నని తలఁచి పిదపఁ ♦ జేయనిమనుజుం
డో సంయమివర! నరకా
వాసుండై దుఃఖి యగుచు ♦ వర్తిలుచుండున్.

క. ధీమంతు లగుతపోధను
లోమునివర! తపము సేయ ♦ నూహింతురు గా
దే మదిని దపోవిఘ్నము
గామంబునఁ జేయు నాకు ♦ ఘనమే చెప్పుమా.

వ. అనినం బిప్పలాదుండు వెండియు నిట్లనియె.

క. చిత్తంబున నియమించుని
మిత్త్రము రిత్త యగునేని ♦ మేదినిఁ బ్రాయ
శ్చిత్తము గల దఘతతి కిం
చిత్తు ఘటింప దని మనువు♦ సెప్పఁగ వినవే.

క. అని తెల్పి పిప్పలాదుఁడు
సనియె నిజవాసమునకు ♦ సంరంభమునం
జనుదెంచె బిదప వనజా
సనుఁ డుద్దాలకమునీంద్రు ♦ సమ్ముఖమునకున్.

ఉ. వచ్చిననల్వఁ గాంచి ముని ♦ వల్లభుఁ డర్ఘ్యము పాద్యమాసనం
బిచ్చికరంబుమ్రొక్కులిడి ♦ యిట్లనిపల్కెఁ బ్రజాధినాథ యీ
రిచ్చటి కేల వచ్చితిరొ ♦ యేమిప్రయోజనమో సమస్తమున్
మచ్చిక నానతీం డనఁగ ♦ మౌనికిఁ బంకజగర్భుఁ డిట్లనున్.

గీ. అనఘ నిన్గన వచ్చితి ♦ నన్యకార్య
మేమియును లేదు కావునఁ ♦ గోమలాంగి
వంశకరి శీలవతి పద్మ ♦ వదన యైన
వనిత నిచ్చెదఁ గైకొమ్ము ♦ మునికులేంద్ర.

క. అన విని మునివరుఁ డబ్జా
ననుఁ గని యిట్లనియె బ్రహ్మ ♦ చర్యవ్రత మా
త్మను నాచే నియమిత మై
తనరఁగ నీ కిట్లు వలుకఁ ♦ దగునే దేవా.

క. సన్న్యాసినైన నన్నిటు
లన్యాయోక్తులను బలుక ♦ నర్హమె దేవా
కన్యాగ్రహణముకంటెఁ ద
దన్యాదేశం బొనర్తు ♦ నానతి యీవే.

క. అనవిని మునివరుఁ గనుఁగొని
వనజోదరుఁ డనుఁ ద్వదీయ♦వంశోన్నతికై
గుణశీలవృత్తములు గల
వనితామణి నీకు నొసఁగ♦వచ్చితి మౌనీ.

గీ. కావున మదాజ్ఞచేఁ గన్య♦కను బరిగ్ర
హింపు కాకున్న నేను లో♦కేశ్వరుండ
నైతినేనియు నీకు ము♦న్నాత్మజుండు
సంభవించు నతఁడు నీకు ♦ జాయ నొసఁగు.

గీ. సకలవేదాంతతత్త్వవి♦శారదుండు
గుణగరిష్ఠుండు సుతుఁడు గ♦ల్గును ననంత
రమున గుణవతి రమ్యాంగి♦రాజతనయ
కంబుకంధర పత్నిగాఁగలదు నీకు.

క. అన విని యుద్దాలకుఁ డి
ట్లనుఁ బంకజగర్భ! యుష్మ♦దాలాపము నేఁ
డన్నృత మగు నారి నెఱుఁగని
మనుజుం డాత్మజునిఁ గనుట ♦ మహిలోఁ గలదే.

గీ. ఆలి లేనివాని ♦ కాత్మజు లెటు సంభ
వింతు రబ్జగర్భ! ♦ విశ్వసింప
రాని దయ్యె నాదు♦మానసమున నీదు
వచన మనిన నల్వ ♦ వాని కనియె.

చ. మునికులనాయకా! వినుమ♦మోఘముగాని మదీయభాషణం
బనృతముగాదు కావున ని♦జాత్మఁ దలంపుము నాచికేతుఁ డన్
తనయుఁడు సంభవించును బ♦దంపడి చేకుఱు ధర్మపత్ని నీ
కని యెఱిఁగించి తాఁ జనియె♦నంబుజగర్భుఁడు భూవరోత్తమా.

క. వనజభవుఁ డేఁగుపిమ్మట
మునివరుఁడు తదీయవాక్య♦మును మిథ్యముగా
నొసరింపఁ దలఁచి వసియిం
చెను వనమున ఘనతపంబుఁ జేయుచు భక్తిన్.

మ. జననాథాగ్రణి సంయమీంద్రుఁడు తప♦స్సంతప్యమానాంగుఁడై
వనమం దుండఁగ నొక్కకాలమున ద♦స్స్వప్నంబు సిద్ధించినం
దున వీర్యస్ఖలనంబు గాఁగఁ గని చే♦తోవీథిఁ జింతించి జీ
వనజాతంబున నింద్రియంబు నిచి త♦త్పద్మంబు గావించి సూ
త్రనిబద్ధంబుగ; జాహ్నవీసలిలమ♦ధ్యంబందు వైచెన్ ధృతిన్.

వ. ఇవ్విధంబునఁ గావించి నిజాశ్రమంబునకుం జని యుద్దాలకుండు మహాతపంబు సేయుచుండె నని వైశంపాయనుం డెఱింగించిన జనమేజయుం డటమీఁదికథావిధం బెట్టిదని యడుగుటయు.

మ. తరుణీనూతనకామ కామమదమా♦త్సర్యాదిషడ్వర్గవై
రిరమాభాసురధామ ధామజితహే♦లిప్రస్ఫురత్కాశ కా

శరదాసోదరహారహీరసుమన♦శైవాలినీశారదా
శరదభ్రావళికుందచందన విభా♦స్వత్స్వచ్ఛకీర్తిస్తుతా.

నిరోష్ఠ్యమణిగణనికరము.

కరుణరసజలధి♦ఘనశుచికలితా
సరసిజ దళజిత♦శయనయనరుచీ
ధరణిధరనుతశ♦తగుణయశస్కా
అరిగహనదహన♦యతిజనభర్తా.

గద్య. ఇది శ్రీరఘురామ పదారవింద మరందరసపాన మధు
పాయమానమానస శారదానుగ్రహకటాక్షప్రసాదలబ్ధ
సరసకవితా ధురంధర మల్లికార్జునపౌత్ర వేంకటనా
యక తనూభవ మల్లికార్జున యశోధారేయ
మిక్కిలి మల్లికార్జున నామధేయ ప్రణీతం
బైన నాచికేతూపాఖ్యానం బనుమహా
కావ్యంబునందు ప్రథమాశ్వా
సము సంపూర్ణము.

శ్రీరస్తు.

శుభమస్తు.

# నాచికేతూపాఖ్యానము.

## ద్వితీయాశ్వాసము.

శ్రీవాడరేవుకులపా
రావారాత్రేయ విబుధ • రాట్స్తుతిగేయా
భావజనిభకాయా పృ
థ్వీవరనుతగుణనికాయ • వేంకటరాయా.

గీ. అవధరింపుము జనమేజ • యక్షితీశ్వ
రాధినాథున కిట్లను • వ్యాసశిష్యుఁ
డధికజవదానసందాని • తాశ్వధాని
రాజిలుధరిత్రి సాకేత • రాజధాని.

ఉ. ఆనగరంబునందు గల • హర్మ్యములన్ విహరించుచుండుకం
జానన లభ్రమార్గసరి • దంబులఁ దోఁచు నిజాననంబు లెం
తే నలినైకభావమునఁ • దేజరిలం గని తత్పరీక్షకై
పూని చరించుబింబములు • మోము లటంచు గ్రహింతు
రెంతయున్.

ఉ. ఆపురిలో గభీరపరి ♦ ఘాంబు విహ్వాత్పదతత ల్తదంతర
వ్యాపిరసాతలంబున క♦వారణలీలలఁ జొచ్చినాగక
న్యాపతి వత్త్రరత్నములు ♦ నచ్చటవెల్వడి సాల నెక్కుచో
గోపతిదత్తకల్పసుమ♦గుచ్ఛములుం గొని తాల్తురెప్పుడున్.

మ. ఘనవాతాహతి కోర్వలేక తరళా♦కాశస్థితి న్మాని వా
రణరూపంబులుదాల్చిబృంహితముగ♦ర్జాస్ఫూర్తిగాదానవా
ర్ధని ధారాంబువు గాఁగదంతరుచివి♦ద్యుత్కాంతిగాఁదత్పురిన్
వనరాశిస్థితిఁ బూనుఁగా న్మొగులవా♦వర్ణ్యంబులయ్యెంగరుల్.

ఉ. పాటవమొప్పఁదెమ్మెరకుఁ♦బొల్పడఁజాలదొకింతయున్ నిరా
ఘాటజవంబు నెమ్మదికిఁ ♦ గల్గ దహో వినిబద్ధవృత్తి యుం
కేటిరయంబు వాని కని ♦ యెన్నుచుఁ దత్పురరాజవీథులన్
ఘోటకము ల్చరించు ఖుర♦కోటివిఘట్టితభూతలంబులై.

ఉ. అంబుజసంభవుండు చతు♦రాననుఁడై మును దానునాల్గువే
దంబులునుంబఠించెనుబ♦దం; బొకమోమున మేమునాల్గువే
దంబులఁగల్గుసంహితప♦దక్రమముల్ జటయున్ బఠింతుమం
చంబుజగర్భు మెచ్చరు ధ♦రామరసంఘములప్పురఁ

క. రాజులు భుజబలజితపర
రాజులు పరభీకరాజ♦రాజులు రవిజి
త్పావనతమగుణ
రాజులు వెలయుదురు నగర♦రాజమునందున్.

గీ. రాజశేఖరసంతతిఁ ♦ దేజరిల్లి
స్వాధిపత్యంబు గాంచి యా ♦ శావనత్వ
మునఁ బ్రబలె నంచు నెంతురు ♦ ఘనుఁ గుబేరు
నాశ యొక్కింత లేక వై ♦ శ్యజను లచట.

చ. అలనగరంబునందు గల ♦ యంఘ్రిజు లుంచినరాజనంపుకు
ప్పలుగగనంబుముట్టఁగని ♦ భానుహయంబులుతృప్తిదీఱఁగా
నలరుచు నెక్కినిక్కియున ♦ రాద్రికి వే చనుచుండుఁగానిచో
నలవడునే దినంబులకు ♦ నాసమయంబునఁగాల్యమిమ్మహిన్.

గీ. సమరముఖమున హరియైన ♦ శంభుఁడైన
నింద్రుఁడైనను మమ్ము జ ♦ యింపఁగలరె
యనుచు వీరోక్తు లాడుచు ♦ ననుదినంబు
వీరభటు లుందు రప్పుర ♦ వీథులందు.

సీ. నెలనైనఁ బందు వె ♦ న్నెలనైన నిరసించు
ముద్దునెమ్మొగమును ♦ మొలకనవ్వు
దరముల మేరుమం ♦ దరముల హసియించుఁ
ఉ. ఆ॥ గోమలకంఠంబు ♦ కుచయుగంబు
నారంగముల మద ♦ సారంగముల గెల్చు
నలువు వేనలిసోరు ♦ నడలతీరు
మీలను జీమల ♦ చాలు నవ్వఁగఁజాలు
వాలుఁగన్నులబారు ♦ వన్నెయారు

గలిగి [illegible]యించు ఋషి రవా♦క్యముల హావ
భావశృంగారగరిమలఁ♦బ్రబలి యతుల
నైన విటులనుగాఁ జేయు♦సర్వా లగుచు
వారసతు లుండు రప్పుర♦వరమునందు.

సీ. కలికిరో సీయుంరు♦గంటి సదేకాము
డాడెను జనుమల♦వనజనయన
పథికేంద్రు బుత్తు వేఁగి ♦ పరికింప నెల దప్పె
నటుగాన వాడేఁ బ♦యస్సులేక
పికవాణి యెదపంపు♦టకుఁ గాల మెయ్యది
మాకెఱిఁగింపుము ♦ ప్రాకటముగ
యీనినపిమ్మట నెద♦పంపుటకుఁ గాల
మని యెఱుంగవె రసి♦కాగ్రిగణ్య
యనుచుఁ బాంథజనులతోడ ♦ ననుదినంబు
హేతుగర్భోక్తు లాడుచు ♦ నెదలు గరఁగఁ
మధురగానంబుచే యువ♦మనము గొనుచు
జాలిపాలిక లుండు రా♦ప్రోలియందు.

సీ. మామాట లాలించి ♦ రా మాసరసకు ము
దం బొసంగుము విడెం♦బంబు లేక
నాకువలయము నీ♦నేకదృష్టి నొసంగు
మన నిత్తురే సత్య ♦ మరసి చూడ

బాలరాజీవంబు ♦ భవదధీనం బగు
నమ్ము మన్నృతవచ♦నమ్ము గాదు
సత్సాగ్రగణ్యా మా♦కరసారసము గొని
పొమ్ము నీయాన గ♦రమ్మటంచు

సరసవాక్యోపవాక్య♦రచన మనోజ్ఞ
శబ్దములఁ బౌరజనులతో ♦ సంభ్రమమునఁ
జల్పుచు నరేంద్ర మన్మథ♦సాయకములు
విక్రయింతురు పుష్పలా♦వికలట వీట.

గీ. ఆపురంబున కధిపతి♦యై తనర్చె
రఘుపతి యనంగ ధరణీశ♦రాధినాథుఁ
డతఁడు భూలోకదేవేంద్రుఁ♦డనఁగ నెగడె
వర్ణనీయమహావైభ♦వంబువలన.

సీ. అవనిదేవతలు వి♦ద్యావిచక్షణు లైరి
సతులు పాతివ్రత్య♦సహిత లైరి
పరిపక్వసస్యయై ♦ పరగెను ధారుణి
నెల మూఁడువానలు ♦ నేలఁ గురిసె
జారచోరాదుల♦సంచారము లణంగె
నఖిలధర్మంబులు ♦ నభివసించె
మనుజులు సర్వసం♦పత్సౌఖ్యయుతు లైరి
దురితసంఘంబులు ♦ దొలఁగి చనియె

సకలయజ్ఞాదిసత్క్రతు♦సంఘ మవని
వెలసె వర్ణాశ్రమాచార♦విధులు దనరె
సజ్జనశ్రేణి వసించె ధరా♦ధినాథ
రఘుపతిప్రభు పాలించు♦రాజ్యమందు.

క. ఆమాంధాతపతికి సు
ధీమత్పున్నకృతజ్ఞనామ♦ధేయులు సుతులు
గ్రాములు శాత్రవగర్వవి
రాములు వెలయుదురు రామ♦లక్ష్మణులవలెన్.

గీ. ఆమహామహుపుత్త్రియై ♦ యవనిఁ బరగె
సజలజలధరనిభవేణి ♦ జలజపాణి
కుందసుందరరదన రా♦కేందువదన
చంద్రమతి యనుపేరిటి ♦ జలజగంధి.

ఉ. సాంద్రతరప్రభాతిశయ♦చంచలవృత్తుల మించు మాటికిం
దారలు డ్రవ సూతిపము ♦ దప్పయు భక్తి నొసర్చి సుస్థిరా
భారమహీయమై వెలయు♦భామపుసర్పనజన్మ మందిశ్రీం
గార మెలర్ప రాజిలెను♦గా తప మున్న నసాధ్యమున్నదే.

చ. రమణివిరాజదూర్ధ్వపద♦రమ్యతకై సరిరాక యోడి కూ
ర్మము మదిఁ జింతఁ బొక్కచుఁ ది♦రంబుగ నూత మునింగి సిగ్గునన్
భ్రమత వహించియుండె నట♦నాఁటికి నేఁటికిఁ జూడ ధాత్రిను
త్తములు సహింతురే పరకృ♦తంబగు భూరిపరాభవోన్నతిన్.

గీ. కలికిరమణీయజానుయు◆గ్మమ్ముసోయ
గము గనుంగొని శాలిగ◆ర్భములు వాడి
యోడెఁ గాకున్న వానికి ◆ నుర్విఁ జనముఁ
గనఁగఁ దలవంపు రా నేమి◆కారణంబు.

క. అంభోజనేత్రితొడలకు
రంభాస్తంభంబు లీడు ◆ రాఁ జాలక సం
రంభంబు దసరఁ బొరలుచు వి
జృంభింపఁగ నుండెఁ జేవ◆చెడి కానలలోన్.

క. ఆనాగిమణిపిఱుఁదులు
కానుం బొక్కిలియు నారు ◆ గణుతింపంగా
మానుగ ననంతలీలం
బూనెను సాంగత్యగుణము ◆ పో దెవ్వరికిన్.

క. కరములు రమణీయురమా
కరములు కులిశాబ్జమీన◆కమలజశోభా
కరములు పల్లవశోభా
కరములు విలసిల్లె సౌర! ◆ కాంతామణికిన్.

సీ. భాసురస్వర్ణకుం◆భంబు లీ డనవచ్చుఁ
బటికె నెప్టుక కాంతి ◆ ప్రబలెనేని
కమనీయపుష్పగు◆చ్ఛముల నీ డనవచ్చు
నుర్విలో నవి వాడ◆కుండెనేని

పరమై నగజనిమ్మ♦పంచు లే డనవచ్చు
నిత్యమై సత్కాంతి♦నిలిచెనేని
రమణీయఘనభూధ♦రంబు లీ డనవచ్చు
మృదుతరగుణ మందు♦మెలఁగెనేని
భవ్యవరరాజకృతకర♦స్పర్శ గాఁగ
నైఁచి యుండిన ధాత్రిని♦జకోరవాక
పక్షిరాజంబు లీ డని♦పలుకవచ్చుఁ
గన్నియలమిన్న బల్వన్నె♦చన్నుఁగవను.

క. దరము నలినాక్షి గనుపం
దర మగుకంధరముచారు♦తను నోడి మహా
దర మమర నకూపారో
దరమునఁ బడి డాఁగి యుండె♦ధవళద్యుతిమై.

గీ. పద్మసంభవుండు♦భాసురరూపంబుఁ
జేసి తనకు రుచి సృ♦జింపఁ డయ్యె
ననుచు బింబ మటవి♦నతితపం బొనరించి
సఫలమోవి యగుచు♦సంభవించె.

గీ. తిలసుమంబు చూచి♦దిద్దెను గాఁబోలు
నలినభవుఁడు చెలియ♦నాసతీరు
కాక యున్న దాని♦కనుపోయతగము దీని
కెట్లు సంభవించు♦నిద్ధరిత్రి.

గీ. భువి నవశ్రీలతోఁ ♦ గమలఁబొందు సేయు
ఏనుఁగవ గగ్గి విలసిల్లు ♦ మీననేత్రి
యగుట నూతనవనాయిక ♦ యప్పుడంతి
చెల్లుఁ గాంతలలో నవ ♦ శ్రీ యనంగ.

గీ. కలికిరమణీయముఖమును ♦ గెలువఁ బూని
కమలము సహస్రదళములు ♦ గలిగి పదన
చారుతకు నోడెఁ గాకున్న ♦ సరసిజమున
కవని యేల లభించు ఘ ♦ నాప్రతిష్ఠ.

గీ. రమణిరమ్యపదస ♦ రాజీవములఁ గల
సరసవచన మధుర ♦ సంబుఁ గ్రోల
వ్రాలినట్టిషట్ప ♦ దాలియో యనఁగను
గోపు మీఱు దాని ♦ చూపు లమరు.

సీ. మధుపానవర్తన ♦ మాని చరించిన
షట్పదప్రకరంబు ♦ సాటివచ్చు
విషరాశిసంగతి ♦ విడిచి వర్తిల నేని
శైవాలతతి పొందు ♦ సలుపవచ్చు
జలము వోయినతఱి ♦ వెలిబాఱకున్నను
జలధరవర్గంబు ♦ సమమువచ్చు
దోషగుణంబులఁ ♦ దొలఁగి వర్తిల నేని
యింద్రనీలాశ్మంబు ♦ లీడువచ్చు

ధరణినాయక పొలుపులై ♦ నిరుపమాన
నీలపక్ష్మవిభాసమ ♦ స్నిగ్ధతము లగుచు
మెఱుఁగులై సాంద్రతరములై ♦ మిసిమి వెలయు
చంద్రవదనాశిరోరుహ ♦ జాలమునకు.

గీ. అంబుదంబు గెల్చు గంబు ♦ కంఠవేణి
చిలుకఁ జులకఁజేయుఁ ♦ గలికిపలుకు
లంబుజంబు మీఱు ♦ బింబాధర మొగంబు
మీల నేలు బాల ♦ వాలుఁగనులు.

చ. కలువలఱేఁడు రేల్వగలు ♦ కాంతులచే విలసిల్లుచుండెనన్
నలినము లబ్జరాకలకు ♦ నైజవికాసము లందియుండెనన్
అళినికరం బహర్నిశము ♦ నార్పులు వెట్టక సంచరించినన్
జెలియముఖాలకాక్షులకుఁ ♦ జెల్వగుసామ్యము వచ్చు
భూవరా.

గీ. చంద్రమతిముఖవేణికా ♦ జఘనములకు
నబ్జఘనచక్రగరిమసా ♦ మ్యంబు నొందె
యువతిలోచనవక్షోజ ♦ యుగ్మములకు
నబ్జఘనచక్రగరిమసా ♦ మ్యంబు నొందె.

గీ. ఉత్తమాంగమైన ♦ యువిదకుఁ దగ దని
మధ్యమాంగసృష్టి ♦ మానెనేమొ
కమలజన్ముఁ డెల్ల ♦ గాకున్న సకలాంత
కములయెల్ల కౌను ♦ కానరాదె.

సీ. కాగైనచీమల ♦ బారుసారును గేరు
నారియొయ్యారంపు ♦ టారుతీరు
బంగరుబొంగరా ♦ లొప్పంగు గుబ్బింగఁగఁ జేయు
సంగసరంగుమే ♦ లుంగుఁజనులు
మేలైనబలుగంప ♦ విరాల నేలఁగఁ జాలు
బాలికనీలంపు ♦ వాలుఁగనులు
పెంపుమీఱఁగఁ బవడంపు ♦ సొంపు హరించుఁ
జంపకనాస ♦ నిద్దంపుమోవి

యన్నుమిన్నునగవు ♦ చెన్నగువెన్నెల
నెన్నఁగన్నెమోము ♦ పున్నమనెల
కన్నఁదిన్ననగుచు ♦ నున్నది బంగరు
వన్నె నవ్వు మేన ♦ వన్నెలాఁడి.

సీ. అంభోజములలైన ♦ సంభోదములలైనఁ
గుంభికుంభములైనఁ ♦ గొంచెపఱుచు
రంభాతరువునైనఁ ♦ గుంభినీస్థలినైన
సంభోజరిపునైన ♦ నపహసించుఁ
దిలసుమంబులనైనఁ ♦ గలహంసగతినైన
వలరాజువిలునైన ♦ బడలుపఱుచు
నెలరాలనైన వె ♦ న్నెలనైనఁ బసిఁడివ
న్నెలనైనఁ గినుకచే ♦ నలుగఁజేయు

నక్షికుంతలకుచమిథు♦నాంకయుగ్మ
కటితటాననానాసికా♦గమన భ్రూయు
గనఖహాసాంగకాంతులు ♦ గలిగినట్టి
బాల భూపాల! యింక వేయి♦పలుకు లేల?

గీ. కమలవైరిపరిసారమా♦త్రమునఁ బంక
జంబు లత్యంతముకుళీకృ♦తంబు లగును
జంద్రమతి ముఖచంద్రప్ర♦సారణమునఁ
గన్నుఁదమ్ములు వికసించె ♦ నన్న భళిరె.

క. తరుణి నయనోరునాసలు
హరిణీరంభాతిలోత్త♦మాత్యాకృతిభా
సురలీల నేలుచో న
స్యాత్మమణులీ డనఁగఁ దగునె ♦ యయ్యంగనకున్.

గీ. బోటికొప్పు ఘనంబుతో♦సాటికొప్పు
భామనెన్నుదు రరచంద♦మామ నెన్ను
నింతిగతి నిరసించును ♦ దంతిగతిని
చెలువనెమ్మోము కలువల♦చెలువు నేలు.

క. ఏతాదృగ్గుణసౌంద
ర్యాతివయస్సునఁ దనర్చు♦నయ్యింతికి నో
భూతలనాయక ! సురవర
కాంతరలోచనలు సవతు♦గారు తలంపన్.

క. ఆసారసాక్షి కనక
ప్రాసాదాగ్రంబునను ని♦రంతరము మహో
ల్లాసంబున నాత్మీయస
ఖీసంయుతయై వసించుఁ ♦ గ్రీడానిరతిన్.

గీ. అంత నక్కాంత యెంతయు ♦ సంతసమున
నాదిపుష్పసమాగమం♦బాత్మఁ దెలిసి
జనకుఁ డై త్రైలోక్యవిఖ్యాత ♦ ఘనచరిత్రి
జనకుఁ గని యిట్టు లనియె నో♦జనవరేంద్ర.

క. మానవనాయక! గంగా
స్నానము గావింప నిపుడ ♦ చనియెదవడి నా
కానతి యొసంగుఁ డన విని
యానరనాథుండు దనయ ♦ కానతియిచ్చెన్.

సీ. తమ్ముల మించుపా♦దమ్ములఁ గాంచన
రమణీయనూపురా♦రవము సెలఁగఁ
గటిభాగమున నున్న ♦ కాంచనోడ్యాణంబు
గంటలు గళుగళు♦గళ్లనంగ
మించుసోయగమును ♦ మించు నెమ్మేనిపై
సిరి మించు చెంగావి♦చీర దనర
బంగరుబొంగరా♦ల్పస మించుచన్నవ
రంగైనపైఁ టిణీ♦రైక మెఱయ

తనదు వెనువెంట నిజసఖీ♦జనము గొలువ
వేడుకలు మీఱఁగా జల♦క్రీడ సేయ
నాత్మఁ దలపోసి మదగజ♦యాన యలర
వచ్చె జాహ్నవిచెంత క♦మ్మచ్చెకంటి.

గీ. వచ్చి కనువేడ్క మీఱ న♦వ్వారిజాక్షి
సకియలందఱు కట్టువ♦స్త్రములు విప్పి
పావడలు దాల్చి డిగ్గిరి ♦ భావజాస్త్ర
సంఘమో యన జాహ్నవీ♦జలమునందు.

గీ. ఆతలిరుఁబోఁడ్లు చన్బంటి♦లోఁతు సొచ్చి
హెచ్చి జలకేళిఁ జేయ న♦య్యిందుముఖుల
మోము లబ్జంబు లని వచ్చి ♦ మొరసి తచ్ఛి
రోజములఁ జూచి షట్పద♦రాజి మూఁగె.

గీ. కామినీకుచహారిద్ర ♦ కలిత యగుచు
శారదానది కైవడి ♦ జహ్నుతనయ
దేజరిలెఁ దత్కుచప్రభా♦భ్రాజమాన
యగుచుఁ బిమ్మటఁ గన నొప్పె ♦ యమునభంగి.

శా. బాలాకర్కశపీనదుర్భరమహా♦వక్షోజఘాతంబులం
గాలుష్యంబువహించిమీఱఁగడుభం♦గంబందిభంగంబులు
ద్వేలాంతర్గతవేగ మొప్పఁ జని త♦ద్వృత్తస్తనాలేపయు
గ్లాచందనకుంకుమాగరు రస♦శ్రీలన్ హరించెన్ ధృతిన్.

క. ఒకకాంతామణి బాహువు
నొకకాంత మృణాల మనుచు ♦ నొగిఁ గైకొన వే
ఱొకకాంత యొడిసిపట్టెను
బ్రకటమ్ముగఁ దత్కరంబుఁ ♦ బద్మభ్రాంతిన్.

సీ. జలజంబులను జిమ్మి ♦ చెలి యొర్తు జడిపించె
మరుఁడ నే నని యొక్క ♦ సరసిజాక్షి
నది దాని బెదరించె ♦ నంగజహరుఁడ నే
నని సితాబ్జము శిరం♦బున ధరించి
తొయ్యలి యొర్తు కు♦త్తుకబంటినుండి యే
శశి నంచు భ్రమియించె ♦ సకియ నొర్తు
నదియు శైవాలావృ♦తాంగియై యట దేలి
యే రాహు వని దాని ♦ యే పఱంచె
నువిద లందఱు నీరీతి ♦ నొర్తు నొర్తు
విపులవేషంబులను జడి♦పించు చుదక
మున మునుంగుచు నట దేలు♦చును సలీల
సలిలకేళి యొనర్చి రు♦త్సాహలీల.

క. ఈరీతిం జలకేళి
న్గారవమునఁ జేయ జలము♦నం జంద్రమతీ
నారీమణి సూత్రావృత
సారసరాజంబు గాంచె ♦ సంతసమొప్పన్.

క. కనియప్పంకేజముఁ గై
కొని జాహ్నవి వెడలె దత్స♦ఖులతోఁ గ్రీడాం
బునిధివలన నచ్చర లను
వనితలతోఁ వెడలుపద్మ♦పాణి విధమునన్.

ఉ. కూలముఁ జేరి చంద్రమతి ♦ కుంతలముల్ముడియెత్తి వేడ్కచేఁ
జేల ధరించి పంకజము ♦ చేఁ గొని నిల్చియుంటమాత్ర న
వ్వేళను దన్నిమిష్టముని♦వీక్ష్య మమోఘము గాన మేదినీ
పాల! తదీయనాభితల♦వాసనఁ గాంచె నుదంచితంబుగన్.

క. ఆకాలంబునఁ జంద్రమ
తీకామిని సలిలకేళిఁ ♦ దేలి నిజసఖీ
రాకేందుముఖులు గొల్వఁగ
శ్రీకరమై వెలయు సౌధ♦శిఖరము నెక్కెన్.

సీ. దినదినక్రమముచే ♦ దివ్యవిగ్రహ మైన
వెలఁది కంతంత వే♦విళ్లు వొడమె
సారసాక్షికి వింత♦చవుల నింపులు గల్గె
మించుల మించు నె♦మ్మేయి కృశించె
రాకాసుధాకర ♦ రమణీయపాండుర
కాంతిచేఁ గనుపట్టె ♦ గాంతమోము
కలికినేత్రములు వి♦కసితసితాంభోజ
రాజమానంబులై ♦ తేజరిల్లె

నడుము బయలయ్యె నడ లెల్ల ♦ జడతఁ బడియెఁ
గల్మి తనరారెఁ బొక్కిలి ♦ గాననయ్యె
నలసత దనర్చె నబ్జాభవ ♦ రాధినాయ
కాత్మజకు గర్భ మంతంత ♦ యధికమయ్యె.

గీ. పొలుపు మీఱినట్టి ♦ పూవుగుత్తులపైని
వ్రాలినట్టి మధుక ♦ రములరీతి
చంద్రమతిలసత్కు ♦ చద్వయోపరి నీల
చూచుకంబు లపుడు ♦ చూడ నొప్పె.

గీ. కారుక్రమ్ముచున్న ♦ కనుఁగవఁ గలనల్పు
దత్కుచాగ్రములను ♦ దగిలె ననఁగఁ
దనరునీలకాంతిఁ ♦ దత్కుచాగ్రంబులఁ
గాక చన్నుఁగవను ♦ గలదె నలుపు.

గీ. చంద్రముఖి యని కవులెల్ల ♦ సన్నుతింప
వారలయమోఘవచనప్ర ♦ భావముననొ
పల్లవాధరమో మెల్ల ♦ వెల్లనయ్యెఁ
గాక కవివాక్యములు వృథా ♦ కరము లగునె.

గీ. ఘనమునీంద్రునిసంగతి ♦ మనకుఁ గలుగఁ
గార్శ్య మిఁక నేఁటి కని రోసి ♦ ఘనతఁ జెందె
ననఁగఁ గౌను ఘనత్వంబు ♦ నాశ్రయించె
ఘనులసన్నిధిఁ గల్గుచో ♦ ఘనులు గారె.

గీ. శ్రీతిపతీశ్వర! యచ్చంద్ర♦మతికి వివిధ
గతుల నీరీతిఁ దనరారె ♦ నతులితముగ
లలితజనలోచనానంద♦కలితరుచిర
లక్షణము లైనదౌహృద♦లక్షణములు.

క. ఈరీతిఁ దనరుగర్భము
నారీతిలకంబు గాంచి ♦ నయనాశ్రుగ యై
ఘోరతరవ్యథ మనమునఁ
జేరుకొనంగా నిటు విల♦పింపఁదొణంగెన్.

ఉ. అక్కట! యిట్టిరూపున మ♦హాదురితంబు ఘటించెనేఁడునే
నెక్కడ కేఁగుదే మనుదు ♦ నెవ్వరిఁ జేరుదు దృష్టివీధిమ
న్నెక్కడ నైన మానవుని ♦ నెన్నఁడుఁ గన్గొనలేదుగావనా
కిక్కడు పెట్టు గల్గెనొకొ ♦ యేమి యెఱుంగఁగరాదు
దైవమా.

క. అని బహురీతుల శోకాం
బునిధినిఁ బొగ్నాత్మ యగుచుఁ ♦ బొరలెడువనజా
ననఁ గని డగ్గఱఁ జని యి
ట్లని పల్కిరి కన్యకలు మ♦హాదర మొప్పన్.

క. ఓమగువా చింతిలఁ బని
యే మేతన్మాల మిప్ప♦డెఱిఁగింపుము మా
తో మర్మము విడిచి యనం
గా మానిని వల్కె శోక♦కలితాత్మకయై.

గీ. ఏమి చెప్పుదు మీచెంత ♦ నింతులార
పురుషుఁ డేరూపువాఁడో నే ♦ నెఱుఁగకున్న
గర్భ మయ్యె మహాద్భుత♦కారణంబు
గాన నింతకుఁ జింతింతు ♦ మానసమున.

గీ. ఏమి సేయుదు మదిని నూ♦హించి తెల్పుఁ
డిందుముఖులార! మీర లా♦సంద మలర
ననినఁ దద్వాక్య మాలించి ♦ యానతాస్య
లగుచుఁ గన్యలు మరల ని♦ట్లనిరి తలఁచి.

క. ఓమానిని! దీనికి మా
కేమియుపాయంబు దోఁచ♦దెద నూహింపన్
వేమరు నేతన్మూలము
నీమదికే తెలియవలయు ♦ నీరేజముఖీ!

క. నరుఁడో కిన్నరుఁడో ఖే
చరుఁడో సాధ్యుండొ రాత్రి♦చరుఁడో యేత
ద్గురుగర్భకారణము మా
కెఱుఁగంగా రాదు పూర్ణ♦మేందునిభాస్యా.

క. కావునఁ దద్వృత్తాంతము
నీవే యెఱిఁగింపు మాకు ♦ నిక్కంబుగ శం
కావిరహితమతివై రా
జీవాయతనేత్రి రాజ♦సింహాసుపుత్రీ.

చ. అవ విని పల్కెఁ జంద్రమతి ♦ యయ్యెడఁ దొయ్యలులార! తొల్లి నే
జనకునిశాసనంబు గొని ♦ జాహ్నవికిం జలకేళి సేయఁగాఁ
జనుసమయంబునం బురుష ♦ సంగమ మేమియులేకయున్న న
య్యెనపుడు గర్భమింతకుమ ♦ తేమియెఱుంగను నమ్ముఁడీమదిన్

ఉ. ఇంతయు నిక్కమై యమరు ♦ నిక్కథ నే నెఱిఁగించినట్లు భూ
కాంతుని చెంత కేఁగి కడు ♦ గారవ మొప్పఁగ విన్నవింపుఁడే
కాంతమునందునున్న యెడఁ ♦ గన్నియలార యటంచుఁ దెల్పియా
క్కాంత ధరాస్థలిం బడియె ♦ గాఢవిషాదనినాదకంఠయై.

గీ. మహిని బడినచంద్ర ♦ మతి లేవనెత్తి క
న్యకలు రాజసన్ని ♦ ధికి రయమున
నరుగుదెంచి మ్రొక్కి ♦ శిరమునఁ గరపుట
మమరఁ జేర్చి పల్కి ♦ రధిపుఁ గూర్చి.

గీ. రాజరాజ! భాను ♦ తేజ! మహారాజ!
యభయ మిమ్ము మనవి ♦ యాదరమునఁ
జిత్తగింపుమా భ ♦ వత్తనూజకు గర్భ
మయ్యె వినఁగ నది మ ♦ హాద్భుతంబు.

క. ఏపురుషువలన గర్భము
ప్రాపించెనో మాకుఁ దెలియ ♦ రా దింక ధరి
త్రీపాల! యనిన విని రఘు
భూపాలుం డుగ్రకోప ♦ పూరితమతియై.

10

ఉ. పిమ్మట భృత్యవర్గమును♦బిల్చి రఘుక్షితిపాలుఁ డుగ్రకో
పమ్మ దలిర్ప నిట్లనియెఁ ♦ బాపి దురాశయ వంశనాశ నీ
కొమ్మ నగాధవారివన♦కూపమునం బడవైచి రండు శీ
ఘ్రమ్మున నంచుఁ దెల్పభట♦రాజిధృతావనినాయకాజ్ఞయై.

గీ. వసుమతీశ్వర! రాకాబ్జ♦వదనఁ జంద్ర
మతిని మృగరాజశార్దూల♦తతిసమేత
విజనవనమున నసహాయ ♦ విడిచి మరల
వచ్చె నయ్యెడ నాత్మని♦వాసమునకు.

గీ. భీకరారణ్యభూమి నే♦కాకిని యయి
చింతఁ దనరఁ జరించు న♦ద్దంతిగమనఁ
జూచి వనదేవతలె కనుఁ ♦ జోద్యమందు
చుండు రీవంత దీని కె♦ట్లొందె ననుచు.

క. ఆకాలంబునఁ జంద్రమ
తీకామిని యున్నవనికిఁ ♦ దృణబిందుసమా
ఖ్యాకలితుఁ డగుమునీశ్వరుఁ
డాకస్మికముగను వచ్చె ♦ నవనీనాథా.

గీ. వనమునకు వచ్చి కుశదర్భ♦ఫలసమిచ్చ
యంబు గైకొని యేఁగఁ ద♦దాశ్రమమున
తప్తహాటకనిభగాత్రి ♦ ధవళనేత్రి
రాజవరపుత్త్రి నమ్మని♦రాజు గనియె.

క. కనుఁగొని కడు విస్మితుఁడై
ముని చంద్రమతీసమీప • మునకుం జని యా
వనితామణివృత్తాంతము
మనమున వినఁ దలఁచి పలికె • మానినితోడన్.

క. ఎవ్వరిదానవు బాలా
యివ్వనటకు మూల మేమి • యివ్వనమున కె
వ్వెవ్వనితోఁ జనుదెంచితి
వవ్వా! యీవార్త దెలియ • నంతయుఁ జెపుమా.

క. ఊర్వశివో మేనకవో గం
ధర్వసతీమణివో యక్ష • నాగాంగనవో
పర్వేందువదన నీ కీయు
ర్విం గలచెలులు సామ్య • మొందుదురటవే.

సీ. విరిఁబోణి నీమేను • విద్యుదాకారంబు
కలికి నీపదములు • జలరుహములు
లలన నీజఘనస్థ • లంబు భూసామ్యంబు
వనిత నీనాభి యా • వర్తసమము
కాంత నీకుచములు • ఘనభూధరంబులు
సకియ నీసెమ్మోము • చంద్రబింబ
మతివ నీముంగురు • లళిసమూహంబులు
తరుణి నీరమ్యకం • ధరము దరము

చెలియ నీరూపసంపద ♦ జలజభవుఁడు
సావధానమనస్కుఁడై ♦ భావమునఁ ద
లంచి ముదమునఁ దా సృజి♦యించె నొక్కొఁ
కాక యీరూపు గలదె లో♦కములయందు.

చ. కటకట! భీకరోరుమృగ♦కాననభూమికి భీతిలేక నీ
వెటువలె వచ్చితమ్మ దిన♦కృద్ఘనతీవ్రకరాభితప్తవి
స్ఫుటవిపులాశ్మసంఘమున ♦ సుందరమై తగునీపదాంబుజం
బెటువలె నోర్చెనమ్మ! వెత♦నెట్లుసహించితివమ్మకొమ్మరో.

గీ. ఇట్టివరరూపలావణ్య ♦ మిచ్చి నిన్నుఁ
గనకసౌధాగ్రమున నుంచ ♦ కనిశ మిమ్మ
హాటవీస్థలి నుంచెనే ♦ హాటకాంగి
యక్కటా! యెంత నిర్దయుఁ ♦ డబ్జభవుఁడు.

గీ. కాన నిక్కాన నున్కికిఁ ♦ గారణంబు
దెలియ భవదీయనామంబు ♦ చెప్పు మనిన
జంద్రమతి యిట్లనియె శోక♦జలధిమగ్న
మానసాంబుజ యగుచు ♦ నమ్మానిఁ గూర్చి

క. ఆపన్మూలదురాశయ
పాపదురాచారవంశ ♦ పరిదూషిత మా
తాపితృసంత్యక్తను రఘు
భూపాలతనూజ మౌని♦పుంగవ వినుమా.

క. నను బహుదోషనుగా నె
మ్మనమున నూహించి యదయ♦మానసుఁడై మ
జ్జనకుం డీవనమునకుఁ
బనిచెఁ జంద్రమతి యనెడు♦నామము దనరుఁ.

క. అన విని తాపసుఁ డిట్లని
యేను రమ్ము మదాశ్రమమున ♦ కింతిరో మాకుం
దనుజాసమాన నీ వన
వనితామణి చనియె మౌని♦వరు వెనువెంటన్.

క. మునివెనువెంటఁ దదాశ్రమ
మునకుం జని చంద్రమతి ప్ర♦మోదమ్మున నుం
డెను బిదపఁ గొంతకాలం
బునకుఁ నవమాసములు ప్ర♦పూర్ణము లయ్యెఁ.

గీ. నెలలు నిండినపిదప నా♦నీలవేణి,
ఘనశుభగ్రహాపుణ్యల♦గ్నంబునందు
వికచసారసనేత్రుఁ హా♦టకసమాన
గాత్రుఁ దనుకాంతిజితమిత్రుఁ ♦ బుత్త్రుఁ గనియె.

క. కని యేడ్చుచున్న కొమరుం
గని యిట్లను నోరిపుత్త్రి♦కా శోకింపం
బనియేమి నీనిమిత్తము
ఘనతరశోకంబు నాకుఁ ♦ గల్గెనుగదరా.

క. ఏవేళ నాదుకడుపున
నీవయితివో నాఁటనుండి • నెలవు వదలి నా
నావిధశోకము నొందుచు
జీవనశేషనయి కడుఁ గృ•శించితిఁ బుత్త్రా!

మ. అనియీరీతి బహుప్రకారములఁదు•ర్వ్యాధింగడుం జెందున
వ్వనజాతానన యొక్క-వత్సరము వో•వం జూచి ఖిన్నాత్మయై
ఘనమంజూష సృజించి వేగయదిలా•క్షాలిప్తమై యొప్పఁగా
మన సింపొంద రచించి యుంచె సుతుఁ ద•న్మధ్యంబునం
దత్తఱిన్.

గీ. అట్టియెడ రాచపట్టి తా • గట్టిలక్క
పెట్టెలోపలఁ దనముద్దు•పట్టిఁ బెట్టి
గట్టుదారపట్టిగట్టు క•ప్పెట్టెఁ జేర్చి
దిట్టయై పట్టి కిటు లాజ్ఞ•వెట్టె నపుడు.

గీ. ఓకుమారక! వినుము నీ • వుర్వి నెవని
వలన జనియించితివో నాకుఁ•దెలియరాదు
కాన నీతండ్రి యెవ్వఁడో • కాంచి వేగ
రమ్మటంచు నెఱింగించి • రాజతనయ.

ఉ. సారససంభవేశ ముర•శాసనులార మహాత్ములార జం
భారిధనంజయాంతకను•శాంతకపాశ్యనిలాలకాధిపాం
బారమణాఖ్యులార ఖర•భానుసమాను మదీయసూనునిం
గారవ మొప్పఁ గావుఁ డని•గాంగజలంబున వైచె నత్తఱిన్.

గీ. కమలనయన తనయు♦గాంగజలంబుల
నైచి చనియె నిజని♦వాసమునకు
మానవేంద్ర యపుడు ♦ మానినీపుత్త్రక
రండ మొప్పెఁ దజ్జ♦లంబునందు.

గీ. అంత నుద్దాలకుఁడు గను♦సంతసమున
స్నాన మొనరింప వచ్చి త♦జ్జాహ్నవీజ
లంబులను గ్రుంకఁ దత్కరం♦డంబు దాఁకె
నధిప! తాపసనాథోత్త♦మాంగమునకు.

క. శిరమునఁ దాఁకుకరండము
గరయుగ్మముచేఁ గ్రహించి ♦ కనువేడ్క ధరా
వర తర్పణాదికర్మము
నిరతిం గావించె నమ్ము♦నిప్రవరుండున్.

గీ. స్నానసంధ్యాదివిధులను ♦ జల్పి తత్క
రండ మయ్యెడఁ గొని ముని♦రాజు నిజని
వాసమును జొచ్చి తన్మధ్య♦భాసమాను
సకలలక్షణపూర్ణు బా♦లకునిఁ గనియె.

గీ. మునికులేంద్రుఁ డబ్బాలకుఁ ♦ గని ప్రమోద
సాగరాంతర్నిమగ్నుఁడై ♦ రాగమహిమ
నితఁడు పుత్త్రుఁడు గాఁ గలఁ ♦ డింతనుండి
యనుచుఁ బుత్త్రత్వమె రచించి ♦ పెనుచుచుండె.

గీ. మునికులేంద్రుఁ డాత్మ♦తనయున కనుదిన
మాదరంబు మీఱ ♦ నతిముదమున
నీళ్లు పాలు వోసి ♦ నిదురవోఁగొట్టెను
బర్ణశయ్యఁ దనరు ♦ పక్కపైని.

గీ. నియమ మలరంగ నచట ము♦నిప్రవరులు
తపము సేయుచు నుందురు ♦ ధన్యు లగుచుఁ
గాన నిమ్మునివాటి ద్రొ♦క్కంగ నగునె
పాదముల నంచు బాలుండు ♦ ప్రాఁకఁ జొచ్చె.

క. విద్దెములు సేసి తండ్రికి
ముద్దులు చూపించుచుండె ♦ మునితనయుం డా
ముద్దులకొమరునిఁ గని ముని
తద్దయు నానందపూరి♦తాత్ముం డయ్యెన్.

సీ. తమ్మిఁ జేరినషట్ప♦దంబులకై వడి
మురునైనముంగురు♦లొమ్రము గప్ప
చంద్రమండలమునఁ ♦ జంద్రికారుచిభంగి
నాననమున మంద♦హాస మమరఁ
జిగురుపొట్లంబును నగు♦చిన్నిమోవిలోఁ,
గుందములోల్పులబ♦ల్కుదురు దనరఁ
జిలుకపల్కులఁ గేరు ♦ జిలిబిలిపల్కులు
వీనుంగవకు బలు♦విందు సేయ

రసము గుల్కెడునడలు మీ♦ఱంగవచ్చి
హెచ్చి యొకసారి ముద్దిడి ♦ యేగవోయి
యనుచుఁ బిలువంగ మునిసుతుఁ♦డనుపమాన
లీల నరుదెంచుఁ దండ్రిపా♦లికి ముదమున.

గీ. సంతసము మీఱ మునితనూ♦జన్ముఁ డెప్పుడు
మునివరాశ్రమవాటి స♦న్మునితనయులఁ
గూడి క్రీడింప నుద్యాన♦కుంజము చూచి
నెమ్మనమ్మున విపులహ♦ర్షమ్ము నొందు.

క. ఈరీతి జనకుచెంతం
గారవమున నాడుచుండెఁ ♦ గడు బాలక్రీ
డారతుఁడై మునిరాజకు
మారుఁడు స్వేచ్ఛావిహార♦మానుం డగుచున్.

ఉ. పిమ్మట రాజపుత్రి కడుఁ ♦ బ్రీతిఁ దనూభవదర్శనార్థమై
నెమ్మది సంతకంతకు జ♦నింప రయమ్మున వచ్చి గాంగతీ
రమ్మున కచ్చటచ్చట వి♦రాజిలుసూనునిఁగానలేక మో
హమ్మున నేడ్వఁజొచ్చె విపు♦లాత్మజశోకపరీతచిత్తయై.

ఉ. హా సుకుమారరూపమహి♦మాతిశయాతిరమాకుమార హా
భాసురసూర్యధామ వర♦భవ్యమనోజ్ఞగుణాభిరామ హా
వాసవనీలతుల్యవిభ♦వాలకజాల విశాలఫాల హా
నీదురసోక్తి మీఱ జని♦నీ యనిపిల్వ వదేమి పుత్రకా.

ఉ. రా యను నింద్రనీలచికు♦రా యను మోహనరూపమా
కుమా
రా యను నేమి సేతుఁగద♦రాయను నెంతదలంచెదైవమా
రా యనునాదుగుండెబలు♦రాయనునెచ్చటనుంటిహోకుమా
రాయనునాకుదిక్కెవఁడస♦రాయనునెయ్యదితోఁచురాయనుఁ

సీ. నరులార యక్షకి♦న్నరులార కనరె ర
మాకుమారునిఁబోలు♦మాకుమారు
హరులార శార్దూల♦కరులార గనరె ర
మాకుమారునిఁ బోలు♦మాకుమారు
సతులార యష్టది♦క్పతులార కనరె ర
మాకుమారునిఁబోలు♦మాకుమారు
గిరులార పున్నాగ♦తరులార కనరె ర
మాకుమారునిఁబోలు♦మాకుమారు
నమచు బహువిధములఁ బుత్త్రి♦నడవియందు
వెదకుచును గానలేక నె♦మ్మదిని జాల
నలసి మోహంబుఁ జెంది ధై♦ర్యంబు విడిచి
కుమారా యటంచు న♦య్యతివ యుండె.

సీ. జనకాజ్ఞ గొని మున్ను ♦ జలకేళి సేయంగ
నే జాహ్నవీనది♦కేల సనితిఁ
జని యూర కుండక ♦ జలరుహాఘ్రాణం
బదేల సల్పితిఁ దెలి♦వింత లేక

సల్పినంతనె గర్భ♦సంభవ మేలమ్యో
నైనఁ బుత్త్రికుఁ డేల♦యవతరించె
నవతరించిన నేమి ♦ యతిగౌరవంబునఁ
బెంపక నది నేల ♦ విడిచిపైచి
తహహా విడిచిన పిమ్మట ♦ నాత్మపుత్త్రి
మోహ మేల జనించె న♦మోఘమైన
దైవయోగము గెలువ రా♦జీవసంభ
వేశులకు నైన శక్యమె ♦ యెంచిచూడ.

క. అని బహురీతుల శోకాం
బునిధినిమగ్నాత్మ యగుచుఁ♦బొరలుచు వనజా
శన ప్రతివనంబుఁ జూచుచుఁ
జని చని నిజపూర్వపుణ్య♦సంపన్మహిమన్.

క. కనుఁగొనె నొకయాశ్రమమున
మునితనయులఁ గూడి కడుఁ బ్రి♦మోదంబునఁ దా
ననువుగ నాడెడు బాలకు
ఘననీలాలకు మనోజ్ఞ♦ఘనలీలకునిన్.

క. ఆరామామణి గాంచెను
సారసదళరమ్యనేత్రు ♦ సన్నుతిపాత్రున్
ధీరచరిత్రుం బుత్త్రిన్
గారుణ్యనదీకళత్రుఁ ♦ గాంచనగాత్రున్.

చ. కనిముదమందిచంద్రమతి ♦ కౌఁగిటఁ జేర్చి ప్రియంబు మీఱ నో
తనుభవ యీవరాశ్రమము ♦ తాపసవిప్రసమానులంబుపా
వన మతిరమ్య మెవ్వనిది ♦ వర్ణనసేయఁగ లేఁడు దీని న
వ్వనరుహసంభవుం డయిన ♦ వత్స యెఱుంగఁగ నాకుఁ దె
ల్పుమా.

చ. అన విని నాచికేతుఁ డపు ♦ డానతుఁడై కడు దోసిలొగ్గియి
ట్లనుఁ జననీ మదీయజన ♦ కాశ్రమ మిచ్చట నుండుమగ్గురుం
డనిశము వగ్నిహోత్రపరుఁడై యిదె యిధ్మసమిత్కుశాదికం
బునుగొని తాఁగఁ గానలకుఁ ♦ బోయెను రాఁగలఁ డీక్షణంబునన్.

క. అని తనయుఁడు చెప్పిన విని
వనజాయతనేత్రి పూని ♦ వరవాసము మా
ర్జన పుష్పరచనచే శో
భనముగ రచియించి చనియె ♦ వసుధాధీశా.

గీ. మునివరాశ్రమంబు ననువుగ ♦ రచియించి
రాజపుత్త్రి యేఁగ ♦ రయము మీఱ
వచ్చె దర్భకుశస ♦ మిచ్చయంబును గొని
నిజగృహంబునకు ము ♦ నిప్రవరుఁడు.

గీ. అంత ముని వచ్చి విపులశో ♦ భావిరాజ
మాన మై భాసిలునిజాశ్ర ♦ మంబు గాంచి
డెందమున నలుదంది యం ♦ దంద నాడు
నాచికేతుకుమారునిఁ ♦ జూచి పలికె.

క. ఈరీతి నాశ్రమము శృం
గారాకారాంతంబు గాదు♦గద మహనీయ
శ్రీరంగవల్లికలను గు
మారా మున్నన నతండు ♦ మౌనికి ననియెన్.

గీ. ఓమునిశ్రేష్ఠ వినుము మ♦హోత్సవమున
నేఁడు భవదాశ్రమంబున ♦ నిరుపమాన
రంగవల్లీముఖాశేష♦రచన లొనర
ననువుగ నలంకరించి మా♦జనని చనియె.

క. అని యెఱిఁగించినతనతన
యునివాక్యం బాలకించి ♦ యుద్దాలకస
న్మునివరుఁడు మహానందాం
బునిధినిమగ్నాత్ముఁ డగుచుఁ ♦ బుత్త్రునితోడన్.

క. నీతల్లి యెచటనుండెనురా
తనయ యెఱుంగఁ దెల్పు♦తా నాకడ కే
వాతతగతిఁ జని తోడ్కొని
యాతలిరుంబోఁడి వేగ♦మరిగి కుమారా.

గీ. నీలవేణి విడిచి ♦ నిమిషమైనను దాళఁ
జాల భూరిసుగుణ♦శీల యనిన
నాచికేతుఁ డపుడు ♦ నయ మలరఁగఁ దల్లి
పాలి కరిగి యిట్లు♦పలుకఁజొచ్చె.

క. జననీ వడి రమ్మా మ
జ్జనకునిపాలికి నతండు ♦ ఋణమైన నినుం
గనుఁగొనక నిలువఁజాలక
పనిచెన్ నన్ననఁగ నాన్య♦పాత్మజ యనియెన్.

గీ. తల్లిదండ్రు లన్న♦దమ్ములు బంధులు
గన్య నొసఁగు టవని ♦ గలదుగాక
కొమరుఁ డంబ నియ్యఁ♦గూడునే యొరునికై
కలదె యియ్యయుక్త♦కార్య మిలను.

చ. అనఘ మహామునీశ్వరవ♦రాశ్రమవాటికలందు రోమహ
ర్షణమఘయుక్తమద్భుతము♦శాస్త్రవిరోధమధర్మసంయుతం
బు నపయశంబువిద్వదభి♦పూతమభూతమునీదు వాక్యమున్
వినఁదగ దంచుఁ దెల్పి సుతు ♦ వీడ్కొలిపెన్ మునివర్యు
చెంతకున్.

ఉ. అయ్యెడనాచికేతుఁడుమ♦హాగ్రహమొప్పఁగఁదండ్రిపాలికిన్
జయ్యన నేఁగి యిట్లనియె ♦ సంయమి మీకిటులాడఁజెల్లునే
నెయ్యము లేక పావనము♦నిప్రవరాశ్రమవాటియందు నేఁ
డయ్యయొయిట్టిదుర్వచన♦మాడఁగనోరెటులాడెఁదెల్పుమా.

గీ. పాపమూల మయుక్తము♦పావనంబు
ధర్మశాస్త్రవిరుద్ధమై ♦ తనరునీదు
పలుకు నాతల్లిసన్నిధిఁ ♦ బలికివచ్చి
తహహ ధారుణి నెంతదు♦ర్నయుఁడ నేను.

గీ. తల్లిదండ్రు లన్న♦దమ్ములు బంధులు
గన్య నొసఁగు టవనిఁ ♦ గలదుఁగాక
కొమరుఁ దంబ నియ్యఁ♦గూడ దన్యున కని
తెలిపె జనని మౌని ♦ కులవరేణ్య.

చ. అన విని మౌనివర్యుఁ డఖి♦లాగమకోవిదుఁ డాతనూజుఁబ
ల్కినుక నెఱింగియిట్లనియెఁ ♦ గేవలనింద్యమశాస్త్రసమ్మతం
బయనము దుర్గుణోద్భవము♦నై తనరారుమదీయవాక్యము
న్వినఁదగ దన్నమాటయది♦నిక్కమె నెమ్మది నెంచు పుత్రికా.

శా. ఏవంశంబున సంభవించెనొ గురుం♦డెవ్వాఁడొ నిర్భీతిమై
యీవన్యాటన మాచరింపఁ గతమే♦మే పేర నొప్పారె నో
నీ వేరీతిని సంభవించితివొ యా♦నీ రేజపత్త్రాక్షికిన్
వేవేగం జనిసర్వముం దెలియుమీ♦వృత్తాంతముఁబుత్త్రికా.

క. అని తెల్పిన మునివాక్యము
విని బాలుఁడు తల్లికడకు ♦ వేడుకమీఱం
జనుదెంచి కృతాంజలియై
వినయంబున నిటుల విన్న♦వింపఁదొడంగెన్.

క. ఏవంశమున జనించితి
వీవనమున కేమి రాక♦యెయ్యది నామం
బేవిధమున నేఁ గలిగితి
నీవార్తను దెలియఁజెప్పు♦మీ యెడఁదల్లీ.

చ. అవ విని రాజపుత్త్రిక ని♦జాత్మజుఁగన్గొని యిట్లువల్కె నో
తనయ మదీయవార్త విది♦తంబుగఁ దెల్పెదనాలకింపుమీ
వని యెఱిగింపఁజొచ్చె చతు♦రబ్ధిపరీతమహామహీతలా
వననిరతాత్ముఁడై రఘునృ♦పాలుఁ డొకండు కలండు భూ
స్థలిన్.

గీ. ధర్మనిరతుండు నిత్యస♦త్యవ్రతుండు
రాజవర్యుఁ డవార్యశౌ♦ర్యాభిరాముఁ
డనుపమానవిలాసవి♦ఖ్యాతయశుఁడు
పావనగుణుండు రఘుపతి♦భూవరుండు.

క. ఆరఘుపతిభూపతికిఁ గు
మారి నయి జనించి చంద్ర♦మతి యనుపేరం
ధారుణిఁ బెరుఁగుచునుంటిఁ గు
మారా సౌభాగ్యవిధి ♦ మగువలు గొలువన్.

క. ఏ నొక్కనాఁడు గంగా
స్నానము గావింపఁదలఁచి ♦ జనకాజ్ఞను క
న్యానికరముతోఁ జని గం
గానదిలో సూత్రబద్ధ♦కమలము గంటిన్.

క. కనుఁగొని ముద మలరఁగ న
వ్వనజముఁ గొని త్రాడు విప్పి ♦ వాసనఁజూడన్
దనయా విను తత్కాలం
బునఁ గల్గెను గర్భచిహ్న♦ములు రుచిరములై.

గీ. అంత రఘుపతి యివ్వార్త ♦ నాలకించి
కుపితుఁడై నిజపరిచార♦కులను బిలిచి
విజనవనమున నిక్కాంత ♦ విడిచి వేగ
రండటంచు నెఱింగించె ♦ రాకుమార.

గీ. రాజవాక్యము విని భట♦రాజి నన్ను
విజనవనభూతలంబున ♦ విడిచి చనియె
నంత ససహాయనై గహ♦నాంతరమున
నెన్నఁగా రాని కడుపంత ♦ నున్నవేళ.

గీ. ఓతనయ యచ్చటికి దైవ♦యోగమునను
వచ్చి తృణబిందుఁ డనుముని♦వర్యుఁ డొక్కఁ
డమ్మహాగహనంబున ♦ నధికశోక
ఖిన్న నై చరియించెడు♦నన్నుఁ గాంచి.

గీ. చూచి మానసమునఁ గడుఁ ♦ జోద్య మంది
యమ్ముని మదీయవృత్తాంత ♦ మాలకించి
విపులకరుణార్ద్రహృదయార♦విందుఁడై ని
జాశ్రమమునకుఁ గొనిపోయె ♦ నపుడు నన్ను.

గీ. అమ్మునీశ్వరు వెంటఁ ద♦దాశ్రమమున
కరిగి కడు సౌఖ్యమున నున్న♦యవసరమునఁ
గొంతకాలమునకు నాదు♦కోర్కి దీఱ
ధీరుఁడవు నీవు జనియించి♦తివి కుమార.

గీ. పుట్టినట్టినిన్నుఁ ♦ బాడఁగవి యొకలక్క
పెట్టెలోనఁ బెట్టి ♦ పట్టి వేగ
గొంచి రమ్మని నిన్నుఁ ♦ గన్నతండ్రి నటించు
గంగయందు విడిచి ♦ తిం గుమారా.

క. నిను గంగయందుఁ బడ్డనై
చినకొన్నిదినంబులకు వి ♦ శేషతరత్వ
జ్జనితాదరమ్మునను ని
ష్ఠనఁ దిరుగుచునుంటిఁ బ్రతివ ♦ నంబునఁబుత్రా.

గీ. ఓతనూజ నిను వ ♦ నోర్విని వెదకుచుఁ
గంటి నిమ్మునీంద్రము ♦ ఘనతరాశ్రి
మమున ననుచుఁ జెల్ప ♦ మాతృవాక్యము విని
నాచికేతుఁ డేఁగె ♦ నరవరేణ్య.

క. జనకునిపాలికిఁ జని యి
ట్లని పల్కెను నాచికేతుఁ ♦ డనఘా వినుమ
జ్జనని రఘుపతితనూభవ
యనఁదగుఁ జంద్రమతి దాని ♦ యూహ్వయ మెన్నన్.

క. గంగాస్నానమ్ముకై య
య్యంగన చనుదెంచి పంక ♦ జాఘ్రాణము సే
యంగ నపుడు గర్భోద్భవ
ముం గాంచె నటంచుఁ దెల్పె ♦ మునికులనాథా.

క. అనఁ దనయునివాక్యము విని
మనమున విస్మయము నొంది ♦ మౌనీంద్రుఁడు హా
వనజభవుఁ డెంతచతురుం
డని తలఁచి కుమారుఁ జూచి ♦ యపు డిట్లనియెన్.

ఉ. ఓరి కుమార నీ విచట ♦ నుండుము నింపుముదంబెలర్పఁగా
ధీరుఁ ద్రిలోకవిశ్రుతు సు♦ధీవరసన్నుతసచ్చరిత్రుఁ ధా
త్రీరమణాధిపున్ రఘుప♦తిప్రభుఁ గన్గొని వేగ వత్తు నేఁ
డారయ నంచుఁ దెల్పి చనె ♦ నయ్యెడ మౌనివరుం
డయోధ్యకున్.

క. అరుదెంచినమునిఁ గనుఁగొని
నరవరుఁ డెదురేఁగి తెచ్చి ♦ నమ్రుండై భా
సురకనకాసనవర మిడి
పరభక్తిఁ బూజసేసెఁ ♦ బాద్యార్ఘ్యములన్.

గీ. రాజసత్తముఁ డీరీతిఁ ♦ బూజసేసి
సకలబుధపుంగవామాత్య♦నికరయుక్తుఁ
డై కరంబుల నిటలత♦టాంతమున న
మర్చి యిట్లని పల్కె న♦మ్మౌనిఁ గూర్చి.

గీ. సంయమీ! నాదుజన్మంబు ♦ సఫల మయ్యె
ఫలిత మయ్యెను మత్క్రియా♦పరికరంబు
నేఁడు భవదీయపదనలి♦నీరజంబు
వలనఁ బావన మయ్యె మ♦న్నిలయ మహహా.

క. ఏదేశంబున నీవారలు
సాదరముగ నుందురో మ♦హాత్మా దేశం
బాదేశము గావున భవ
దాదేశం బిప్పుడొసఁగు ♦ నానతియీవే.

క. నానామణిగణకాంచన
గోనిచయమహాకరీంద్ర♦ఘోటకకోటిం
గానుక నిచ్చెదఁ గైకొని
మౌనీంద్రా నన్నుఁ బ్రోవు♦మా యన మునియున్.

క. రాజోపమతేజ మహా
రాజ విరాజత్కిరీట♦రత్నవిభాసీ
రాజితనిజపదయుగళాం
భోజా బుధకల్పభూజ ♦ భోగబిడౌజా.

క. నీ వొనరించుసపర్యకు
భూవరవర! చాలఁ బ్రీతిఁ ♦ బొందెద నా మ
ద్భావము నే నొకటడిగెద
నీవే తద్వాంఛితము మ♦హీపతిమౌళీ.

గీ. మానవేంద్ర వినుము ♦ మద్వంశరత్నార్ఘ
మై భవత్సుపుత్త్రి♦యైన కనక
గాత్రి వికచకమల♦నేత్రి నాకు నొసంగు
మో ప్రియమున మాను♦మాటు లేక.

చ. అనవినియిట్లనవల్కె మను♦జాధిపుఁడమ్మునినాథుఁగూర్చి యో
నన్నృతము వల్కఁగాఁదలఁప ♦ నాత్మతనూజలు లేరునాకు ము
న్ననయ యొకర్తు గల్గె దురి♦తాశయ దుష్టచరిత్ర దానికా
ననమున కేఁగఁ బంచితి న♦నంగ మునీంద్రుఁడు వల్కె
వెండియున్.

క. మానవనాయక విను మా
మ్మానవతీమణి మదాశ్ర♦మమ్మున నుండెన్
సూనునిఁ గూడి ముదంబున
దాని వరింపంగఁ గోరె♦దను మదిలోనన్.

గీ. మాఱుమాట లేక ♦ మగువ నిమ్మన విని
రాజశేఖరుఁడు గ♦రంబు విస్మ
యంబు నొంది యిట్టు ♦లనియె నేతద్వార్త
నెఱుఁగ జెప్పవే ము♦నీంద్రచంద్ర.

క. అన విని మునివరుఁ డిట్లని
యెను భూవరుఁ జూచి మేది♦నీశ్వర చతురా
ననశాపమహిమ యింతయుఁ
దనరెను దాఁటంగ వశమె ♦ దైవకృతంబున్.

గీ. సావధానుఁడ వగుచుఁ ద♦ద్దైవతంత్ర
మంత యెఱిఁగింతు వినుము మ♦దాశ్రమమున
కజుఁడు వచ్చి మదీయవం♦శాభివృద్ధి
కై యొసంగించెఁ గొను మొక ♦ కన్య ననుచు.

సీ. అని యివ్విధంబున ♦ నజుఁ డెఱింగింపఁ ద
ద్వాక్యంబు నెమ్మది ♦ దలఁపకున్న
ననుఁ గని పంకజా♦సనుఁడు మునిశ్రేష్ఠ
ధృతిని మదాజ్ఞ మీ♦ఱితివి గాన
శీలవంతుఁడు గుణ♦శ్రేష్ఠుండు సర్వల
క్షణపరిపూర్ణుండు ♦ సకలశాస్త్ర
వేదవేదాంగాది♦వివిధార్థకోవిదుం
డనుపమానుండగు♦తనయుఁ డొకఁడు
మున్ను గల్గును బిమ్మట ♦ సన్నుతాంగి
రమ్యగుణవతి యతిపతి♦వ్రత నరేంద్ర
పుత్త్రి రాజీవదళనిభ♦నేత్రి ధర్మ
పత్ని యూ నని నాకు శా♦పం బొసంగె.

క. అని శపియించిన వనజా
సనుఁ గని యే నిట్టు లంటి ♦ జలజోద్భవ మే
దినిపై నాలి నెఱుఁగక
తనయుం డుదయించు ననుట ♦ తథ్యం బగునే.

చ. అన విని నన్నుఁ జూచి వన♦జాసనుఁ డిట్లనుఁ దాపసోత్తమా
మును నమృతోపమంబును బ్ర♦మోదకరంబుఁ దనూభవా
స్యముం
గనియెద వీవు పిమ్మటను ♦ గల్గును దారపరిగ్రహంబు నీ
కనియెఱిఁగించితాఁ జనియె♦నంబుజగర్భుండు భూవరోత్తమా.

క. వనజభవుఁ డేఁగుపిమ్మట
ననఘా యుగ్రంబు జనభ◆యంకరము నిరా
శనతపము సల్పుచుండెడి
వనదేవత లంత భీతి ◆ వడఁకుచునుండన్.

క. సురవరగరుడోరగఖే
చరకిన్నరయక్షసిద్ధ◆సాధ్యులు నతిభీ
కర మగుమదీయతపమున
కరు దందిరి మానసముల ◆ నవనీనాథా.

క. ఈరీతి ఘోరతపము మ
హారణ్యమునందుఁ జేయు◆నవసరమున ధా
త్రీరమణా స్వప్నమునం
దారూఢిగ నయ్యె నిందిర◆యవతన మంతన్.

క. నైజం బగుబీజముఁ గని
రాజీవములోన నునిచి ◆ రాజేంద్రా గం
గాజలమున నైచి తదం
భోజము; నిజవాసమునకుఁ ◆ బోయితిఁ బిదపన్.

క. గంగాస్నానం బొనరిం
పంగ భవత్తనయు వచ్చి ◆ పంకేరుహ ము
ప్పొంగుచు నాఘ్రాణముఁ జే
యంగఁ దదింద్రియము నాభి◆యం దలరారెన్.

గీ. బీజ మహీపుడు తదీయనా♦భిప్రవిష్ట
మైనఁ బిమ్మట నయ్యింతి ♦ కస్మదీయ
వీర్యకారణగర్భంబు ♦ వెలసె ననఁగ
నవనినాథుండు గను విస్మ♦యంబు నొందె.

కం. మునిపతులనాయకుఁ గని యి
ట్లనియె మహాభాగ విను మ♦హాదరమున మ
త్తనయ నొసంగవ నిక్కం
బనభిజ్ఞత మీఱఁ బంచి ♦ తడవికి దానిన్.

వ. అని యివ్విధంబునం బ్రతిజ్ఞచేసి చారుల రప్పించి వనంబునకుం జని మదీయతనయం దోడ్కొని రండని నియోగింప వార లుద్దాలకాశ్రమంబునకుం జని ధూమజాలస్థగితవైశ్వానరజ్వాలపోలికఁ గృష్ణపక్షంబునఁ గృశియించు నిందురేఖకై వడి విలసిల్లు చంద్రమతియువతీమణిం గనుంగొని రాజశాసనం బెఱింగించి పుత్త్రసహితంబుగాఁ దోడ్కొని పురంబునకు వచ్చి రాజసన్నిధికిం గొనిపోయిన నతండును నిజతనూజం గని మహానందసాగరంబున మునింగి నిజాంతఃపురంబునం దుండ నియమించి పౌరుల రప్పించి పురం బాద్యంతంబుగా నలంకరింపుఁ డని యాజ్ఞాపించిన నగుంగాక యని రాజాజ్ఞావహులై నగరజను లనంతరంబ.

సీ. కాంచనఘనమణిఖచితగృహద్వార
            ములఁ గల్పతోరణముల నమర్చి
యిళ్ల వాకిళ్ల నగళ్ల రచ్చల వట్టి
            వెళ్లపందిళ్లు భాసిల్ల నైచి
మేడల రతనంపుగోడలు మంచిగం
            ధంబు లేఁబూఁత లందముగ నలఁది
తెలుపైన వజ్రింపుటరఁగుల రంగైన
            రంగవల్లికలు చెలంగ నునిచి
పౌరజను లివ్విధంబునఁ బట్టణంబు
నవరసురపురమో యన నతిశయిల్ల
వేడ్క మీఱంగ బాగుగావించి విన్న
వించి రధిపునిచెంత కేతెంచి యిటుల.

గీ. ఓనరాధిప భవదాజ్ఞచే నగరము
గరము రమణీయలక్ష్మి కాకరముగా ర
చించితిమి గాన వేగ వేంచేసి చిత్త
గింపుఁ డన విని ముదము జనింప నృప

గీ. వెడలి పురలక్ష్మిఁ గాంచియు శ్రీవిభుండు
విస్మయము నొంది మతిఁ గను వేడ్క మీఱ
శుభముహూర్తంబు మేదినీసురులవలన
నొనరఁ బెట్టించి సుఖలీల నున్న వేళ.

గీ. మిత్రుఁడై యుండి కువలయా♦మిత్రుఁడైన
కతన జనియించు దత్పాత♦కము హరింపఁ
దలఁచి యపరాంబురాశిలోఁ♦దానమాడ
నరిగెనో యనఁ బద్మినీ♦వరుఁడు గ్రుంకె.

సీ. రవికరసంతప్త♦రాజమానాస్తశై
లప్రభాకరశిలా♦ప్రభ యనంగ
రేఱేనిరాకకు ♦ రేచాన దాల్చిన
సిరిమించుచెంగావి♦చీరె యనఁగ
నస్తాద్రిమధ్యవ♦నాంతనితాంతవి
భ్రాజజ్జపాసూన♦రాజి యనఁగ
రాజు వచ్చుచు మత్స♦రంబున కని తెచ్చి
వరుణుఁ డుంచినరత్న♦వర్గ మనఁగ
గగనవీథిని విపులరా♦గమునఁ దనరె
సంశయాకరమై సర్వ జనుల కమల
రక్తసారసకహ్లార♦రక్తబిందు
రక్తమృత్పద్మరాగసాం♦ద్రరుచిసంధ్య.

సీ. పాకాసురాంతక♦ప్రాసాదవీథిపై
భాసిల్లునగరుధూ♦పం బనంగ
శమనపట్టణవర♦సౌధకుడ్యములపైఁ
జాలుపొందుకస్తూరి♦పూఁత యనఁగ

వరుణమహాపురీ♦వరహర్మ్యరాజులఁ
గనుపట్టుహరినీల♦కాంతి యనఁగ
రాజరాజపురస్థ♦రాజవీథులయందుఁ
బరగినచలువపం♦దిలి యనంగ

కలితహరినీలహరినీల♦కంఠకంఠ
వనదవనరాశివనరాశి♦వనజబంధు
కన్యకాసాంద్రరుచినిభా♦కార మగుచు
నంధకారంబు దిశ లెల్ల ♦ నాక్రమించె.

సీ. గగనభాగవినీల♦కాసారమున విల
సిల్లుబేడిసమీల♦పిల్ల లనఁగ
మెట్టరావిలుడాల్పు♦మినుసికపై బలు
సొబగొందు మల్లికా♦సుమము లనఁగ
కమలబాంధవతప్త♦ఘనవీథిపైఁ దోఁచు
నవిరళస్వేదబిం♦దువు లనంగ
విబుధు లందఱుఁ గూడి ♦ విష్ణుపదంబునఁ
బూజసేసినవెండి♦పూ లనంగఁ

గూర్మి తేరేని వరియింపఁ ♦ గోరి ముదము
మీఱ రేచాన మినుగొప్పు♦మీఁదఁ దాల్చి
నట్టిముత్తెపుసజ్జ ల♦నంగ దివిని
దారకలు విలసిల్లె ని♦తాంతకాంతి.

సీ. ప్రాచీదిగంగనా♦ఫాలభాగంబునఁ
బొలుపొందుకుంకుమ♦బొట్టనంగ
విరహిజనితాప♦కరమార్తచిత్తసం
భవమూర్తివత్ప్రిత్రా♦పాగ్ని యనఁగ
నుదయాద్రిభూనాయ♦కోత్తమాంగంబున
మణిరత్నమయహేమ♦మకుట మనఁగ
జక్రివాకద్విజ♦చయము శోకింప నం
గజుఁ డేయులసదశో♦కాస్త్ర మనఁగ
నగఘనశ్లిష్టనిలయుండు ♦ మృగధరుండు
నూత్నకైరవలక్ష్మీమ♦నోహరుండు
జలరుహావిహారిచోరుండు♦చందురుండు
గానవచ్చె నుదయరాగ♦కలితుఁ డగుచు.

గీ. అంత కంతకు నుదయరా♦గాంకురంబు
చవిసఁ గనులారి గనుపట్టె ♦ శారదాభ్ర
శారదాభ్రసరోజినీ♦హారహీర
హారినారదపాంసురా♦కారుఁ డగుచు.

క. ఆసమయమున ముహూర్తం
బాసన్నంబైన రఘున♦రాధిపుఁడు మహో
ల్లాసంబునఁ బరిణయపీ
ఠాసీనుం జేసె నమ్మ♦హాత్ముని భక్తిన్.

సీ. జలజాక్షి యొక్కతె • సంయమీశ్వరునకుఁ
దలయంటె సంపంగి • తైలమునను
తరళాక్షి యొక్కతె • తాపసోత్తమునకు
నలుగైనగంధపు • నలుగు వెట్టె
వనితామణి యొకర్తు • మునిసార్వభౌముని
జలకమార్చె నుష్ణ • జలమువలన
నంగన యొకతె మ • హాత్ముని మేనందుఁ
దడి యొత్తె ధవళవ • స్త్రములవలన
రమణి యొక్కతె పీతాంబ • రములు నిచ్చెఁ
గలికి యొక్కతె గంధాక్ష • తల నొసంగ
లలన యొక్కతె నెమ్మి న • లంకరించె
భోగిభూషణనిభ మహా • యోగి కపుడు.

చ. అతివ యొకర్తు వచ్చి తల • యంటెను నల్గిడె భామ యొర్తు దా
నతిముద మొప్పఁగా జలక • మార్చిచి వేతడి యొత్తె రామ యొ
ర్తు తిలక ముంచె నెన్నుదుటఁ • దొయ్యలి యొర్తు విభూష
[లుంచెఁ దాఁ
బతికడ కొర్తు తోడుకొని • వచ్చెను జంద్రమతీసతీమణిన్.

సీ. భీకరారవభూరి • భేరిఢక్కాపణవ
కాహళాదినాదములు మి • న్నంది చెలఁగ
పదవర్ణములు బహు • పద్యగీతంబు లిం
పుగ వేశ్య లభినయిం • పుచును బాడ

దశదిశాభాసుర◆విశదప్రభాయుత
కర్పూరదీపికా◆కాంతి దనర
దేశాంతరానీత◆దివ్యనృపోత్తమో
పాయనంబులు మెల్ల◆పగిది నమర
నిసుకచల్లిన రాలక ◆ పొసఁగుచున్న
భూపజనంబు నల్గడల్ ◆ సుట్టుకొనఁగ
రఘుపతిక్షితిపతిమంది◆రము దనర్చె
నపరసురరాజపురవరం◆బనఁగ నపుడు.

గీ. నరవరోత్తముఁ డభ్యంజ◆నం బొనర్చి
రమ్యమైనట్టిపీతాంబ◆రంబు దాల్చి
మౌనికులచంద్రుపాదప◆ద్మములు భక్తి
దనర బంగరుపళ్లెర◆మునను గడిగి.

గీ. హెచ్చి విప్రులు మంత్రంబు ◆ లుచ్చరింప
నిజతనూజను మునికిఁ బా◆ణిగ్రహణము
చేసె విద్వత్సమూహ మా◆శీర్వచింప
గనకభూషలఁ గానుక◆గా నొసంగి.

క. మానవపతి యీరీతిం
బాణిగ్రహణంబుఁ జేసి ◆ బ్రాహ్మణతతికిన్
నానామణిగణకాంచన
గోనిచయకరీంద్రతురగ◆కోటి నొసంగెన్.

గీ. ధరణినాయకుఁ డీరీతి • ద్రవ్య మిచ్చి
భక్ష్యభోజ్యాజ్యగుడదుగ్ధ • పాయసాన్న
మోదకాపూపసూపపూ • ర్ణోదనంబు
భోజనం బిడెఁ దృప్తిగా • భూసురులకు.

వ. ఇవ్విధంబున భూవరుండు భూసురుల ద్రవ్యాన్నదానసంతుష్టులం గావించి చంద్రమతీమునిచంద్రుల కనేదాసదాసీజనధనకనకవస్తువాహనాదివివిధోపాయనంబు లొసంగి కొంత దవ్వు వీడ్కొలిపి మునియానతి మరల నిజపురంబునకుం జనియె నంత నుద్దాలకుండు పుత్త్రికళత్రసహితుండై నానామృగసమాకీర్ణంబును మౌనిజననిషేవితంబు నగు నిజాశ్రమంబునకుం జని సుఖంబున నుండె నని వైశంపాయనుం డెఱింగించిన జనమేజయుం డవ్వలికథావిధానం బెట్టి దని యడుగుటయును.

చ. తరుణగుణప్రపూర్ణ ఘన • దానవినిర్జితకర్ణ కోటిభా
స్కరనిభ భూరిధామ జల • జాతముఖీమణినూత్నకామ భూ
సురవరశీల హారదర • సుందరపాండురకీర్తిజాల వి
స్ఫురదురువిద్వదంబుజన • భోమణి వేంకటరాయధీమణీ.

మాలిని.

శ్రీవనితామణి • సేవితమందిర • భావజసుందర • భాసురదే
హా వనజారని • భాసన భూరిగు • ణావళి దివ్యవి • భాకరతే

జావికచాంబుజ♦సన్నిభ నేత్రయు♦గా వరసత్కవి♦కల్పకవా
జ్రేవృకులాబ్ధిహ♦రీ విలసజ్జయ♦మా వరవేంకట♦మంత్రిమణీ.

గద్య. ఇది శ్రీరఘురామపదారవిందమరందరసపానమధుపాయ
మానమానస శారదానుగ్రహకటాక్షప్రసాదలబ్ధ సరసకవితా
ధురంధర మల్లికార్జునపౌత్త్రి వేంకటనాయక తనూభవ
మల్లికార్జున యశోధారేయ మిక్కిలి మల్లికార్జున
నామధేయప్రణీతంబైన నాచికేతూపాఖ్యానం
బను మహాకావ్యంబునందు ద్వితీయా
శ్వాసము సంపూర్ణము.

శ్రీరస్తు.

శుభమస్తు.

# నాచికేతూపాఖ్యానము.

## తృతీయాశ్వాసము.

శ్రీవనరుహపాణీసం
సేవితనిజనిలయ దాన◆జితఘనరాధే
యా వితరణపాలితపృ
థ్వీవిబుధోత్తమనికాయ ◆ వేంకటరాయా.

గీ. అవధరింపు మయ్య◆నంతరమున జన
మేజయాభిధాన ◆ రాజసార్వ
భౌముఁగూర్చి యిట్లు ◆ వలికె వైశంపాయ
నాఖ్యమౌనివర్యుఁ ◆ డనద్యశుండు.

గీ. అవనినాయక వేదమ◆యంబు లగ్ను
లంబుజాక్షుండు శంకరుం◆డంబుజోద
రుండు నిందాద్రి దేవసా◆రులు వసింతు
రనిశ మప్పావకముల ధ◆రాధినాథ.

గీ. కాన భూమీసురులు సర్వ♦కాలముల మ
హాగ్ని కార్యంబు లెంతయు♦నాచరింతు
రగ్ని సేవఁ బువారల ♦ కఖిలలోక
సౌఖ్య మబ్బక యుండునే ♦ జనవరేణ్య.

మ. అని యీరీతిఁ దలంచి నెమ్మనమునం♦దన్మౌని స్నానార్థియై
చని భాగీరథిలో మునింగి విధిచే ♦ సంధ్యాదిసత్కర్మము
ల్మన సింపొంద రచించి వచ్చి సుతుఁ బ్రే♦మం జూచి యి ట్లాడె నో
తనయా కానల కేఁగి తేరఁగువలె♦ధ్మంబుల్వడింబోవుమా.

క. అని యిటు జనకుం డెఱిఁగిం
చిన మునితనయుండు వనముఁ♦జేరి యచటఁ గ
న్గొని కుశసమిచ్చయంబున్
గనఁ జాలక చనియె జనకు♦కడకు సరేంద్రా.

క. చని నాచికేతుఁ డిట్లని
యెను దోసిలి పట్టి యోము♦నెంద్రా భవదా
జ్ఞను గాన కేఁగి వేఁడుకఁ
గన రాదు సమిత్కుశాది♦కం బొకటైనన్.

క. అని యెఱిఁగించినతనయుం
గని మునినాథుండు కోప♦కలితారుణలో
చనుఁడై యిట్లనుఁ దనుజా
వినుమా నామాట మదికి ♦ వేడ్క. దలిర్పన్.

గీ. అగ్ని సేవకంటె ♦ సన్యాసార్థ మిహపర
సాధకంబు లేదు ♦ జగమునందు
కాన నీవసన్య♦కార్యుఁడవై వహ్ని
సేవ భక్తి మీఱఁ ♦ జేయు మిలను.

గీ. అనిన విని నాచికేతుఁ డి♦ట్లనియెఁ దండ్రి
యగ్నిహోత్ర మవశ్యకా♦ర్యం బటంచుఁ
దెల్పెదవు కామ్యకర్మ గా♦దే తలంప
నట్టిపని కాఁ నుండుసం♦యముల కేల.

క. కావున యోగాభ్యాసము
గావించుటకంటె నన్య♦కార్యము గలదే
భావింప మునులు తత్ప్ర
భావము వల్కుదురు దుర్ల♦భం బని తండ్రీ.

గీ. కాన నిట్టివిశేషయో♦గంబు విడిచి
యగ్నికార్యంబు సేయుంగ ♦ నగునె దాని
వలన నేమిఫలంబులు ♦ గలుగనేర
నగ్నిహోత్రంబు మునికిఁ గా♦ర్యంబు గాదు.

చ. అన విని మౌనివర్యుఁడుని♦జాత్మజుఁ గన్గొనిపల్కెఁ బుత్త్రకా
మునులు మహానుభావులు ద♦పోధను లందఱు నగ్నిసేవ స
య్యనఁ జలుపంగ నీ వలిమ♦దాంధత నాకెదురాడితౌర కా
వున నిను శిక్షసేతు నని ♦ భూరితరాగ్రహపూరితాత్ముఁడై.

గీ. అంత నుద్దాలకుండు మ♦హాగ్రహంబు
వలన నతిదీప్తిఁ దనరుచు ♦ వహ్నిభంగిఁ
దేజరిల్లుచుఁ బుత్త్రుకుఁ ♦ దేఱిచూచి
తనయ శమనునిఁ జూడుమా ♦ యని శపించె.

గీ. తనయుఁడు దండధరుఁ జూడు ♦ మని శపించి
యమ్మునీశ్వరుఁ డుగ్రాగ్ర♦హమున నుండ
నాచికేతుండు తత్పాద♦నలినములను
గావవే యని పడియెను ♦ గౌరవేంద్ర.

కం. దీనుండై శాపాహత
మానసుఁడై పడిననిజకు♦మారుం గని య
మ్మౌనీంద్రుఁడు కరుణాపా
థోనిధి యై నాచికేతు♦తో ని ట్లనియెన్.

ఉ. ఓరికుమార యేఁ దెలియ ♦ కూరక నిన్ను శపించితిం దురా
చారుఁడ మందభాగ్యుఁడ న♦సహ్యమనస్కుఁడ నయ్యయో మహా
ఘోరయమాలయంబునకుఁ ♦ గొంకక యేగతి నేఁగువాఁడ వీ
వారయఁ గాలదూతనిర♦యంబుల నేగతిఁ జూతు వర్భకా.

కం. దారుణనరకనివాసము
భూరిమహాపాతకాతి♦భూయిష్ఠము వి
స్తారార్తిపూర్తికరము కు
మారా యెట్లేఁగెదవు య♦మాలయమునకున్.

క. అని యివ్విధమునఁ జింతిలు
మునిఁ గన్గొని తత్సుతుండు ♦ మూర్ఛితుఁడై యి
ట్లనియెను గతసంజ్ఞుండై
జనకా డెందమున నిట్టి♦సంశయ మేలా.

క. ఎన్నఁ డసత్యము నీయం
దెన్నఁబడుట లేదు గాన ♦ యిప్పుడు సత్యో
క్తి న్నడుపు మఖిలవిశ్వం
బున్నది సత్యోక్తియందు ♦ నూహింపంగన్.

క. సత్యమున నుండె ధారుణి
సత్యంబునఁ వెలసి రర్క♦చంద్రు లనిలుఁడున్
సత్యమున నుండె ననలుఁడు
సత్యంబునఁ దేజరిల్లె ♦ సంయమివర్యా.

క. ఘనతరశతశృంగంబులఁ
గనుపట్టునగంబు దనరుఁ ♦ గడుసత్యోక్తిన్
మునివర హయమేధశతం
బును సత్యముతోడ సాటి ♦ పోల్పఁగఁ దగునే.

క. సత్యమున నుండె సర్వము
సత్యము పాలింపవలయు ♦ సర్వజ్ఞులకున్
నిత్యము గావున శాప
వ్యత్యయయత్నంబు సేయ♦వలదు మునీంద్రా.

గీ. అని యెఱింగించి యుద్దాల♦కామితప్రి
భావమున నాచికేతుండు ♦ పటురయమున
నరిగె నిర్బాధుఁడై పయో♦జాప్తతనయ
భువనమున కభ్రిచారు ల♦బ్బురముఁ జెంద.

చ. చని యమరాజధానికిని ♦ సంయమినూనుఁడు వారిజాప్తనం
దనుదురితాత్మసంహరణ♦దక్షుని రక్షితదక్షిణాశు ధ
ర్మనిలయు మాహిషధ్వజు స్ఫు♦రదభివితేజుని ధర్మరాజుని
గ్గనుఁగొని హస్తయుగ్మ మలి♦కంబునఁ జేరిచిభక్తినిట్లనున్.

దండకము. శ్రీదక్షిణాధ్యక్ష భీమాక్ష పాపేభ హర్యక్ష భూరి
క్షమాపేక్షి తాక్షీణపక్షా సదాంధర్మరక్షా మహాధర్మశిక్షా
హరీ సద్గతాకార సర్వాత్మకా దర్శకా ప్రేతనాథా భవా
త్మోద్భవా బీజకర్తా యమా సర్వజిత్సర్వకర్తా మహాయక్ష
రక్షోజ నాభీల దైత్యాది విధ్వంసనా లోకకర్తా మహాభాగ
సర్వజ్ఞ సంభావకా క్షాంతసృష్టిస్థితిధ్వంసకృత్యయాధీన సర్వాత్మకా
యక్ష రక్షో మునిశ్రేష్ఠ చక్షుశ్శ్రవ సిద్ధ సాధ్యాది సంస్తూ
యమానా మహారాజ ధర్మిష్ఠ సత్యప్రధానా భవచ్ఛౌర్య
లెన్నంగ శేషాదులైనన్ సమర్థాత్మకుల్గారుగానీచుఁడన్
నిర్వికారుండ బాలుండ నే నెంతవాఁడన్ మిముం గంటి
పాపంబులం బాసి పుణ్యుండనైతిన్ దయాదృష్టి నన్
గావుమా దేవదేవా స్ఫురద్వహ్నితుల్యప్రభావా మహో
ద్యచ్చరిత్రా మునిస్తోత్రపాత్రా సరోజాప్తపుత్రా ప్రిలసద్భాను

తేజా సుధీకల్పభూజా మహాధర్మరాజా నమస్తే నమస్తే
నమః.

క. అని వినుతిసేయు మునిసం
దనుఁ గని యిట్లనియె సూర్య♦తనయుఁడు పేర్మిన్
ననుఁ గనుఁగొన నేమిటికై
చనుదెంచితి వెలుఁగఁ జెప్పు ♦ సంయమితనయా.

గీ. ఇపుడు భవదీప్సితము సేయ ♦ నెదఁ దలంచి
నాఁడ నెఱిఁగింపుము విని ♦ నాచికేతుఁ
డపుడు కరపుట మలికభా♦గాంతరమునఁ
జేర్చి యముఁగూర్చి నిజవార్తఁ ♦ జెప్పఁదొడఁగె.

చ. ననుఁ గని యొక్కకాలమున ♦ నాజనకుండు మహోగ్రంబున
స్ననుఁగవఁ గెంపునిప్పు లొలు♦కంగ దురాత్మ! కృతాంతుఁ [జూడుమా
యనిశపియింప నేను జన♦కాజ్ఞ శిరంబునఁ దాల్చి హర్షినై
దినకరపుత్ర! వేగ భవ♦దీయపురంబున కేఁగుదెంచితిన్.

గీ. కాన నాయెడ నీ కను♦గ్రహము గలిగె
నేని భవదీయనగరంబు ♦ నిరుపమాన
చిత్రకము చిత్రగుప్తని♦షేవితంబు
దయ దలిర్పఁగఁ జూపుమా ♦ ధర్మరాజ.

క. అని ప్రార్థించిన మునినం
దనుఁ గని యిట్లనియె భాను♦నందనుఁ డనఘా

ఘనతరమద్దేశముఁ గనుఁ
గొనుమా నీ విభుఁడు చిత్ర♦గుప్తుఁడు సూపర్.

చ. అనిమునిపుత్త్రుఁ గూర్చి జల♦జాప్తతనూజుఁడు దెల్పి దూతలం
గని యిటులానతిచ్చె ముని♦నాథతనూజు మహోగ్రతేజు మ
ద్ఘనసగరీవిచిత్రములు♦ తద్దయుఁ జూప రయంబుమీఱఁ దో
డ్తొని వడి జిత్రగుప్తకడ♦కుం జని వానికి నప్పగింపుఁడీ.

చ. అనవిని కాలుదూతలు ర♦యంబున సంయమిరాజసూనుఁ దో
డ్తొని వడి జిత్రగుప్తకడ♦కుం జని యిట్లని యో మహాత్మ యీ
మునితనుజన్ము మీకడకు♦ మోదమెలర్పఁగ వేగ *తోడ్తొ పాం
డని యముఁ డానతిచ్చె నన♦నాతనిఁ గన్గొని చిత్రగుప్తుఁడున్.

క. ఓసంయమివరనందన
వాసిగ నీ వేమి కోరి ♦ వచ్చితి చెపుమా
నాసన్నిధి కిత్తఱి నేఁ
జేసెద భవదీప్సితంబు ♦ నేమ మెలర్పన్.

చ. అనవిని నాచికేతుఁడు మ♦హాత్ముఁడు భానుజుఁ డాత్మలోకముం
గనుఁగొన నీదు సన్నిధికి ♦ గౌరవ మొప్పగ నంప వచ్చితిన్
దినకరపుత్త్రతుల్య మహ♦నీయబలుండవు సర్వభూతర
క్షణ మొనరింప దక్షుఁడవు ♦ శాశ్వతకీర్తివి చిత్రగుప్తకా.

క. అని యీవిధిఁ బ్రార్థించిన
మునిసుతునకుఁ జిత్రగుప్త♦భూతాధీశుం

---

* తోడుక - తోడ్క (పొందు) — అని కవి ప్రయోగించి యుండును.

డనుపమవిచిత్రమణిమయ
మనఁ దగి విలసిల్లుచున్న ◆ యమనగరంబున్.

గీ. కరతలాంతస్థితామల ◆ కంబురీతి
సర్వమును జూపి యర్కజు ◆ సన్నిధాన
మునకుఁ గొనిపోవ నపుడు య ◆ ముండు మునిత
నూజుఁ గని యిట్టు లనియె వి ◆ నోద మలర.

ఉ. ఓమునిపుత్ర పావనత ◆ మోరుచరిత్ర విచిత్రమై మహో
ద్దామమణిప్రభావళియు ◆ తంబయి శోభిలుమత్పురంబుశో
భామహనీయముంగనుల ◆ పండువుగాఁగనుగొంటె తెల్పుమా
నీమదిఁగల్గువాంఛితము ◆ నిక్కముగా నొనరింతు నే ననన్.

గీ. ధర్మరాజ భవత్ప్రసా ◆ దంబువలనఁ
గంటి భవదీయనగరము ◆ గరము విస్మ
యంబు గైకొంటి నానతి ◆ మ్మవనిలోక
మునకుఁ జనియెద నని ముని ◆ తనయుఁ డనఁగ.

క. నీ వజరామరణుఁడ వై
భూవలయమునందు వృద్ధిఁ ◆ బొందు మనుచు రా
జీవాప్తసుతుఁడు మౌనికి
దీవన లిడి పన్పఁగా స ◆ తిప్రమదమునన్.

ఉ. పిమ్మట నాచికేతుముని ◆ ప్రీతిదలిర్ప యమాజ్ఞ నైజశీ
ఘ్రమ్మునఁ దాల్చి వేగమె ధ ◆ రాస్థలికిం జనుదెంచి పుత్రశో

కమ్మునఁ గుందుతండ్రిఁ గని ♦ కౌఁగిటఁ జేర్చి తదీయపాదప
ద్మమ్ములనానియుండినను ♦ మారునిఁగన్గొని మౌనియిట్లనున్.

గీ. ఓకుమార నీవు ♦ భీకరయమలోక
మునకు నెవ్విధమునఁ ♦ జనితి వచట
నున్న నరకసంఘ ♦ మెన్నఁగా శక్యంబె
వాని నెటులు చూచి ♦ వచ్చితహహ.

వ. అనిన నాచికేతుం డిట్లనియె.

ఉ. ఏను భవత్ప్రసాదమున ♦ నేఁగితి నంతకరాజధానికిన్
మౌనికులేంద్ర కాంచితియ ♦ మాలయమంత తదీయదేశముం
గానఁగ నయ్యె నయ్యెడను ♦ గాంచితి ధీరునిఁ జిత్రగుప్తునిన్
భానుతనూజు మద్వినుత ♦ పాత్రునిఁగా రచియించి వచ్చితిన్.

చ. అని యెఱుఁగించుచున్న సమ ♦ యంబున నచ్చటనున్న సత్తపో
ధనులు మహానుభావు లగు ♦ తాపసులందఱు నంతకాలయం
బునకు రయంబుమీఱఁ జని ♦ భూమికి వచ్చిన నాచికేతునిం
గనుఁగొనువేడ్క నెమ్మదిని ♦ గ్రల్లఁగ వచ్చిరి విస్మయాత్ములై.

సీ. మౌనులు గొందఱు ♦ మాసపక్షోపవా
సులు గొంద ఱనిలభో ♦ జులును సలిల
పంకలగ్నులు నేక ♦ పాదస్థు లర్కాభి
ముఖులు నిరుచ్ఛ్వాస ♦ ముఖులు నూర్ధ్వ
ముఖు లధోముఖులును ♦ ముఖ్యవ్రతస్థులు
పంచాగ్నిమధ్యత ♦ పస్సమేతు

లూర్ధ్వహస్తులు పవ♦నోదకభోజను
లర్క-దర్శనులు ప♦ర్ణాశనులును
పంచకూర్చసమేతులు ♦ పరమమౌను
లగ్నిహోత్రపరాయణు ♦ లగుమునీంద్రు
లరుగుదెంచిరి యుద్దాల♦కాశ్రమమున
కమితవిస్మయులై దండ♦హస్తు లగుచు.

గీ. అరుగుదెంచి మౌని♦వరుని నుద్దాలకుఁ
జూచి యిట్టు లనిరి ♦ నాచికేతుఁ
డాత్మజన్ముఁ డయ్యె ♦ నహహా! నీ కీధాత్రి
నిన్నుఁ బోలుమౌని ♦ యెన్నఁ గలఁడె ?

గీ. అని ప్రశంసఁ జేసి ♦ మునిసుతునగ్గడ
లను వసించి రపుడు ♦ మునులనఘమ
నాచికేతుఁ డొప్పె ♦ నక్షత్రమధ్యవి
రాజమానుఁ డైన♦రాజుభంగి.

సీ. అయ్యెడ మునులు సం♦యమిసూనుఁ గని యిట్టు
లనిరి మా కొకసంశ♦యంబు వొడమె
భీకరం బగుయమ♦లోకంబునకు నెట్లు
చనితివి పిమ్మట ♦ శమనునగరి
వలన నేలాగున ♦ వచ్చితి విచటికి
యమరూప మెట్టిది ♦ శమనులోక

మెట్టిది ద్వారంబు ♦ లెట్టివి ధర్మసం
స్థాపనం బెట్టిది ♦ శమనుదండ
మెట్టిది యగణ్యనరకంబు ♦ లెట్టి విన్ని
వినఁగ మునులకు నెమ్మది ♦ వేడ్క యొదవెఁ
గాన నెఱిఁగింపు మనుచు స♦మ్మానులవుడు
వేఁడఁగా నాచికేతుండు ♦ వేడ్కఁ జెంది.

గీ. మౌనివరులార యేను య♦మాలయంబుఁ
గనితెఱఁ గెల్ల మీ కెఱుఁ♦గంగఁ దెల్పె
దను వినుం డని యెఱిఁగించి ♦ ధర్మరాజు
పదములకు మ్రొక్కి యిట్లని ♦ పలుకఁదొడఁగె.

ఉ. ఏ యమపట్టణంబునకు ♦ నేఁగితి మజ్జనకాజ్ఞచే మహా
కాయునిధర్మరాజుఁ బొడఁ♦గంటిఁ దదాజ్ఞను జిత్రగుప్తుఁ డో
యాయమలోకచిత్రముల♦నన్నియుఁ జూపఁగఁ జూచిభానువు
త్త్రాయతనంబుఁ గాంచితి య♦మాజ్ఞఁ దనర్చితి మృత్యుహీ
[నతన్.

క. పిమ్మట మజ్జనకుప్రసా
దమ్మున వచ్చితిని భువికి ♦ ధర్మపురాణ
త్వ మ్మెఱిఁగించెద వినుఁడీ
నెమ్మది ముద మొదవఁగా ము♦నిప్రభులారా.

సీ. అనఘాత్ములార స♦హస్రయోజనవిపు
లాయతవిస్తీర్ణ ♦ మనుపమంబు

మహనీయమణిమయ♦మందిరరాజంబు
భర్మనిర్మితసౌధ♦భాసురంబు
గంభీరతరపరి♦ఘాభాసమానంబు
సముదగ్రసాలాది♦సంకులంబు
జితవాయువేగవా♦జివిరాజమానంబు
భద్రేభదానాంబు♦పంకిలంబు
చామరచ్ఛత్రఘనకేతు♦సంవృతంబు
గురుతరవిచిత్రమణిమయ♦గోపురంబు
కలితనిజభాగ్యవిజితాల♦కాపురంబు
గాపురం బిందిరాదేవి ♦ కాపురంబు.

గీ. ఆపురోత్తమమున ♦ నమరుపూర్వద్వార
మింద్రనీలఖచిత ♦ మినసమప్ర
కాశకంబు రౌప్య♦కమనీయ మురుకవా
టార్గళంబు గుజన♦దుర్గమంబు.

క. ఆరాజతమయపూర్వ
ద్వారంబున నుండెదరు కృ♦తజ్ఞులు గురుసే
వారతు లగణ్యపుణ్యా
చారులు శ్రితపాలకులును ♦ సంయములారా.

ఉ. ధీరులు సంశ్రితవ్రతులు ♦ ధీరజనావను లగ్నిహోత్రసే
వారతు లాత్మశిష్యులకు ♦ వాంఛితవిద్య లొసంగువార లా

శారహితు ల్ధరాదివిజ♦సంఘముఁ బ్రోచెడువారు పూర్వది
గ్ద్వారమునఁ వసింతురని♦శాంతసుఖాస్పదులై విరాగులై.

గీ. ఆపురంబున నమరు♦కృష్ణాజినప్ర
భావదం బగుదక్షిణ♦ద్వార మచట
ఘోరయాతననాశక♦కోటి దనరు
నట వసింపుదు రఘవంతు ♦ లనఘులార.

సీ. ఎవ్వరు వివిధధ♦ర్మేచ్ఛచే వెలయుదు
రుపవాసనిరతులై ♦ యుందు రెవ్వ
రుదకదానంబు చే♦యుదురు వేసవి నెవ్వ
రెవరు సీతున వస్త్ర♦ మిడుదు రర్థి
నెవరు దూరసమాగ♦తేలాసురుల కెదు
రేఁగి తోడ్కొనివచ్చి ♦ స్వాగతంబు
దెలిసి భోజన మతి♦తృప్తిగా నొసఁగెద
రెవ్వ రహింసకు ♦ లెవరు లోభ
మోహరహితమనస్కులు ♦ ముఖ్యదాన
ధర్మనిరతులు శూరు లి♦ద్ధరణి నెవరు
వార లందఱు పశ్చిమ♦ద్వారసీమ
నమితసుఖభోగు లై యుందు ♦ రనఘులార.

గీ. ఆమహాయమపురమునం ♦ దమరుచున్న
యుత్తరద్వారమున నెవ్వ ♦ రుందు రట్టి

వారి నెఱిఁగింతు మునికుల◆వర్యులార
సావధానైకచిత్తుల◆రై వినుండు.

సీ. ఏపుణ్యజనులు మా◆తాపితృభక్తులు
భూసురాభ్యాగత◆పూజకులు మ
హేశకేశవవాక్స◆తీశభక్తులు బ్రహ్మ
చర్యవ్రతస్థులు◆సదయహృదయు
లనశసమ్మతులు మ◆హాధ్వరకర్తలు
సకలకర్మాచార◆నికరపరులు
ద్రవ్యాన్నసలిలభూ◆దానపరాయణు
లానందమానసు◆లనఘమతులు

యతులు పరధననిరపేక్షు◆లనుపమాన
సత్యవాదులు దాంతు లి◆జ్జగతి నెన్న
వార లందఱు నుత్తర◆ద్వారమున వ
సింతురు సుఖంబునను ముని◆శ్రేష్ఠులార.

వ. మఱియు రోమహర్షణంబును, సుజనదుర్గమంబును, నగు దక్షిణద్వారంబున ఘోరగంభీరశకటంబును, హాహారవంబును, రౌరవంబును, కుంభీపాకంబును, దష్టజంతుచయంబు, నంగారరాశిభవంబును, ద్రపుసీసమయనదియును, పూయశోణితకుంభంబును, మలపర్వతంబును, తైలయంత్రంబును, క్షారసేచనంబును, పాషాణయంత్రంబును, నసిపత్త్ర

వనంబును, శస్త్రచ్ఛేదనంబును, కాష్ఠనిర్మితయంత్రంబును, పాశబంధంబును, శూలపీడనంబు,నంగారశయ్యాభ్రమణంబును, దశనమర్దనంబును, దప్తపాషాణభుక్తియు, దప్తసూచీభక్షణము, నుత్తప్తతిలతైలపానంబు, నధఃశిరశ్శోషణంబును,బురీషభోజనంబును, రేతఃపానంబును, ముసలమర్దనంబును, పతనోత్పతనంబును, గదాదండనిపీడనంబును, క్షారాంబుపానంబును, క్షారోదకబిలప్రవేశంబును, మేహనభోజనంబును, స్నాయుచ్ఛేదనంబును, వస్తిచ్ఛేదనంబును, పిత్తపానంబు, నుష్ణసికతాస్నానంబును, దప్తాయశ్శయనంబును, సంతప్తాంబుసేవనంబును, నేత్రనఖసంధిసూచీప్రక్షేపంబును, తీక్ష్ణఖడ్గధారాశయనంబును,మూషావస్థయు, శ్వభక్షణంబును, మూత్రపానంబును, దప్తశూలంబును, దప్తశిలయును, పురీషప్రవాహంబును, శోణితకూపంబును, శాల్మల్యారోహణంబును, రక్తభోజనంబును, స్వమాంసభక్షణంబును, వహ్నిజ్వాలాప్రవేశంబును, శిలావృష్టియు, శృంఖలియును, వృశ్చికకుండంబును, సర్పకుండంబును, ముద్గరఘాతంబును, భల్లూకాక్రశితంబును, మొదలుగాఁ గలమహానరకంబు లనేకంబులు గల వందుతీక్ష్ణతుండంబులు, మహాగ్రీవంబులు, నతిదారుణకాయంబులు గలవాయసంబులును, వికృతాకారంబు లగుఖరోష్ట్రవానరంబులుఁగల వచ్చట బ్రహ్మఘ్నులును, కృతఘ్నులును, పితృమాతృహింస

కులును, బాలవృద్ధస్త్రీమిత్రఘాతుకులును, గోపశుహంత
కులును, జీవహింసకులును, స్త్రీరత్నహారులును, శూరనిం
దకులును, స్వామిద్రవ్యాపహారులును, అభక్ష్యభోజనులు
కూటసాక్షు లదృష్టానృతభాషు లశ్రుతశ్రుతవక్తలును,
స్త్రీబాలస్వహారులును, బరదారరతులు స్వదారపరివర్జకులు
ను, గోబ్రాహ్మణబాలవృద్ధపరిత్యాగులును హీనసత్త్వులు
దురాచారులు పాకభేదభోజకులు సత్యహీనులు నగు ననేక
పాతకులం గనుంగొంటి నని యెఱింగించి వెండియు ని
ట్లనియె.

సీ. భూసురహత్యను ♦ జేసిననరుఁ డుండు
ఘోరకుంభీపాక ♦ నారకమున
జనకుని హింసించు ♦ మనుజునిఁ గూల్తురు
కృమికుండములయందు ♦ యమునిభటులు
కన్యకానిందను ♦ గావించు మర్త్యులు
పురువులఁ దినుచు నె ♦ ప్పుడు వసింతు
రన్యదారాసక్తుఁ ♦ డగు పాపి యుండుఁ గుం
భీపాకనిరయదు ♦ ష్పీడఁ గొనుచు
బాలవృద్ధుల బాధించు ♦ పాతకులను
తైలపాకమునను ద్రోచె ♦ దరు కృతాంత
భటులు క్షేత్రము సీమను ♦ బలిమిఁ గలుపు
పాపు లొనరింపుదు రభక్ష్య ♦ భక్షణంబు.

సీ. గురుతల్పగామి నూరా♦నరుఁ డుంచుఁ గ్రిమికుండ
మునఁ బరద్రవ్యము ♦ గొనినవాని
ముఖము విష్ఠారాశి♦పూరితంబుగఁ జేతు
రంతకభటులు ని♦రంతరముగ
ఘనతరరౌరవం♦బునను రజస్వలా
గామి యుండును శున♦కములు గఱవ
నంగారపంజర♦మందు దురాచార
తృణచోరుఁ గాల్చెద ♦ రినజుభటులు
కరము రత్నవిక్రృతి ♦ గావించు పాపులు
కీటకాలయమునఁ ♦ గెరలుచుండు
రంతకాజ్ఞచారి ♦ సద్రిశృంగంబుల
వలనఁ ద్రోతు గిలను♦బడఁగ భటులు.

మత్తకోకిల.

పారదారను గూడి యుండిన♦పాపచిత్తుఁడు యాతనా
పార మొందక భీతికృత్కర♦పత్త్రిమునః(?)గోయంబడున్
సూరసూనుభటాళిభీకర♦శూలసంహతి నొంది హా
హారవంబున నన్నుఁ గావుఁ డ♦టంచు వేదనఁ జెందెడున్.

గీ. ప్రక్కపైని భగినితోడఁ ♦ బవ్వళించి
కానికార్య మొనర్చిన♦మానవాధ
ముండు ఘనరౌరవంబున ♦ నుండుఁ జెల్వ
రానియాతన నొందుచు ♦ మానుల్లార.

క. అంబరకనకాలంకృతు
లం బరమతిఁ దొంగిలినన ♦ రాధముఁ డురుదం
ష్ట్రింబులఁ దనరెడుశునకచ
యంబులచేఁ గఱవఁబడు మ ♦ హామునులారా.

ఉ. దానము సేయుకాలమునఁ ♦ దాఁ జని దానికి నంతరాయమే
మానవుఁ డాచరించునొ య ♦ మూఢుఁడు రౌరవనారకంబునం
దా నివసించి భీకరకృ ♦ తాంతభటావళి హన్యమానుఁడై
మౌనికులేంద్రులారనిజ ♦ మాంసము గ్రోలుచునుండు దీనతన్.

గీ. కన్య నేసరుండు ♦ గాంచి తా మరులుతో
వాఁడు ఘోరనరక ♦ వాసుఁడై కృ
తాంతదూతనిహతుఁ ♦ డగును వియోనిని
జెందినట్టివార ♦ లుందు రచట.

క. భూసురసంఘద్రవ్యం
బాసిలి కొనువాఁడు కీట ♦ కాలయనరకా
వాసుండై వెత నొందుచు
నోసంయమివర్యులార ♦ యుండు యమపురిన్.

ఉ. ఎప్పు డవాచ్యవాక్యముల ♦ నెన్నెడువారల వాదశీలురన్
దప్పక జిహ్వ గోసి వద ♦ నంబున నుంతు రమేధ్యరాశి పెం
పొప్పఁగ ధర్మరాజభటు ♦ లుర్విని దేవధనాపహర్త యె
ల్లప్పుడు ఘోరనారకము ♦ లం బడి వేదనఁ జెందుచుండెడున్.

క. దారాత్మజపశ్వాదులు
క్షీరాంబుధిసారభూమి • దివిజావళినిం
దారతులు కాకభక్షితు
లై రౌరవనరకవాసు • లగుదు రనిశమున్.

గీ. అమితగుణవతి రమ్యాంగి • యైనసతిని
ఎంచి యేపాపకారి నిం • దించు నట్టి
మానవుం డిక్షుయంత్రంబు • లోన ధర్మ
భటులచేఁ ద్రోయఁబడు మౌని • వర్యులార.

ఉ. ధీరమానస్కులార యమ • దేవభటావృత మైనదక్షిణ
ద్వారమునందు విస్మయయు • తం బగునద్భుత మేనుగాంచితిన్
స్తారమహోవ్యథాకులతఁ • దాల్చితిఁ జెప్పెదమీరలందఱున్
ధీరత నాలకింపుఁ డని • తెల్పి మునీంద్రతనూజుఁ డిట్లనున్.

సీ. తాపసులార త • ద్ద్వారంబున ననేక
పాపులు దుర్నయ • పరులు గలరు
పటుతరగళపాశ • బద్ధు లయోమయ
నిగళవేష్టితపద • యుగులు పృష్ఠ
బాహుశిరఃపాశ • బద్ధులు ఘనతర
గళదేశబద్ధశృం • ఖలులు నగుచుఁ
డమరు గావించుపా • పములఁ దలంచుచు
యమభటావళినిహ • తాంగులై పి

పోసచే వారి శీతల♦వారి నడుగ
నగ్నిసంతప్తసీసమ♦యంబునదిస
మీపమున కట్టిపాపుల♦నేపకుండఁ
దోడ్కొనుచుఁ బోదు రంతకు♦దూత లపుడు.

ఉ. ఆదురితాత్ము లంతకభ♦టాజ్ఞను శీతలవారికాంక్షచే
నాదర మొప్ప సీసమయ♦మైనమహానదిఁ జొచ్చి తప్తసీ
సోదకపానదగ్ధవపు♦లోదరులై పరి గానరానిబ
ల్వేదన నొందుచు న్మరలి♦వే వసియింతురు నారకంబులన్

గీ. కూటసాక్షియైన♦కుటిలచిత్తుండు దప్త
కుంభనారకమునఁ♦గూలి కీట
కములఁ దినుచు నంత♦కభటాళిహన్యమా
నాంగుఁ డగుచు నుండు♦ననుదినంబు.

సీ. జంతునిచయబాధ♦సల్పినక్రూరుండు
దైలయంత్రమునను♦దా వసించు
ఘృతము దొంగిలుపాత♦కి మహాంబరీషంబు
నను గాల్పఁబడుచుండు♦ననుదినంబు
భూసురామరనిందఁ♦జేసినదుష్కృతి
పూతిమాంసంబునఁ♦బొరలుచుండు
సేతుఖండంబు ర♦చించినపాపి జ
లూకాదినారకా♦నీకములన

నేకవర్షంబు లుండుఁ ద◆టాకరూప
నాశకుండును వాపీవి◆నాశకుండు
ఘనతమఃకూపమునఁ జిర◆కాల మమిత
యాతనలఁ జెందుఁ గుందుచు ◆ ననఘులార.

చ. సరసులఁ బాడు సేసినయ◆సహ్యమనస్కుఁడు ఘోరమజాలయు
జ్వరకమందు ద్రోయఁబడుఁ◆గాసభ కెగ్గొనరించువాఁడు భీ
కరశరపత్త్రికావళివి◆ఖండితుఁడై మునివర్యులార దు
ష్కరఖరభానుసూనుభట◆సంహతుఁడై వెతఁ జెందు
చుండెడిన్.

క. ఆరామభేదనం బి
ద్ధారుణిఁ గావించువాఁడు ◆ తపనాత్మభవ
క్రూరభటపాశబద్ధుం
డై రౌరవవాసుఁ డగు మ◆హామునులారా.

క. ఫలపాదపచయభంగము
సలిపినమనుజాధముండు ◆ సస్యవిఘాతం
బలవడఁ జేసినదుష్కృతి
గలకాలము ఘోరనార◆కమున వసించున్.

క. చేలముల నలంకృతులన్
బాలను దొంగిలినపరమ◆పాతకి విష్ఠా
శైలమున నుండుఁ బావక
కీలలఁ ద్రోచెదరు భటులు ◆ గృహదాహకునిన్.

ఉత్సాహవృత్తము.

ధనంబు చోరవృత్తిఁ గొన్న ♦ తజ్జనుండు గాలయా
తనాలి నొందు దేశికుండు ♦ దా భుజించు నన్న మే
జనుండు గ్రోలు వాఁడు కీట ♦ సంఘకుండవాసుఁడౌ
మునీంద్రులార నాడు వాక్య ♦ ముల్ మదిం దలంపుఁడీ.

గీ. అనఘమతులార యెవఁడు శ ♦ య్యను హరించు
సద్గురాచార్యుఁడు కృతఘ్నుఁ ♦ డధికశోక
ములకు దరిలేక యుండెను ♦ నలఘుపూయ
కుండమునఁ దప్తశోణిత ♦ కుండమునను.

గీ. కలహకర్త పరోద్వేగ ♦ కారి యెవ్వఁ
డద్దురాత్ముండు గీటకా ♦ హారుఁ డగుచు
నుండుఁ దద్ద్వారమందు న ♦ ఖండయాత
నాలి నెమ్మదిఁ గుందుచు ♦ ననఘులార.

గీ. దాఁచ నిచ్చినద్రవ్యంబుఁ ♦ దా హరించు
నెవ్వఁ డియ్యక కొను వార ♦ లెవ్వ రట్టి
కుమతిజనులను ఘనతర ♦ కూటశాల్మ
లులను బొందించి త్రోచెద ♦ రిలకు భటులు.

గీ. స్వర్ణరజతకాంస్య ♦ పాత్రిల దొంగిలు
పాపకారిఁ దైల ♦ పాకమునను
గూల్తు రనుదినంబు ♦ గురుతరవిశ్వాస
హారిజిహ్వ గోతు ♦ రార్కిభటులు.

సీ. క్షితిరసద్రివ్యరా♦శిని నాశ మొందించు
కుటిలచిత్తుండు తప్త♦కుంభనార
కములఁ గాల్పంబడి ♦ యమభటముద్గర
నిహతుండై వసియించు ♦ నిరయములను
జనని సహోదరిఁ ♦ దనయను గోడలిఁ
గూడినపాపాత్ము♦కుం డఖండ
రౌరవాదికమహా♦నారకవాసుండై
దరిలేనితీవ్రయా♦తనలఁ జెందు

ఏనరుండు సతుల ♦ నిర్వ్యాక వరియించి
వృజినబుద్ధి నొకతె ♦ విడుచు నాన
రాధముండు భీక♦రవ్యాఘ్రిముఖమున
దీనుండై వసించు ♦ మానులార.

ఉ. ఏనరుఁ డాత్మవాంఛ నొక♦యిందునిభాననచెంతకేఁగి యా
మానిని నన్వరింపుమను♦మాటలమూటలమోహపెట్టి య
జ్ఞాన మెలర్ప దాని విర♦సత్వమునన్ రతికేళిఁ దేల్చు న
మ్మానవుఁ డెల్లకాలము య♦మాజ్ఞను ముద్గరపీడనొందెడున్.

గీ. ఎవఁడు బలవంతుఁడై బల♦హీనుమంది
రము హరించునో యంగార♦రాశిభవన
నారకంబున బహుయాత♦నలను జెందు
నద్దురాత్ముండు చిరకాల ♦ మనఘులార.

క. మునులారా మృణ్మయపా
త్రను దొంగిలినట్టివాఁడు ♦ రౌరవనరకం
బున నుండు వేదనిందకుఁ
గొని నాలుకఁ గోఁతు రంత♦కునిభటు లెపుడున్.

క. జననీజనకులబాంధవ
జనముల నెవ్వాఁడు విడుచు ♦ సంయములారా
ఘనతరరౌరవనరకం
బున నాతఁ డనేకవర్ష♦ములు వసియించున్.

భుజంగప్రయాతము.

గురుస్వంబుఁ గోశంబుఁ ♦ గ్రూరాత్ముఁడై యే
నరుం డిచ్చఁ గొంపోవు ♦ నానామనోభీ
కరాకారయుజ్నార♦కావాసుఁడై యు
ద్ధరన్ మాల యౌ వాఁడు ♦ ధన్యాత్ములారా.

సీ. మాలఁడై పిదప జ♦న్మాంతరంబునఁ దాను
మూషకంబై పుట్టు ♦ భూతలమున
నాచారహీన హో♦హాకారకుని సక
లప్రతిగ్రహుని శూ♦లములఁ ద్రోచె
దరు భటు లోచ్చరభూ♦సురసూతకాన్నపు
ష్టాంగుని సర్వభ♦క్షకు దురాత్ముఁ
గాకగృధ్రవ్యాఘ్ర♦ఘనజంబుకాదులు
చెలఁగి సంతతము భ♦క్షించుచుండు

నేమహాత్మునియన్నంబు ♦ నెపుడుఁ దినుచు
వాని మది నొన్నకుండెడు♦వానిఁ బట్టి
యమునిదూతలు భీకర♦వ్యాఘ్రవదన
మందుఁ బడద్రోతురయ్య యో♦మౌనులార.

గీ. ధరణి మృగవధఁ జేసిన♦పరమపాత
కుండు పక్షివిహింసకుం ♦ డుండు శునక
కుండమునఁ దప్తశోణిత♦కుండమునను
దండధరభటనిహతుఁడై ♦ తపసులార.

క. ధారుణి మృగయాసక్తుం
గ్రూరుఁ బరతాపకారిఁ♦ గుంభీపాకాం
గారభవనాహ్వయమహా
నారకములఁ ద్రోచెదరు ఘ♦నాత్మకులారా.

చ. పరధనహారి యౌ పరమ♦పాతకి దుస్సహకాలసూత్రభీ
కరనరకంబునందుఁ గల♦కాలము యాతనఁ జెందుచుండు నే
నరుఁ డిలఁ బంక్తిభేదన మొ♦నర్చునో తన్ముఖమందు
దూత ల
బ్బురముగ నుష్ణశర్కరను♦బోతురుహాయని మొత్తువెట్టఁగన్.

సీ. సతియైన యువతిని ♦ పతియగు బ్రహ్మచా
రిని జింతిలఁగఁ జేయు♦జనుల నంధ
కూపంబునను భటు ♦ ల్గాల్చెద రన్య
తోక్తి పలికిన దుశ్చరి♦త్రులను బట్టి

క్షురధారచేఁ జిహ్వ ♦ గోయుదు రాత్మధ
నము గూడఁ బెట్టి య♦న్యస్వహరణ
మొనరు గావించెద ♦ రిలవార లసిపత్త్ర
విపినంబున వసించి ♦ వెతలఁ జెందె
దరు ధరాసుర హత్యాది♦పరమపంచ
పాతకంబు లొనర్చిన♦పాతకులకె
రంబులను వహ్నితప్తతై♦లంబు వోతు
రంతకాజ్ఞను యమభటు ♦ లనఘులార.

క. అని నారకవృత్తాంతము
మునిసుతుఁ డెఱిఁగించి పిదప ♦ మునిసంఘములం
గని యిట్లను మునులారా
వినుఁడీ యమదూతరూప♦విధ మెఱుఁగింతున్.

సీ. మునివరులార యేఁ ♦ గనినక్రమంబున
నంతకభటుల వ♦ర్ణింతు వినుఁడు
గజవాహు లురుశివ♦స్కంధసమారూఢు
లజకపిమార్జాల♦కాశ్వవివిధ
మృగమేషఖరసార♦మేయవిచిత్రము
షకనకులవ్యాఘ్ర♦నికరకూర్మ
కాకగృధ్రోలూక♦ఖగవాహనులు విక్ర
తాకారు లురుభుజు ♦ లీభకరోగ్ర

దంష్ట్రి లురుబాహుబలులు వి♦స్తారదీర్ఘ
కాయులు బిడాలవానర♦కాకముఖులు
నాగయజ్ఞోపవీతులు ♦ భోగికుండ
లశ్రితులు భీకరులు ధర్మ♦రాజభటులు.

ఉ. శోణితలిప్తకాయు లతి♦శూరులు ధీరులు తీవ్రబాణయు
క్తాణులు బిండివాలఘన♦తోమరముద్గరపాశవిస్ఫుర
త్పాణు లహీనవేష్టితని♦తంబులు నీలనగేంద్రతుల్యు లో
మౌనికులేంద్రములార విష♦మాంగులు కాలునిదూతలందఱున్.

సీ. మునులార తన్మధ్య♦మునఁ గానఁబడియెఁ దా
మ్రోపమభుజజంఘుఁ ♦ డూర్ధ్వకేశుఁ
డమితరౌద్రుం డరు♦ణాక్షుండు న్యగ్రోధ
సమపరిమాణుండు ♦ శమనవేష
ధరుఁడు ప్రవాళవ♦దనుఁడు భయావహుం
డతిదుర్నిరీక్ష్యకృ♦ష్ణాజినప్ర
భాభాసమానుఁ డా♦భరణభూషితుఁడు ము
సలదండపాశాది♦హస్తుఁ డధిక
మహిషవాహనుఁడు గాలనా♦మంబుఁ దాల్చి
యొక్కఁ డాతఁడు యమునిచెంత ♦ నుండు సకల
భటుల కాజ్ఞయొసంగును ♦ బరుల కితఁడె
దండధరుఁ డని తోఁప ను♦ద్దండుఁ డగుచు.

క. ఒకవేళ రణము దానవ
నికరంబులు శమనభటులు ♦ నిరుపమలీలం
బ్రకటగతిఁ జల్పఁగా సం
తతభటులు జయింపఁబడిరి ♦ దైత్యులవలనన్.

గీ. శమనభటులు దైత్య♦జనవినిర్జితు లయి
యమసమీపమునకు ♦ నరిగి యిట్టు
లనిరి దేవ! దాన♦వానీకనిర్జితుల మై
తిమి మహాత్మ మాకు ♦ దిక్కు నీవ.

గీ. అనినఁ గాలుఁ డిట్టు ♦ లనుఁ గాలుఁ జూచి త
త్కాలమందు దీవ్ర♦కాలపాశ
కాలదండములను ♦ గట్టి కొట్టి సురారు
లను జయించి వేగ♦రమ్ము కాల.

సీ. అని యెఱుంగించిన♦యమశాసనము శిరం
బునఁ దాల్చి కాలుండు ♦ ఘనరయమున
నచలోపమానమ♦హాకాయములు గల్గి
తనరినభద్రదం♦తావళములు
వితతజవాత్యంత♦జితమనోవాయువే
గంబులై కనుపట్టు♦ఘనహయంబు
లింద్రాదిసురుల న♦నేకుల నని గెల్వఁ
జాలినయమభట♦సంచయంబు

భీమకరవాలశరఖడ్గ♦తోమరప్రి
ముఖఖరాయుధసాధనం♦బులను గూర్చి
కొని మహోగ్రాకారులై దైత్య♦జనము లున్న
కడకుఁ దా నరుదెంచె న♦క్కాలమునను.

చ. చని చని కాంచెఁ గాలుఁ డురు♦సంగరరంగహతాధికప్రవీ
రనికరరక్తపూరవిపు♦లాస్థిసమావృతమాంసఖండభ
క్షణపరపక్షిపక్షయుగ♦సంకలితానిలవేగనిర్యదు
ద్ధనతరధూళికాస్థగిత♦కాంతిపతంగము నాజిరంగమున్.

క. కనుఁగొని భేరీముఖవా
ద్యనినాదంబులు దలిర్ప ♦ దరి కేఁగిన న
ద్దనుజావళి యమభటులం
గని కనుఁగవ నిప్పు లొల్కఁ♦గాఁ గైఁ బడియెన్.

శా. కల్పాంతోజ్జ్వలకీలికీలితశిఖా♦కల్పప్రభాలోచనా
నల్పద్యోతులు చంచలావళులుగా ♦ నాభీలహుంకారమ
త్యల్పాబ్దధ్వనిగాఁగఁ గాలుఁ డురుకా♦లాంభోదకాంతిచ్ఛటా
కల్పుండై దనుజాళిపన్మహాశరా♦ఘాతంబులన్ నించినన్.

ఉ. దానవవీరు లంతఁ గను♦దర్ప మెలర్పఁగఁ బ్రోల్లసన్మహో
బాణశితోగ్రశూలకర♦వాలముఖాయుధధారులై మహో
సేనలఁ గూడి వచ్చి ఘన♦సింహనినాదములొప్పఁ జేయుచున్
మానమెలర్పఁ గాలు నస♦మానమహాశరవృష్టి ముంపఁగన్.

సీ. పిమ్మట యమభటుల్ ♦ హుమ్మని పటుబాహు
ఘట్టనఁ జల్పి ర♦క్కసులఁ దాఁకి
గండోపలములచే ♦ గరితురగస్యంద
నములఁ జూర్ణంబుగా ♦ నలుఁగమోది
కొందఱ శరహతిఁ ♦ గూలిచి కొందఱఁ
గాలపాశంబులఁ ♦ గలయఁగట్టి
కొందఱమేనులు ♦ గుములుగాఁ బడఁగొట్టి
కొందఱడెందము ♦ ల్గుందఁజేసి
కొందఱు ఖరాయుధముల స♦మందరక్త
కలితదేహులఁ గావించి ♦ కాలగతికిఁ
గొందఱను బంచి యమభట♦కోటి యిటుల
సంగర మొనర్చె మనము లు♦ప్పొంగి చెలఁగ.

గీ. కాలభటకాలశరహతి♦గళదసృక్ప్ర
వాహకలితమహాదైత్య♦దేహబృంద
మపుడు గానఁగ నయ్యె సం♦ధ్యాంబుదాంత
రితనభోతల మనఁగ న♦ద్భుతము గాఁగ.

క. అక్షీణపరాక్రము లై
రాక్షసనాయకులు ధర్మ♦రాజభటులపై
నక్షయబాణపరంపర
లాక్షణమున నైవఁ గాలుఁ ♦ డాగ్రహ మొప్పన్.

చ. పడిఁ జని దైత్యనాయకుల • పైఁ బటుశౌర్యముగల్గు సేనలం
గడుఁ బురికొల్పఁ దద్భటులు • ఖడ్గపరశ్వధసాధనంబులం
దడయక దానవాళిపయిఁ • దద్దయుఁ జిమ్మఁగ దైత్యసేన వెం
బడిఁ జని ముంచె సత్త్వతి స • పారశరావళిఁ గాలుసేనలన్.

లయగ్రాహి.

పిమ్మట మహాగ్రసమ • రమ్మునను గాలుఁడు ర
య మ్మెసఁగ దైత్యనిక • రమ్ముల మహాసా
శమ్ములను గొట్టె ముస • లమ్ములను గొట్టె నిశి
తమ్ము లగు భీకరశ • రమ్ములను దచ్ఛి
న్నమ్ములను ద్రుంచి రభ • సమ్మునఁ గృతాంతనిక
టమ్మునకుఁ బోయి తెలు • ప మ్మహిషవాహుం
డమ్మనుజభక్షకచ • యమ్ముల నసిచ్ఛిదవ
నమ్మునకుఁ బంపు మని • సమ్మతి నొసర్చెన్.

క. కావున సంయములారా
స్థావరములు జంగమములు • జలజాప్తసుతా
జ్ఞావహవృత్తిం గైకొను
నీవచనము శమనువలన • నెన్నంబడియెన్.

వ. మఱియు మునీంద్రులారా శమనుం డెవ్వరివలన సేవింపం
బడుచుండు వారల నెఱింగించెద వినుం డాత్రేయుండును,
మిత్రుండును, శౌనకుండును, కృష్ణద్వైపాయనుండును,
జాతుకర్ణుండును, పిప్పలాదుండును, మరీచుండును, గపిలుం

డును, భృగుండును, పులస్త్యుండును, యాజ్ఞవల్క్యుండును, సనత్కుమారుండును, సనందనుండును, మార్కండేయుండును, సుమిత్రుండును, పరాశరుండును, జైమినియును, హుతాశనుండును, పాకశోషణుండును, పరాయణుండును, రోమజంఘుండును, మొదలుగాఁ గల జితద్వంద్వులు, జితక్రోధులు, జితేంద్రియులు, జితమోహులగు మహామును లనేకులు ధర్మాధర్మవిచారులై సమవర్తిం గూడి యుండెదరు, తన్మధ్యంబున హారకేయూరాద్యాభరణభూషితుండును, శతాదిత్యసంకాశుండును, పీతకుండలధరుండును, సగుణయుక్తుండు తారాగణపరివృతుండైన చంద్రునిభంగి విరాజిల్లుచుండు నచ్చట రేయింబగలు భయంబు లేక తేజోమయంబై యుండుఁ దత్ప్రదేశంబున ఘృతక్షీరమయంబులును, స్వాదుజలంబు లగునదంబులును, పర్వతోపమానంబు లగునన్నరాసులును, సకలద్రవ్యకుండంబులును, ధర్మపరులచే సేవింపఁబడు చుండు నని యెఱింగించి నాచికేతుండు వెండియు నిట్లనియె.

గీ. హారకేయూరకుండలా♦ద్యఖిలభూష
ణములఁ దాల్చి సుకృతులు ♦ యమునిసన్ని
ధానమున వసియింతురు ♦ మానులార
వారిఁ గనుఁగొంటి నయనోత్స♦వంబు గాఁగ.

సీ. ఏనరోత్తము లన్న♦దాన మొనర్తురు
వారలు బహుభోజ్య♦భక్ష్యనిచయ
మనుభవించుచు భూరి♦హారకేయూరాది
భూషణనికరవి♦భూషితాంగు
లై చందనానులి♦ప్తాత్మీయదేహులై
రామామణులు దివ్య♦చామరముల
వీవంగఁ గొందఱు♦వెలఁదులు సేవింపఁ
గనకవస్త్రంబులు♦గట్టి తప్త
కాంచనాసనశయ్యాది♦కమున నుండి
స్రక్సతీచందనాదిక♦సకలభోగ
ములు మనోరథములు మీఱ ♦ మోద మలర
నచటఁ గ్రీడింపుచుందురు ♦ రసఘులార.

క. చెఱువులు నూతులు నత్యా
దరమున నేపుణ్యజనులు ♦ ద్రవ్వించెద ర
ప్పురుషులు సుగంధనిర్మల
తరజలములు ద్రావుచుండె♦దరు యమనగరిన్.

గీ. జలము గ్రోలుచు సలలిత♦చంద్రముఖులఁ
గూడి క్రీడింపుచు యథేచ్ఛ♦తోడ నుండ
వారలకు యముఁ డభిమత♦వాంఛ లొసఁగు
మౌనివరులార వారల♦నేను గంటి.

చ. అలజడిఁ గొన్నవిప్రుల మ♦హాదరమొప్పఁగఁదోడి తెచ్చివా
రలబలుసేద దీర్చి కుశ♦లంబును బిమ్మట స్వాగతంబునుం
దెలిసి సపర్యఁ జేసి కడుఁ ♦ దృప్తిగ భోజన మిచ్చినట్టివా
రలు సుఖయింతు రచ్చట ని♦రంతర మజ్జముఖీసమేతులై.

సీ. తత్కాలభోజన♦దాత సమస్తభో
గాలయం బైనస్వ♦ర్గమున నుండు
వేళయందైన నే♦వేళయందైన న
న్నమొసంగువాఁ డుండు ♦ నాకమునను
ధరణీసురులకు రు♦చిరఫలంబుల నిచ్చు
వాఁ డుండు దేవని♦వాసమునను
తిలదాన మిచ్చిన♦ధీరజనుఁడు హేమ
యానంబుచే నేఁగు ♦ నమరపురికి
దేవవనితాకరాంభోజ♦దీప్యమాన
చామరానిలచలితకాం♦చనమయాంబ
రాంచలుం డయి రత్నసిం♦హాసనమున
నెపుడు నివసించు దివి భూమి ♦ నిచ్చువాఁడు.

గీ. ఉదకదానంబుఁ జేసిన♦సదయహృదయుఁ
డమృతపానం బొనర్చుచు ♦ నమరపురము
నందు వసియించు శయ్యాస♦నాళి నొసఁగు
నతఁడు దివినుండు రత్నసిం♦హాసనమున.

గీ. యతులకును బ్రహ్మచారుల ♦ కతులభక్తి
దనరఁ బరిపక్వఫలభక్ష్య ♦ తతి నొసంగు
వారు లభయప్రదాతలు ♦ వాసవాల
యమ్మున వసింతు రమితసౌ ♦ ఖ్యమున నెప్డు.

సీ. యజ్ఞంబు సేయించు ♦ ననఘు లాభరణాంబ
రము లిచ్చువా రుందు ♦ రమరపురిని
సేతుబంధన మొనర్చిన ♦ మహాత్ములు పురం
దరపురి వసియింతు ♦ రురు సమస్త
భోగంబు లనుభవిం ♦ పుచు ఘృతపాయస
దానంబుఁ జేసిన ♦ మానవుండు
ఫలభూరుహము విప్ర ♦ వరుల కిచ్చినవాఁడు
రమణీయసూర్యలో ♦ కమున నుండు
భూసురాళికి వైశాఖ ♦ మాసమునను
ఛత్రచామరదానంబు ♦ సలిపినట్టి
వాఁడు దేవసమానుఁడై ♦ వాసవాల
యమున నివసించు ముదమున ♦ ననఘులార.

గీ. మహిఁ దటాకసభాదివ్య ♦ మంటపముల
సొంబగు మీఱంగ నిర్మించు ♦ సుకృతి యిష్ట
కామధుక్ప్రదవాసుఁడౌ ♦ గజరథాశ్వ
దాత దివినుండు వాహనో ♦ పేతుఁ డగుచు.

ఉ. దీను బహుశ్రుతుం ధరణి♦దేవు ననాథుని భక్తిఁ బ్రోచు నే
మానవుఁ డానరుం డనుప♦మానవిరించసవిష్టపంబునం
దా నివసించు విప్రునకు♦దివ్యయుతాలయ మిచ్చునేజనుం
డానరుఁడప్సరస్సహితుఁ♦డై దివియందమృతంబుఁగ్రోలెడున్.

గీ. ఎవ్వ రెట్టిదాన ♦ మిల నాచరించెద
రట్టిఫలము వార ♦ లందుచుందు
రనుచుఁ జెల్పి వ్యోమ♦యానస్వరూపంబు
పలుకఁ దొడఁగె మౌని♦వరసుతుండు.

సీ. హంసపారావత♦హాయ కేకిపికశుకా
నీకముఖ్యవిహంగ♦మాకరములు
తప్తసువర్ణము♦క్తామణిసిందూర
భాసమణిప్రభా♦భాసురములు
కమనీయకాంచన♦ఘంటారవోపేత
ములు నవరత్నవి♦భూషితములు
నిత్యగీతోత్సవ♦నిరతగంధర్వాప్స
రోవనితామణీ♦సేవితములు
భానుకోటిసహస్రవి♦భావిభాస
మానములు బహువర్ణవి♦మానములు య
మాలయంబునఁ గలవు మ♦హాత్ములార
వాని గణియింప విధికైన ♦ వలను గాదు.

గీ. ఆపురంబున నున్న పు♦ణ్యాత్ము లంత
కాజ్ఞఁ దత్పుష్పకంబుల ♦ నధివసించి
సకలలోకవిచిత్రద♦ర్శనకుతూహ
లాత్ము లై చరియించెద ♦ రనఘులార.

క. ఆదండధరునిపురిఁ దట
పాదపసుమభాసమాన♦పరిమళయుతశీ
తోదకహిమవాలుక పు
ణ్యోదక యనులక్షణమున ♦ నొకనది యొప్పున్.

సీ. ఆనదీతటముల ♦ హాటకోపమములు
పారావతప్రభా♦భాసురములు
సురుచిరమాయూర♦శుకపికకాంతులు
కుంకుమోదకరుచి♦సంకులములు
ఆశ్మారసప్రభా♦రాజమానంబులు
హరినీలరుచినిక♦రాస్పదములు
రమణీయతరనవ♦రత్నసమాభంబు
లలఘుసౌధంబులు ♦ గలవు వాని
నడుమ రాజిలు విపులవ♦నంబు నాగ
గరుడగంధర్వయక్షకిం♦పురుషకిన్న
రాప్సరోజనసిద్ధవి♦ద్యాధరాది
సేవితముఁ గాంచితిని ముని♦శ్రేష్ఠులార.

గీ. ఆవనంబున ధర్మిష్ఠు ♦ లైనవార
లందఱు వసించి సంతతం ♦ బమృతసన్ని
భంబు పుణ్యోదకాసలి♦లంబు గ్రోలు
చును రమించెద రయ్య యో♦యనఘులార.

గీ. కాన నెట్టిమహాత్ముల ♦ కైన శమన
సదనమున కేఁగకుండుట ♦ శక్య మగునె
మున్ను యమపురము కేఁగి ♦ చన్నపిదప
నెట్టిలోకంబులకు నైన ♦ నేఁగవచ్చు.

క. అన విని మౌనులు మునిసుతుఁ
గని యిట్లని పల్కి రంత♦కాలయమున కీ
జనలోకంబున కంతర
మును దుష్కృతి సుకృతిమార్గ♦ములుఁ దెల్పు మనన్.

సీ. మునిసుతుఁ డిట్లని♦యెను మునివరులార
షష్టియోజనసహ♦స్రంబు గలదు
యమలోకమనుజలో♦కములకు నంతరం
బేమార్గములను దు♦ష్కృతులు సుకృతు
లంతకుపురమున ♦ కరిగెద రని యేను
గాంచితి మీకెఱుఁ♦గంగఁ జెప్పె
దను వినుం డిప్పుడ ♦ ధరణీసురఘ్నులు
గోవధకారులౌ♦కుటిలమతులు

కంటకాకీర్ణదుర్గమా♦ర్గములు శమన
దూతఘనపాశబద్ధులై ♦ పాతకములఁ
దలఁచుచును దుస్సహాకారయా♦తనల మ్రగ్గి
లిడుచు యమలోకమునకుఁ బో♦యెదరు వేగ.

గీ. తల్లిదండ్రుల భార్యల బాం♦ధవుల ధవుల
గురులఁ గని మాదరింపని♦కుటిలచిత్తు
లంతకాలయమునకు దు♦రంతఘోర
మార్గమున నేఁగుదురు మహా♦త్ములార.

క. తనయేలిక కాప్తజనం
బున కపకారంబు సలుపు♦పురుషాధముఁ డేఁ
గును దుస్తరవాలుకాయుత
ఘనతరమార్గమున నంత♦కాలయమునకున్.

సీ. కన్యామణుల నింద♦గావించువారలు
భూసురధనమున ♦ కాససేయు
పాపచిత్తులు మద్య♦పాయులు దేవస్వ
వృత్తిహారులు బాల♦వృద్ధదీన
ధనము దొంగిలినట్టి ♦ మనుజాధములు క్షేత్ర
దారాపహర్తల♦ధర్మమతులు
నిత్యదయాశౌచ♦సత్యహీనులు దురా
చారులు సర్వభ♦క్షకులు శమన

భటమహాకాలపాశని♦బద్ధు లగుచు
రక్షకులు లేక పూర్వక♦ర్మముల మదిఁ ద
లంపుచును బోయెదరు ధర్మ♦రాజపురికి
దుర్గమం బగుఘనతమో♦మార్గమునను.

గీ. పిదప సుకృతుల సరణుల ♦ వేఱు వేఱఁ
దెల్పెద వినుండు మీర ల♦తిప్రియత్న
మున మహామునులార శ♦మనవినిర్మి
తంబు లై యొప్పఁ బంచవి♦ధంబు లగుచు.

గీ. ప్రథమ మగుమార్గ మతివిని♦ర్మలజలంబు
రెండవది తోయతుల్యమై ♦ యుండు సలిల
మగ్నమై ఫలవృక్షావ♦లగ్న మగుచుఁ
దనరు మూఁడవమార్గంబు ♦ దపసులార.

గీ. మౌనులార యన్న♦పానాఖ్యమునఁ జతు
ర్థాయనంబు దనరు♦నాయతనని
భం బనంగ నొప్పఁ ♦ బంచమమార్గంబు
సుకృతిజనులసరణి♦నికర మిదియ.

క. ఈసరణులచే ధర్మని
వాసమునకుఁ బోయి పుణ్య♦వంతులు విపులో
ల్లాసమున భోగపరులై
యోసంయమివర్యులార♦యుండెద రచటన్.

వ. అని యివ్విధంబున సుకృతిదుష్కృతిమార్గంబు లెఱిం-

న మునీంద్రులు భయచిత్తులై నాచికేతున కిట్లనిరి.

ఉ. ఓమునిరాజపుత్త్ర భవ♦దుక్తులఁ భీతి వహించె నెమ్మనం
బే మొనరించుకార్యమది ♦ యెయ్యది తెల్పుము లోకభీతికృ
ద్భీమపరేతనాయకుని♦తీవ్రముఖం బది యెట్లుసూతుమో
ప్రేమ నెఱుంగఁ దెల్పుమని♦వేఁడినమౌనితనూజుఁడిట్లనున్.

గీ. మౌనివరులార వరసభా♦మంటపమున
ధర్మవిదు లగుమునులమ♦ధ్యమున ధర్మ
రాజు తారావృతుండైన ♦ రాజుభంగి
కొలువుదీరిచి యున్న న♦క్కొలువునకును.

క. శారదనీరదపారద
హారదరతుషారహీర♦హరశరవరపా
టీరనిభాంగుఁడు గానవి
శారదుఁ డగునారదుండు ♦ సయ్యన వచ్చెన్.

ఉ. వచ్చినమౌనిఁ గాంచిసమ♦వర్తి మహార్ఘ్యముపాద్యమాసనం
బిచ్చి కరంబుమ్రొక్కులిడి♦యిట్లనుస్వాగతమే మహాత్మ యా
పచ్చయ మెల్లఁబోయెను భ♦వత్కృపచేఁ గృతినైతిఁ గాంచితిన్
ద్వచ్చరణారవిందములు ♦ నారద గానకళావిశారదా.

గీ. సంయమీ నాదుజన్మంబు ♦ సఫల మయ్యె
ఫలిత మయ్యెను మత్క్రియా♦పరికరంబు
నేఁడు భవదీయపదనలి♦నీరజంబు

వలనఁ బావనమయ్యె ♦ మన్నిలయ మహాహా.

గీ. మౌనివర భవదీప్సితం ♦ బౌనతిమ్ము
వేగమె యొసఁగ్చెదను భవ ♦ దాగమనము
మమ్ముఁ బోషించుటకుఁ గాదె ♦ మతియుతుండు
నేయుఁగద భక్తిచేఁ ద్వదీ ♦ ప్సిత మసంగ.

క. యమవాక్యము విని సురసం
యమి యిట్లను నీ వతిప్ర ♦ యత్నమ్మున స
ర్వమునిప్రదర్శనీయుఁడ
వు మహాత్ముఁడ వర్కపుత్త్రా ♦ పూతచరిత్రా.

ఉ. స్థావరజంగమాత్మకము ♦ సర్వజగంబున కాజ్ఞ సేయఁగా
నీవు మహాసమర్థుఁడ వ ♦ నింద్యచరిత్రుఁడ విప్రవేదవా
క్యావళిబోధితుండవు మ ♦ హార్కసముద్యుతివవ్యయుండవున్
గావున ధర్మ నిన్బొగడఁ ♦ గా సహస్రముఖున కైన శక్యమే.

సీ. అని యివ్విధంబున ♦ నమరసంయమి సూర్య
సుతుఁడు సంభాషించు ♦ చును వసింప
గాంచనమణిమయ ♦ ఘంటానినాదనా
దితదిక్తటంబును ♦ వితతదేవ
దుందుభిఘోషం బ ♦ మందచామరకేతు
మండిత మొక్కవి ♦ మాన మెక్కి
ఐరావతారూఢుఁ ♦ డై దేవనాథుండు
విద్యాధరులు పుష్ప ♦ వృష్టిఁ గురియ

భూరిమణిమయభూషణ ♦ భూషితాంగి
యై గగనవీథిచే వాయు ♦ వేగ మలర
వచ్చుసాధ్వీమతల్లి నై ♦ నవ్వుతుండు
చూచి గద్దియవలనఁ దా ♦ లేచి చనియె.

క. చని యాసాధ్వీమణి గ
న్గొని వందన మాచరించి ♦ కోమలియాజ్ఞం
గొని తరల వచ్చి సింహా
సనమునఁ గూర్చున్నవంక ♦ జాప్తసుతునితోఁ.

ఉ. నారదుఁ డిట్లు పల్కెను మ ♦ నంబున విస్మయముప్పతిల్లఁగా
నీరజబంధుపుత్త్రుఁడ వ ♦ నింద్యచరిత్రుఁడ వీవు దక్షిణా
శారమణుండ విజ్జగము ♦ సర్వము త్వద్వశవర్తియయ్యెఁగా
ధీరజనాగ్రగణ్య యమ ♦ దేవ పురందరతుల్యవిక్రమా.

గీ. ఇట్టి త్రైలోక్యనాథుండ ♦ వీవు పుష్ప
కంబు గన్గొని సింహాస ♦ నంబు డిగ్గి
యేఁగుటకుఁ గారణం బేమి ♦ యెవతె వ్యోమ
యానమందున్న భామిని ♦ భానుతనయ!

వ. అని యావివ్విధంబునం దెలియ నడిగిన నారదునకు ధర్మరా
జిట్లనియె.

క. ఓనారదపూజ్యోపా
ఖ్యానం బిది వినుము భక్తి ♦ గడలుకొనంగా
నేను వివరింతు గుహ్యము

జ్ఞానప్రద మఘహారంబు ♦ జనశుభకరముగ.

గీ. మున్ను త్రేతాయుగంబున ♦ మునికులేంద్ర
జనకుఁ డనుభూవరుఁడు గలఁ ♦ డనఘమూర్తి
యజ్ఞదానాదితత్పరుం ♦ డనుపమాన
ధర్మగుణనిధి నిత్యస ♦ త్యవ్రతుండు.

గీ. ఆనరాధిపుఁ డొక్కింత ♦ యైనఁ గ్రోధ
మాత్మ నుంచక యేలురా ♦ జ్యంబునందుఁ
బుడమి ఫలియించె బహుసస్య ♦ పూర్ణ యగుచు
దంపతుల్ ఫలయుక్తులై ♦ పెంపు గనిరి.

ఉ. ఆతనిరాజ్యమందునఁ బ ♦ యఃపరిపూర్ణము లయ్యె గోవులా
త్యాతురభావ మించుకయు ♦ నైన జనావళి గానరాదు వి
ఖ్యాతవినోదులై సురప ♦ రార్చనతత్పరులై మహావ్రత
వ్రాతసమేతులై నరులు ♦ వర్ధిలుచుందురు దేవసంయమీ.

గీ. ఆజనకభూవరునికాంత ♦ యధికశాంత
దేవభూసురగురువరా ♦ తిథిసమర్చ
నాభిరత ప్రియవాదిని ♦ యధికధర్మ
వతియుఁ బతిభక్తిమతియు నై ♦ యతిశయిల్లు.

గీ. ఆర్తుఁడైన ధవుండు దా ♦ నార్త యగుచు
దుష్టుఁడై యున్న మిగుల సం ♦ తుష్ట యగుచు
నుండుఁ బతి భుజియింపఁ దా ♦ నోగి భుజించు
భర్త పవళింపఁ బిమ్మటఁ ♦ బవ్వళించు.

క. ఏవంవిధసాధ్వీగుణ
పావనమతి జనకరాజ♦పతిసతి మృతయై
యీవిధమున సురయానము
చే విబుధనుతాంఘ్రి యగుచుఁ ♦ జెలఁగుచుఁ దిరుగున్.

క. ఈవనితఁ జూచి శంకిలు
దేవవిభుఁడు శాపభీతి ♦ దీప్యత్సుమనః
శ్రీవర్షము గురియింతు ర
హా విద్యాధరులు దేవ♦యానముమీఁదన్.

క. కావున నారద యేను భ
యావహామతి దీని కెదురు♦సరిగితి నిక్కం
బీవనిత యతిపతివ్రత
పావనగుణ యనుచు యముఁడు ♦ వలుకుచునుండన్.

సీ. ఆకాలమున భటు♦లర్కజుకడ కరు
దెంచి యిట్లని విన్న♦వించి రధిప
పాపు లనేకులు♦వచ్చి రెఱింగింపు
తద్దండనంబున ♦ ధర్మరాజు
దూతలార తదీయ♦దోషానుగుణనర
కానీకమునఁ జేర్పుఁ ♦ డనఁగ వార
లట్ల కావింపఁగ ♦ నచ్చటఁ గనుగొంటి
నస్థిభక్షకుల జ♦న్మాశనులను

శునకఖరమాంసభక్షకు♦లను మహోగ్ర
రక్తపానులఁ బూయక♦ర్దమతలస్థు
లను మహాతప్తసీసాంబు♦లను బిపాసఁ
గ్రోలువారల బహుపాప♦కుటిలమతుల.

గీ. సతుల వధియించి నట్టిదు♦ష్కృతిఁ బులిందుఁ
డగుచు ధాత్రిని జనియించు♦నద్దురాత్ము
నకుఁ గిరాతులచే ముని♦నాథులార
చావు గలుగును వలవదు ♦ సంశయంబు.

సీ. గురుతల్పగామి యా♦కుటిలచిత్తుఁడు జీవ
యోనిశతంబుల ♦ నుద్భవించి
పిమ్మట వ్యాధుఁడై ♦ యిమ్మహిఁ జనియించు
గోవధఁ జేసిన♦క్రూరజనుఁడు
కాకయోనిని బుట్టి ♦ భీకరకర్ణశూ
లంబులచే మర♦ణంబు నొందు
జనకుఁ గూల్చినదురా♦చారుఁడు మాతంగుఁ
డగు నద్దురాత్ముని ♦ కగును మృత్యు
వవసిదూరత్వమున మాతృ♦హత్యఁ జేసి
నట్టిపాతకి స్థావరం♦బై జనించు
చర్మకుండయి మిత్రవి♦శ్వాసహారి
శూలరోగంబుచే నీల్గు ♦ సుజనులార.

గీ. భ్రాతృహత్యఁ జేయు ♦ పాతకి బహుజీవ
యోనులందుఁ బుట్టి ♦ యుగ్రపాత
శూలహతినిఁ జెందు ♦ సోదరి నణఁచిన
వాఁడు మేచ్ఛుఁడగుచు ♦ వసుధఁ బుట్టు.

గీ. వాఁడు మృతిఁ జెందు వ్యాఘ్రంబు ♦ వలనఁ గన్న
యలను శిశువుల నడఁచిన ♦ యట్టిపాపు
లిలను బుల్కసులై జని ♦ యింతు రట్టి
వారలకుఁ దలగొట్టుచే ♦ వచ్చుఁ జావు.

సీ. మార్జాలమును జంపు ♦ దుర్జనాధమునకు
శార్దూలజన్మంబు ♦ సంభవించు
పశుహత్యఁ జేసిన ♦ పాపులు పుల్కసు
లై జనియించెద ♦ రవనిధేను
వును వివత్సను జేయు ♦ జనుఁడు మేషం బయి
పుట్టును గోడలఁ ♦ గొట్టువాఁడు
సారంగమై భువి ♦ జనియించు సుతహత్య
సలిపినజనుఁడు గీ ♦ శత్వమొందు

వవనిసురజనఘాతుకుఁ ♦ డగు నపుంస
కుండు మణులను దొంగిలు ♦ కుటిలచిత్తుఁ
డిలను ఖద్యోతమై జని ♦ యించుఁ గనక
హారి గర్దభమై పుట్టు ♦ ననఘులార.

క. ధర నెవ్వారలు వివిధాం
బరహారణ మొనర్తు రట్టి♦పాతకమతు లం
బరహీను లగుచుఁ బుట్టెద
రరుదుగ జడదారులై మ♦హామునులారా.

క. స్వకులాచారవిహీనుఁడ
నకులంబై పుట్టుఁ బరధ♦నము దొంగిలువాఁ
డకరుణాహృదయుఁడు భువిఁ గా
కికమై జనియించు నిదిప్ర♦సిద్ధము సుండీ.

గీ. జీవనిచయహింసఁ♦ జేసినదుష్కృతి
పాపయోనులందు♦ నేపు మీఱఁ
బుట్టి పిదపఁ దా వి♦ముఖుఁ డయి కచ్ఛపం
బై జనించు సంశ♦యంబు వలదు.

చ. పరభయకారి యై తసరు♦పాపి యులూకము లై ధరిత్రిభూ
సురసురనిందఁ జేయుపురు♦షుండును మాదిగనైజనించు బా
లురమెయిసొమ్ము దొంగిలిన♦క్రూరుఁడు భూస్థలిఁ బుట్టు
మేషమై
హరివధ మాచరించు మను♦జాధముఁ డొందును సుంసు
భత్వమున్.

క. అజవృషవధ గావించిన
వృజినాత్ముఁడు నాగ మగు భు♦విని బదమున వ

గ్రిజువహ్నిఁ ద్రొక్కు నెవఁ డ
క్కుజనుఁడు దుశ్చర్మకుం డ♦గును భూస్థలిపై.

సీ. పరజనులను మోహ♦పఱచిన మనుజుండు
తరుఖండన మొనర్చు♦దురితచిత్తుఁ
డవని మహావ్యాఘ్రమై♦ జనియించును
జండాలుఁ డగునండ♦జముల హింస
సేయుపాపాత్ముండు ♦ సీమను గల్పిన
వాఁడు మిథ్యాసాక్ష్య♦వాది భువిని
ఏరండమై పుట్టు ♦ ధారుణీదివిజుల
నలుగంగఁ జేసిన♦ఖలుఁడు గంట
కాలయం బగువృక్షమై ♦ యవతరించు
సమరనిందను గావించు♦నట్టివాఁడు
దత్తధనము హరింపంగఁ♦దలఁచువాఁడు
*మహిని గర్దభమై పుట్టు ♦ మానులార.

గీ. కాంస్యలోహతామ్ర♦కనకము ల్దొంగిలు
మానుషాధముండు ♦ మహిని గ్రోకి
లత్వ మొందు దివ్య♦రత్నముక్తకహారి
చక్రవాక మగుచు ♦ జగతిఁబుట్టు.

ఉ. తల్లిని తండ్రినిం గురుని ♦ దైవముగా మదిఁ దల్పకేసరుం
డొల్లనిబుద్ధిచేతఁ బరు♦షోక్తులఁ బల్కుచుఁ గొట్టునానరుం

*భువిని — అని పూర్వముద్రణము.

డెల్లపు డుద్భవించు నతి♦హీనముగాఁ బశుయోనులందునా
పల్లవణాబ్ధి మున్గుచును ♦ బాపులు బుట్టుదు రీగతిం ధరన్.

చ. అని బహుపాపజన్మముల♦నన్నిటి నీగతిఁ దెల్పి వారి కి
ట్లనియెను నాచికేతుఁ డన♦ఘాత్మకులార సహస్రభానునం
దను వల నారదుం డనుగు♦ధన్యచరిత్రము వింటి నేను గా
వున నెఱింగించెదన్వినుఁడ♦భూత మహోద్భుతమావహిల్లఁగన్

క. నారదుఁ డిట్లను భానుకు
మారా నీదేహ మెన్న ♦ మహితాదిత్యో
దారరుచిఁ దేజరిల్లఁగ
నేరీతి మొగంబు పర్ణ♦హీనతఁ జెందెన్.

గీ. ఏమి కారణంబో యెఱిఁగింపు ♦ మన విని
కాలుఁ డిట్టు లనియెఁ ♦ గను రవాస్య
మప్రకాశ్య మేరి♦కైన నీ వడిగిన
ప్రశ్న విను తదుత్త♦రంబు మాని.

సీ. ఏనరు లజకేశ♦వేశభక్తులు మహా
ధ్వరకర్మకర్త్రులై ♦ ప్రబలువార
లతులపాతివ్రత్య♦యుత లేతలోదరు
లిల శతాయుష్మంతు ♦ లేమనుజులు
ఆత్మతనుత్యాగ♦మర్థించి గంగాప్ర
వేశంబు గావించు♦విమలబుద్ధు

తేమహాత్మ్యులు వారి ♦ నెంతయుఁ గన్గొన
కునికెమదానన ♦ మొప్పఁ గృష్ణ
* వర్ణమై యని చెప్ప దే ♦ వర్షి యట్టి
ధర్మమునఁ జెందుదురు నర ♦ కముల సమర
భావ మేక్రియఁ గాంచెద ♦ రీవివేక
మివ్విధిని జెల్పు నాకు ది ♦ నేశపుత్త్రి.

వ. అని యివ్విధంబునం బ్రార్థించిన నారదునకు ధర్మరాజిట్లనియె.

చ. వ్రతములొనర్చువారలుప ♦ వాసములంగృశియించువారునం
తతనియమంబులం జలుపు ♦ ధన్యులుగాంతురుదేవభావమం
చితమతిచే నరుంధతి వ ♦ సిష్ఠు వటంబును లోఁ దలంచును
న్నతు లోకవేళ నాదుపద ♦ నంబు గనుంగొనరయ్యనారదా.

క. ఏపారుభక్తిచే సూ
ర్యోపాసనఁ జేయుమాన ♦ వోత్తములు సతీ
శ్రీపతిభక్తులు సేరరు
నాపురి కేకాలమందు ♦ నారదమౌనీ.

గీ. మాసపక్షోపవాసులౌ ♦ సన్మునివరులు
పరమచాంద్రాయణవ్రత ♦ పరులు సత్య
వాక్యనిరతులుం గారు మ ♦ ద్వశులు నాదు
దేశ మెన్నఁడు చూడరు ♦ దివ్యమౌని.

---

* వర్ణమైయొప్పను — అని పూర్వముద్రితము.

గీ. ఏమహానుభావు ♦ లీశుపూజఁ దివారాత్ర
మైనఁ బంచరాత్రి ♦ మైన నుపవ
సించి సల్పుచుందు ♦ రంచితంబుగ వారు
మద్వశగులు గారు ♦ మానినాథ.

సీ. గౌరీసపర్యను ♦ గావించువారలు
గలనైన సరకవ ♦ ర్గమును గనరు
వార్తాకఖర్జూర ♦ ఫలము లౌదుంబర
మభిరతిఁ గ్రోలని ♦ యట్టివార
లధ్వరకర్తలు ♦ నస్మదీయాసన
మెన్నఁడుఁ గన్గొన ♦ రిది నిజంబు
మానవు లేమిధ ♦ ర్మమున దేవత్వంబు
గొనియెద రాధర్మ ♦ మును వచింతు
వినుము నారద యవిముక్త ♦ మును బ్రభాస
మును గనుంగొను మానవు ♦ లనఘమైన
దేవభావంబు గాంతురు ♦ దివమునను వ
సించెదరు జాహ్నవీతురు ♦ క్షేత్రిగతులు.

గీ. పుష్కరపరివాస ♦ ముల నమరేశ్వర
క్షేత్రదర్శనంబుఁ ♦ జేయుజనులు
దేవభావ మమర ♦ దివిని గ్రీడింతురు
సందియంబు వలదు ♦ డెందమునను.

గీ. ఎవరు సంతతము మ ♦ హేశమహాకాళ
దర్శనమున మిగుల ♦ ధన్యు లగుదు
రమరభావ మమర ♦ సధివసింతురు వారు
శంకుకర్ణకాల ♦ సలిలములను.

గీ. చంద్రవర్ణంబు గాంచిన ♦ జనులు దేవ
భావమున నుండుదురు రుద్ర ♦ పాదకనఖ
లేశ్వరులఁ జండముండుల ♦ నెలమిఁ గాంచు
మనుజు లండెద రమరత ♦ *మానివర్య.

సీ. ఏమానవులు హాట ♦ కేశునిఁ గరకంతు
గజదంతమును ‡గరిఁ ♦ గాంత్రు వార
లమరత్వ మందుదు ♦ రరుదుగ వైకుంఠ
శిఖరేశు నెవ్వఁడు గాం ♦ చినసుమతియు
దేవభావమును జెం ♦ దిరమేశపదమున
వసియించు జాహ్నవీ ♦ ద్వారమునను
సేతుసాగరమునఁ ♦ జెలఁగి స్నాన మొనర్చు
వారు పొందుదురు దే ♦ వత్వ మెవరు
మహిని మంత్రివాద ♦ మయు లౌషధులసిద్ధు
లమరభావ మమర ♦ నామహాను
భావు లుందు రరయ ♦ వారల కిలఁ బున
స్సంభవంబు లేదు ♦ సంయమీంద్ర.

---

*మానులార!— } అని పూర్వముద్రణము.
‡కరి గాంచు— }

కం. ధర గంగాద్వారంబున
ఘరచంద్రేశ్వరమునందుఁ బంచత్వము సే
నరు లొందుదు రామనుజు ల
మరభావముఁ గాంతు రమరమానవశ్రేణ్యా.

వ. మఱియు సిద్ధక్షేత్రంబున నానాపుణ్యోదకంబుల మృతు లగువార లమృతత్వంబు గాంతురు. చంద్రద్వీపంబున మదీయభూమిం గనుఁగొనువా రమృతత్వంబు నొందురు. చంద్రద్వీపంబును కిష్కింధాపర్వతంబును గనువార లమరత్వంబు నొందుదురు. వారలకు మదీయనిగ్రహంబు లేదని యెఱింగించిన నారదుండు ధర్మరాజా యనేకధర్మంబుల మత్ప్రోక్తంబు లెఱుంగఁ జెప్పితివి నా కొకసంశయంబు నొడమెఁ గాంతలధర్మంబులను వార లొనర్చు వ్రతంబులను వేర్వేర నెఱింగింపవలయు నని యడిగిన నారదునకు ధర్మరా జిట్లనియె.

కం. నారద యేధర్మంబుల
నారులు నిరతంబు పూని నాకంబున నెం
తే రతి నుండుదు రట్టియు
దారసుధర్మములు దెల్పెద న్విను నిరతిన్.

కం. ఏసతులు పూనుదురు ధా
త్రీసురగురుదైవభక్తి దృఢతరరక్తిన్

జేసి నిరంతర మాసతు
లోసంయమి దివమునందు♦నుండుదు రెపుడున్.

గీ. ఆత్మభర్తృ తుష్టుఁ♦డై యున్న సంతుష్ట
తూర్తుఁ డైన మిగుల♦నార్తయు నగు
నట్టికామినికి సు♦రాలయం బగు గమ్య
మని తలంపు సంది♦యంబు వలదు.

క. ఏలలనామణి పతి కను
కూలయుఁ బ్రియవాదినియు న♦గుం దమితో న
ప్పాలారత్నమునకు వే
యేలా దుర్లభము ధాత్రి♦ నెద్దియుఁ గలదే.

క. ఏకాంతభర్తృవాక్యము
నైకొను దైవతముగాఁగఁ♦ గాంచుఁ బ్రమోదం
బేకలికి వచ్చు పతిఁ గని
యాకామిని దివి వసించు♦నని యెఱుఁగింపన్.

క. నారదుఁ డిట్లనియెను సా
ధ్వీరమణీవార్త దెల్పి♦తివి వింటి నీకం
గారుణ్య మెసఁగ గతవర
నారీధర్మములు దెలియ♦నాకుం జెపుమా.

చ. అన విని కాలుఁ డిట్లను సు(?)రర్షివరా గతభర్తృ యైనకా
మిని జితకోప యై రిపుల ♦ మిత్రులపై సమబుద్ధిఁ జేసి ధ

ర్మనిరతచిత్త యై సుని◆యమవ్రత దానములందు సంతతం
బనితరబుద్ధి నిల్పి శుచి◆యైవసియించుట మేలు భూస్థలిన్.

గీ. భూసురాతిథిదేవతా◆పూజలందు
స్నానసంకల్పములయందు ◆ సంతతంబు
శ్రద్ధ గలిగి చరించిన◆రమణిహీన
కాంతలకు నాకలోకసౌ◆ఖ్యంబు గలుగు.

గీ. ఏతలోదరి నిజభర్త ◆ నెపుడు ద్వేష
బుద్ధి నప్రియతరవాక్య◆ములను బలుకు
నట్టికాంతకు నారకం ◆ బగు గృహంబ
రెండవది యగుఁ గాలుని◆దండనంబు.

క. నారీధర్మము లివి యని
నారదునకుఁ జెల్ప విని మ◆నంబున ముద మిం
పారఁగ శమనాజ్ఞం గొని
ధీరోత్తములార మౌని ◆ దివికిం జనియెన్.

క. అని యమనారదవాదము
మునులకు నమ్మునిసుతుండు ◆ ముదమునఁ దెల్పన్
విని యుబ్బుచు నమ్మౌనులు
చనిరి నిజాశ్రమములకును ◆ జనవరమౌళీ.

సీ. వెండియు నాచికే◆తుండను మునీంద్రు ను
ద్దాలకుఁ గని పల్కె ◆ దయవలిర్ప

నాశ్రమంబులలో గృహస్థాశ్రమంబు మే
లరయఁగ సకలదే(?)వర్షి భూసు
రాతిథిపితృపూజ లాచరింపఁగ బాల
వృద్ధులఁ బోషింప వివిధభూత
తృప్తిఁ జేయంగ నదియె మూలకారణం
బఖిలకర్మాధార మనుచు మౌను
లనిరి కావున సకలవర్ణాశ్రమముల
లోపల గృహస్థుఁ డతిపవిత్రుండు వానిఁ
బోల రెట్టిసుకృతులును భూతలమున
ననిన నుద్దాలకుఁడు విస్మయంబు నొందె.

క. అని వైశంపాయనుఁ డ
జ్జనమేజయనృపున కిట్టిసత్కథ దెలియన్
వినుపించి చనె నిజాశ్రమ
వనభూమికి నాత్మశిష్యవరపరివృతుఁడై.

క. ఈకథఁ జదినవారికిఁ
బ్రాకటబహుపుత్త్రపౌత్త్రరాజ్యసుకీర్తుల్
శ్రీకైవల్యప్రాప్తియుఁ
జేకుఱు నిహపరములందు సిద్ధము దలఁపన్.

ఉ. పండితసత్కవీంద్రజనపద్మనభోమణి సర్వమేదినీ
మండలనాయకోత్తమసుమంత్రిశిఖామణి కీర్తినిర్జితా

ఖండలతుండికాండశశి • కాంతమణి జనదేవతామణి
చండతరప్రభాతరణి • సద్గుణి వేంకటరాయధీమణీ.

మంగళమహాశ్రీ యనువృత్తము.

శ్రీకర జయాస్పద వి • శేషకవిపోషణ య
శేషగుణభూషణ మహావి
ద్యాకమల లోకహిత • దాన నగవర్యఘన
ధైర్య మృగరాజశౌర్యా
నాకపతిభోగ నలి • నాసన ఘనాధిపస
(?)మానఘనసంపద దయావా
ర్ధీ కమలలోచన సు • ధీ సచివసత్తమ వి
తీర్ణజితకర్ణ గుణపూర్ణా.

గద్య. ఇది శ్రీరఘురామపదారవిందమరందపానమధుపాయమానమానస శారదానుగ్రహకటాక్షప్రసాదలబ్ధసరస కవితాధురీధురంధర మల్లికార్జునపౌత్త్ర వేంకటనాయక తనూభవ మల్లికార్జున యశోధారేయ మిక్కిలి మల్లికార్జున నామధేయ ప్రణీతంబైన నాచికేతూపాఖ్యానం బనుమహాకావ్యంబునందు తృతీయాశ్వాసము సంపూర్ణము.

శ్రీగోపాలకృష్ణపరబ్రహ్మణేనమః.